శ్రీరామచంద్రసా[illegible]గత

ప్రధానంబున

కంచెర్ల గోపకవి ప్రణీతంబు నగు

దాశరథీశతకము

ఇది

టీకాతాత్పర్యసహితము.

రామమోహన ముద్రాక్షరశాలయందు

ముద్రితము గాబడి

వారిచేఁ బ్రకటింపఁ బడియె.

ELLORE.

1912.

వెల అణాలు 4.

మా ఔషధముల నొకసారి వాడుడు!

TRADE **Kamalanjan.** MARK
ELLORE

కమలాంజనము:—ఇది తలనొప్పులను, వాయుపోట్లను, పార్శ్వపునొప్పులను, పోట్లను, బెణుకులను, దురదను, తామరను, పుండ్లను, కాల్పులు మొదలైన జబ్బులకే గాక చంచలమతిగలవారికి కూడ ఇది ముఖ్యౌషధము. సీసా 1 కి రు 0-6-0.

TRADE  MARK

వృశ్చిక విషసంహారిణి:—పాషాణము కాదు. తేలుకుట్టగనే యితరౌషధములు వాడక దీనిలో చిన్నగుడ్డముంచి 5 నిమిషములు రాచిన మంచుగడ్డవలె చల్లనై విషములాగివేయును. సీ 1 కి రు 0-5-0.

TRADE  MARK

కమలాకర కస్తూరిమాత్రలు:—ఇవి చంటిబిడ్డలు, గర్భిణిస్త్రీలుగల ప్రతియింట నుండతగినవి. దీనివల్ల దంతనొప్పులు, నోటివాసన, అజీర్తి, ప్లేగు, కలరా దగ్గును పోగొట్టుటయే కాక, చాలకాలము నుండియుండెడు అగ్నిమాంద్యము, మలబద్ధము, కడుపునొప్పి, మొదలైనజబ్బులను హరించును అనేకులకువిక్రయం 100 మాత్రలుండును సీసా 1 కి రు 0-4-0.

యం. ఆర్. ఆచార్యులవారి ప్రశస్తమైన బ్లూబ్లాక్ ఇంకు పౌడరు. (ప్యాకెట్టు 1 కి మూడుబుడ్ల సిరాఅవును.) 100 ప్యాకెట్లు రు 0-10-0, 50 కి 0-5-0, 25 కి 0-3-0, 25 కు తక్కువ పోస్టు ద్వారా పంపబడవు. 25 మొదలు 100 వరకు పోస్టేజి రు 0-3-0లు

పోస్టు, గ్రామము, పేరు విశదముగా వ్రాయవలెను ఇంకననేకౌషధములుగలవు. అ 4 కుతక్కువ పోస్టుద్వారా పంపబడవు. పోస్టుఖర్చులు తెప్పించుకొనువారే వహించవలెను.

మేనేజరు—గోపాల్ ఆయుర్వేద, ఏలూరు. కృష్ణాజిల్లా.

ఓం.

దాశరథీశతకము.

సటీకము.

శ్రీరఘురామ, చారుతుల*సీదళదామ, శమక్షమా
దిశృం। గారగుణాభిరామ, త్రిజ*గన్నుతశౌర్యరమాల
లామ, దు। ర్వారకబంధరాక్షసవి*రామ, జగజ్జనకల్మషా
ర్ణవో। త్తారకనామ,భద్రగిరి*దాశరథీకరుణాపయోనిధీ.

టీ. శ్రీ.. రామ-శ్రీ=సంపదగల, రఘు= రఘురాజుయొక్క-ఇక్ష్వాకువంశమునందు-మూలపురుషుఁడైన రఘురాజుయొక్క-కులమున పుట్టినట్టి, రామ=రామా, చారు...దామ-చారు=అందమైన, తులసీ=తులసియొక్క, దళ=ఆకులచేతనైన, దామ=దండగలవాఁడా, శమ...రామ-శమ=శాంతి, క్షమ=ఓర్పు, ఆది=మొదలైన, శృంగార=మనోజ్ఞములగు, గుణ=గుణములచేత, అభిరామ=మనోహరుఁడైనవాఁడా, త్రిజ...లలామ-త్రిజగత్=మూఁడులోకములచేతను, నుత=పొగడబడిన, శౌర్య=పరాక్రమముయొక్క, రమా=కలిమియనెడి, లలామ=నగగలవాఁడా. లేక, శౌర్యరమా=పరాక్రమ లక్ష్మిచేత, లలామ=మనోజ్ఞుఁడైనవాఁడా యనియు నర్థము, దుర్వా...విరామ-దుర్వార=అడ్డగింపరాని, కబంధరాక్షస= కబంధుఁడనురాక్షసుని, విరామ=అ

ణించినవాఁడా, జగ...నామ జగత్=లోకమునందలి, జన=జనులయొక్క, కల్మష=పాపములనెడి, అర్ణవ=సముద్రమును, ఉత్తారక=దాఁటించునట్టి, నామ=పేరుగలవాఁడా- కరుణాపయోనిధీ=దయాసముద్రుఁడును, అగు, భద్ర...రథీ- భద్రగిరి=భద్రాచలమందు వేంచేసియున్న, దాశరథీ=దశరథునికుమారుఁడైన శ్రీరాముఁడా! అని సంబోధనము.

తా. శ్రీరఘు మహారాజువంశమున పుట్టి, సొగసైన తులసిదండధరించి శమదమము మొదలగు కళ్యాణ గుణములగలిగి, ముల్లోకములందును పొగడఁబడిన పరాక్రమసంపత్తిచే శోభిల్లి, కబంధుఁడను రాక్షసుని అడంచి, లోకులపాపములను దొలంగించుచు, కరుణాసముద్రుఁడవై భద్రాచలమందు వేంచేసియున్న దశరథ కుమారుఁడవైన రామా.

ఉ. రామ, విశాలవిక్రమప*రాజితభార్గవరామ, సద్గుణ
స్తోమ, పరాంగనావిముఖ*సువ్రతకామ, వినీలనీరద
శ్యామ, కకుత్స్థవంశకల*శాంబుధిసోమ, సురారిదోర్బలో
ద్దామవిరామ, భద్రగిరి*దాశరథీ కరుణాపయోనిధీ. 2

టీ. రామ=సర్వజనుల రమింపఁజేయువాఁడా, విశాల...రామ-విశాల=అధికమైన, విక్రమ=పరాక్రమము చేత, పరాజిత=ఓడింపఁబడిన, భార్గవరామ=భృగువంశమునఁబుట్టిన పరశురాముఁడుగలవాఁడా- సద్గుణస్తోమ-సత్+గుణ=మంచిగుణముల యొక్క, స్తోమ=సమూహమైనవాఁడా- పరా...కామ-పర+అంగనా=పరస్త్రీలయందు, విముఖ=పెడముగముగల-పరస్త్రీల

యందు ఆసక్తిలేని, సువ్రత=మంచివ్రతమునందు కాము=ఆస క్తిగలవాఁడా, వినీల...శ్యామ-వినీల=మిక్కిలి నల్లనైన, నీరద=మేఘమువలె, శ్యామ=నల్లనైనవాఁడా, కకు...సోమ-కకుత్స = ఇక్ష్వాకువంశమున సంభూతుఁడైన కకుత్స్థరాజుయొక్క, వంశ=వంశమనెడి, కలశ + అంబుధి=పాలసముద్రమునకు, సోమ=చంద్రుఁడైనవాఁడా- సురా...విరామ-సుర + అరి=దేవతలకు శత్రువులైన రాక్షసులయొక్క, దోః+బల=బాహుబలముయొక్క, ఉద్దామ=అత్యంతమైన, విరామ=నాశనము గలవాఁడా, కరుణాపయోనిధీ = దయాసముద్రుఁడా, భద్రగిరి దాశరథీ=భద్రాచలవాసుఁడైన రామా.

తా. సౌందర్యాదులచే సర్వజనులను రంజింపఁజేయుచు, అధిక పరాక్రమముచే పరశురాముని గెలిచి, పరస్త్రీవిముఖుఁడై యుండు వ్రతమును బూని, నల్లనిమబ్బువంటి దేహకాంతితో నొప్పి, కాకుత్స్థవంశమును వర్ధిల్లఁజేసి రాక్షసులబలమునడంచి, దయాసముద్రుఁడవై యొప్పుచున్న భద్రాచలరామా.

చ. అగణితసత్యభాష, శర*ణాగతపోష, దయాలస
జ్ఝరీ। విగతసమస్తదోష, పృథి*వీసురతోష త్రిలోకపూత
కృ। ద్గగనధునీమరందపద*కంజవిశేష మణిప్రభాధగ।
ద్ధగితవిభూషభద్రగిరి*దాశరథీ కరుణాపయోనిధీ. ౩

టీ. అగ...భాష-అగణిత=ఎన్నరాని, సత్య=సత్యమునకు, భాష=పలుకువాఁడా, లేక, అగణిత=లెక్కింపరానివియు, స

త్య=యథార్థములైనవియు-వస్తుతత్త్వములను దెలుపునవియు అమట, అగు, భాష=వాక్కులుగలవాఁడా, శరణ...పోష-శరణ అగత = శరణుచొచ్చినవారిని, పోష=పోషించువాఁడా, దయా... దోష-దయా=కరుణయనెడి, లసత్=ప్రకాశించుచున్న ఝరీ=ప్రవాహముచేత, విగత=కడిగివైవఁబడిన, సమస్త=సకలమైన, దోష= ఆశ్రితులయొక్క దోషములుగలవాఁడా, పృథివీ... తోష-పృథివీసుర=బ్రాహ్మణులను, తోష=సంతోషపెట్టువాఁడా, త్రి.....విశేష-త్రిలోక=మూఁడులోకములను, పూతకృత్ = పవిత్రముచేయుచున్న, గగనధునీ=ఆకాశనదియైన గంగయనెడు, మరంద=పూఁదేనెగల, పదకంజవిశేష=పాదపద్మవిశేషములుగఁలవాడా-మణి...భూష- మణి=రత్నములయొక్క, ప్రభా=కాంతులచేత, ధగద్ధగిత=ధగధగమనిప్రకాశింపఁజేయఁబడిన, విభూష=భూషణములుగలవాఁడా, కరుణాపయోనిధీ=దయాసముద్రుఁడా, భద్రగిరిదాశరథీ=భద్రాచలవాసియగు రామా.

తా. సత్యవచనుఁడును, శరణాగతులను కాపాడువాఁడును, ఆశ్రితుల దోషములనన్నింటిని మిక్కుటమైనదయచేతఁ బోఁగొట్టువాఁడును, బ్రాహ్మణులను సంతోషపెట్టువాఁడును, ముల్లోకములను పవిత్రముగాఁజేయునట్టిగంగ పుట్టినపాదకమలములు గలవాఁడును, రత్నములకాంతుల ధగధగమెఱయుచున్న యాభరణములను ధరించినవాఁడును దయాసముద్రుఁడును, భద్రాచలవాసియగు శ్రీరామా.

ఉ. రంగదరాతిభంగ, ఖగ*రాజతురంగ, విపత్పరంప
రోత్తుంగతమఃపతంగ, పరి*తోషితరంగ, దయాంత
రంగ! సత్సంగ, ధరాత్మజాహృదయ*సారసభృంగ, నిశా
చరాబ్జమాతంగ, శుభాంగ, భద్రగిరి*దాశరథీ కరుణా
పయోనిధీ. 4

టీ. రం...భంగ-రంగత్ =ప్రకాశించుచున్న-గర్వముచే వి
లసిల్లుచున్న, అరాతి=శత్రువులను, భంగ=భంజించువాఁడా.
ఖగ...తురంగ- ఖగరాజ=పక్షిరాజగు గరుత్మంతుఁడనెడి, తు
రంగ=గుఱ్ఱముగలవాఁడా-గరుత్మంతుని వాహనముగాఁగలవాఁ
డాయనుట, విప...పతంగ- విపత్=ఆపదలయొక్క, పరంప
రా=ఎడతెగని వరుసయనెడి-ఉత్తుంగ=మిక్కిలి యైన, తమః=
చీఁకటికి, పతంగ=సూర్యుఁడైనవాఁడా-పరిం...రంగ- పరితో
షిత= (ఆరాధనముమొదలైనవానిచే) మిక్కిలి సంతోషపెట్టఁబఁ
డిన, రంగ=రంగస్వామి గలవాఁడా- దయా+అంతరంగ=ద
యగల మనస్సుగలవాఁడా, సత్+సంగ=సజ్జనులతోడిసహవా
సము గలవాడా- ధరా...భృంగ-ధరాత్మజా= భూదేవికూఁతు
రైన సీతాదేవియొక్క, హృదయ= మనస్సుఅనెడి, సారస=
పద్మమునకు, భృంగ=తుమ్మెదయైనవాఁడా, మాతంగ-నిశాచర=
రాక్షసులనెడి, అబ్జ=తామరలకు, మాతంగ=ఏనుఁగుఅయినవాఁ
డా, శుభ+అంగ=మంగళప్రదమైన అవయవములు గలవాడా
(కరుణాపయోనిధీ, భద్రగిరి దాశరథీ-ఈరెంటియొక్క అర్థములు
నుపూర్వమువలెనే మీఁద నెల్ల ఊహించుకొనునది.)

తా. శత్రువులను అడంచువాఁడును, గరుడ వాహనుఁడును, ఆశ్రితుల యాపదలను పోఁగొట్టువాఁడును, రంగనాథుని సంతోష పెట్టినవాఁడును, దయతోఁగూడిన మనస్సు గలవాఁడును, సత్పురుషులచే కొలువఁబడిన వాఁడును, సీతయొక్క ప్రేమకును ధ్యానమునకును విషయమైన వాఁడును, దయాసముద్రుఁడునగు భద్రాద్రిరామా.

ఉ. శ్రీద సనందనాదిముని*సేవితపాద దిగంతకీర్తి
సంపాద సమస్తభూతపరి*పాలవినోద విషాదవల్లికాచ్ఛే
ద ధరాధినాథకుల*సింధుసుధామయపాదనృత్తగీతాది
వినోద భద్రగిరి*దాశరథీ కరుణాపయోనిధీ. 5

టీ. శ్రీద-శ్రీ=సంపదను, ద=ఇచ్చువాఁడా, సన...పాద-సనందన+ఆది=సనందనుఁడు మొదలైన, ముని=ఋషులచేత, సేవిత=కొలువఁబడిన, పాద=చరణములుగలవాఁడా, దిగం...సంపాద—దిక్+అంత=దిక్కుల కొనలయందలి, కీర్తి=యశస్సుయొక్క, సంపాద=సంపాదనము గలవాఁడా-సమ... వినోద. సమస్త=సకలమైన- భూత=ప్రాణులయొక్క, పరిపాల=రక్షించుటయందు, వినోద=వేడుక గలవాఁడా, 'మహాప్రసాద భవపాశవిభేద' అనుపాఠమున, మహాప్రసాద=మిక్కిలి అనుగ్రహము, గలవాఁడా, భవ...భేద—భవ=జన్మమనెడి- జన్మపరంపరఅనెడు, పాశ=త్రాడును- విభేద=భేదించువాఁడా, విషా...చ్ఛేద-విషాద=దుఃఖమనెడి, వల్లికా=తీఁగను, ఛేద=త్రెంచువాఁడా-ధరా...పాద—ధరాధినాథ= రాజులయొక్క, కుల=వంశమనె

డు, సింధు=సముద్రమునకు, సుధామయ=అమృతమయములైన పాద=కిరణములుగల చంద్రుఁడైనవాఁడా- నృత్త... వినోద- నృత్త=నర్తనము. గీత=పాట, ఆది=మొదలైన, వినోద=వేడుకలుగలవాఁడా, తక్కినవి సుగమము.

తా. ఆశ్రితులకు సంపదల నిచ్చుచు, సనకసనందాదిఋషులు కొలుచునట్టి పాదములుగలిగి, దిక్కులయందెల్లఁ బ్రసిద్ధినించి, సకలప్రాణులను బ్రోచుచు, దుఃఖములను బోఁగొట్టుచు, రాజకులమునం దవతరించుటచే దానికి అభివృద్ధికలిగించి నృత్తగీతాదులగు వేడుకలం దాసక్తుఁడైన దయాసముద్రుండగు భద్రాచలరామా.

ఉ. ఆర్యులకెల్ల మ్రొక్కి విన*తాంగుఁడనై రఘునాథ
భట్టరా। చార్యుల కంజలెత్తి కవి*సత్తములన్ వినుతిం
చికార్యసౌ। కర్య మెలర్ప నొక్కశత*కం బొనగూర్చిర
చింతునేఁడు తా। త్పర్యమునన్ గ్రహింపు మిది*దాశరథీ
కరుణాపయోనిధీ. 6

టీ. ఆర్యులకున్ ఎల్లన్=పూజ్యులగు పెద్దలకందఱికిని, వినత అంగుఁడనై=అడఁకువచేత వంచఁబడిన అవయవములుగలవాఁడనై, మ్రొక్కి, రఘునాథభట్టర్ ఆచార్యులకున్= రఘునాథభట్టరు అనెడిగురువులకు, అంజలి+ఎత్తి=చేయిమోడ్చి, కవిసత్తములన్=కవిశ్రేష్ఠులను. వినుతించి=కొనియాడి, కార్యసౌకర్యము=[illegible]ర్యను సులభముగా చేయఁగూడుటను, ఎలర్పన్=కలుగఁగా, ఒక్కశతకంబు=ఒకశతకమును, ఒనఁగూర్చి=పొందిక

చేసి, నేఁడు=నేఁటిదినము- ఇప్పుడనుట, రచింతున్=చేసెదను, కరుణాపయోనిధీ=కరుణాసముద్రా, భద్రగిరి దాశరథీ=భద్రాచలవాసియగు శ్రీరామా, ఇది=ఈశతకమును, తాత్పర్యమునన్= ఆసక్తితోడ, గ్రహింపుము=కయికొనుము.

తా. నేను అడఁకువతో పెద్దలకందఱికిని మ్రొక్కి, మాగురువులగు రఘునాథభట్టరువారికి చేయిమోడ్చి, కవిశ్రేష్ఠులను బొగడి, ఆకార్యము సుకరముకాఁగా, ఒకశతకమును మాత్రమే యిపుడు రచించుచున్నాను. కరుణాసముద్రుఁడవైన భద్రాద్రిరామా, నాయీశతకమునుఆసక్తితోఁ బరిగ్రహింపుమీ.

చ మసకొని రేఁగుబండ్లకును*మౌక్తికముల్ వెలవో
సినట్లుదు। ర్వ్యసనముఁ జెంది కావ్యముదు*రాత్ములకిచ్చి
తి మోసమయ్యెనా। రసనకుఁబూతవృత్తి సుక*రంబుగఁ
జేకుఱునట్లువాక్సుధా। రసములుచిల్కఁ బద్యముఖ*రం
గమునందు నటింపవయ్య। సంతసమును జెందిభద్రగిరి*దా
శరథీ కరుణాపయోనిధీ. 7

టీ. మసకొని=ఆసపడి, రేఁగుబండ్లకును, మౌక్తికముల్=ముత్తెములను, వెలపోసినట్లు= వెలగానిచ్చినవిధమున, దుర్వ్యసనమున్=చెడ్డఆసక్తిని, చెంది=పొంది, కావ్యము=కావ్యమును, దురాత్ములకున్=చెడ్డమనసుగలవారికి, ఇచ్చితిన్= అంకితముగా ఇచ్చితిని. మోసముఅయ్యె=దానిచే మోసపోయితి, నారసనకున్=నాయొక్క-నాలుకకు, పూతవృత్తి=పరిశుద్ధమైన వర్తనము-సుకరంబుగన్=సులువుగా, చేకుఱునట్లు=కలుగునట్లు, వాక్

సుధారసములు=వాక్కులనెడి యమృతరసములు, చిలుకు=ఒలుకునట్లు, పద్యముఖరంగమునందు=పద్యములుగల నాముఖమనెడి నాట్యరంగమునందు, సంతసమును= సంతోషమును, చెంది, భద్రగిరిదాశరథీ, కరుణాపయోనిధీ, నటింపవయ్య = నాట్యము సేయుమా.

తా. రేగుపండ్లకు ఆసపడి ముత్యాలు వెలగాపోసినట్లు, దుష్టులకు ఆసపడి వారికి కావ్యములను చెప్పి పురుషార్థమును చెందక మోసపోయితిని. వారిని వర్ణించుటచే నానాలుక కులినమైనది. కావున దానికి పరిశుద్ధి సులువుగా కలుగునట్లు నీకంకితముగా కావ్యము సేయఁ గోరెద. అప్పుడు నానాలుకయనెడి రంగమునందు నీవు నిలిచి నటించి అమృతములొలుకునట్టి పద్యములను జెప్పునట్లు చేయవలయును.

ఉ. శ్రీరమణీయహార, యత*సీకుసుమాభశరీర, భక్త
మం। దార, వికారదూర, పరత*త్త్వవిహార, త్రిలోక
చేతనో। ద్ధార, దురంతపాతకవి*తానవిదూర, ఖరారి
దైత్యకాం। తారకుఠార, భద్రగిరి*దాశరథీ కరుణాప
యోనిధీ. 8

టీ. శ్రీ...హార-శ్రీ=కాంతిచేత, రమణీయ=మనోహరమైన, హార=దండగలవాఁడా. అతసీ...శరీర-అతసీకుసుమ=అవిసెపువ్వులతో, ఆభ=సాటియైన, శరీర= దేహముగలవాఁడా, భక్తమందార= భక్తులకుకల్పవృక్షమైనవాఁడా- వికారదూర=వికారము లేనివాఁడా-పరతత్త్వవిహార-పరతత్త్వ=పరమాత్మస్వరూ

వముచేత, (అంతటను) విహర=విహరించువాఁడా, త్రిలో...ద్ధార-త్రిలోక=మూఁడులోకములందలి, చేతన=జీవులను, ఉద్ధార=ఉద్ధరించువాఁడా, దుర...దూర-దురంత=అంతములేని, పాతక=పాపములయొక్క, వితాన=సమూహమునకు, విదూర=మిక్కిలిదూరమైనవాఁడా, ఖరా...సు తార=ఖర+ఆది=ఖరుఁడు మొదలుగాఁగల, దైత్య=రాక్షసులనెడి, కాంతార=అడవికి, కుఠార=గొడ్డలియైనవాఁడా-కరుణాపయోనిధీ, భద్రగిరి దాశరథీ.

తా. కాంతి దళుకొత్తుహారములు దాల్చి, అగిసెపూలవంటి మేని కాంతిగలిగి, భక్తులకోర్కెలు దీర్చుచు, అంతటను నిండియుండి ముల్లోకములందలి జీవులనుద్ధరించుచు, సకలపాపములకు దూరుఁడై, ఖరుఁడు మొదలగు రాక్షసులను సంహరించి దయాసముద్రుండై యొప్పు భద్రగిరిరామా.

చ. దురితలతాలవిత్ర, ఖర*దూషణకాననవీతిహోత్ర భూ। భరణకళావిచిత్ర, భవ*బంధవిమోచనసూత్ర చారు వి। స్ఫురదరవిందనేత్ర, ఘన*పుణ్యచరిత్ర, వినీల భూరికం। ధరసమగాత్ర, భద్రగిరి*దాశరథీ కరుణాపయోనిధీ. 9

టీ. దురిత=పాపమనెడి, లతా=తీఁగలకు, లవిత్ర=కొడవలియైనవాఁడా- ఖర ... హోత్ర-ఖరదూషణ=ఖరుఁడు దూషణుఁడుఅను, కానన = అడవికి, వీతిహోత్ర=అగ్నియైనవాఁడా-భూ...విచిత్ర-భూ=భూమిని, భరణ=భరించుటయను, కళా=నేర్పుచేత, విచిత్ర=విచిత్రుఁడైనవాఁడా-విచిత్రలీలలచేత భూమిని భ

రించువాఁడాయనుట, భవ...సూత్ర-భవ=పుట్టుకయనెడి, బంధ=ముడిని, విమోచన=విడగొట్టుటయను, సూత్ర=విధిగలవాఁడా-చారు...నేత్ర- చారు=సుందరమై, విస్ఫురత్ =మిక్కిలి ప్రకాశించుచున్న, అరవింద=తామరలవంటి, నేత్ర=కన్నులుగలవాఁడా, ఘన ... చరిత్ర-ఘన=మిక్కిలి, పుణ్య=పవిత్రమైన, చరిత్ర=నడవడిగలవాఁడా, వినీ ... గాత్ర-వినీల =మిక్కిలినల్లనై, భూరి=అధికమైన, కంధర=మబ్బుతోడ, సమ = సమానమైన, గాత్ర = దేహముగలవాఁడా.

తా. తీఁగలను కొడవలివలె పాపములను త్రుంచుచు, అగ్ని అడవినివలె ఖరదూషణులను నాశముసేసి, నానావిధలీలలచేభూమి నిరక్షించుచు, జన్మపరంపరలను దూలించుచు, సొగసైన తామరలవంటికన్నుఁగవ గలిగి, మిక్కిలిపావనమైనచరిత్రమునఁబ్రవర్తిల్లి, కడునల్లనిమబ్బువంటి దేహముదాల్చి యొప్పుచు, కరుణాసముద్రుఁడవైన భద్రాచలరామా.

చ. కనకవిశాలచేల భవ*కాననశాతకుఠారధార స
జ్జనపరిపాలశీల దివి*జస్తుతసద్గుణకాండ కాండసం। జని
తపరాక్రమక్రమవి*శారద శారదకందకుందచం। దనఘ
నసారసారయశ*దాశరథీ కరుణాపయోనిధీ. 10

టీ. కనక...చేల = కనక = బంగారు మయమును, విశాల= విరివియైనదియును, అగు, చేల= వస్త్రముగలవాఁడా, భవ...ధార-భవ = పుట్టుకయనెడి, కానన = అడవికి, శాత = వాఁడియైన, కుఠార=గొడ్డలియొక్క, ధార=వాయియైనవాఁడా, స...శీల

సత్ + జన=సత్పురుషులను, పరిపాల=రక్షించుటయే, శీల=స్వభావముగాఁగలవాఁడా, దివి...కాండ-దివిజ=దేవతలచేత, స్తుత=పొగడఁబడిన, సద్గుణ=మంచి గుణములయొక్క, కాండ=సమూహముగలవాఁడా, కాండ...విశారద- కాండసంజనిత=నీటియందు పుట్టిన అగ్నియొక్క, పరాక్రమ=శౌర్యముయొక్క, క్రమ=విధమునందు, విశారద=పండితుఁడైన వాఁడా-శార...యశ-శారద=శరత్కాల సంబంధియైన, కంద=మేఘము, కుంద=మొల్లలు, చందన=చందనము, ఘనసార=పచ్చకర్పూరము వీనివలె, సార=శ్రేష్ఠమైన, యశ=కీర్తిగలవాఁడా.

తా. విలువైన బంగరు వస్త్రమునుగట్టి, గొడ్డలివాఁడిమొనచే అడవిని నఱుకునట్లు జన్మపరంపరను నాశముచేసి, సత్పురుషులను రక్షించుటయే వృత్తియై, దేవతలు పొగడునట్టి గుణగణముచే రాణించి, అగ్నివంటి పరాక్రమముతోఁగూడి, శరత్కాలమేఘములు మల్లెలు చందనము పచ్చకప్పురము మొదలైనవానివలె తెల్లనై మెఱయుచున్న కీర్తిగలిగి, కరుణానిధివైన భద్రగిరిరామా.

ఉ. శ్రీరఘువంశతోయధిక*శీతమయూఖుఁడవైన నీ
పవిత్రోరుపదాబ్జముల్ వికసి*తోత్పలచంపకవృత్తమా
ధురీ పూరితవాక్ప్రసూనములఁ*బూజలొనర్చెదఁ జిత్త
గింపుమీ తారకనామ భద్రగిరి * దాశరథీ కరుణాప
యోనిధీ 11

టీ. శ్రీ...ధికి-శ్రీ=సంపత్కరమైన, రఘువంశ=రఘురాజు కులమనెడి, తోయధికిన్=సముద్రమునకు, శీతమయూఖుఁడవు=

చంద్రుఁడవు-ఐన...ముల్-ఐన=అయినట్టి, నీ=నీయొక్క, పవిత్ర=పావనములును, ఉరు=గొప్పవియు-అగు, పద+అబ్జముల్=తామరలవంటి యడుగులను, వికసి...సూనములన్-వికసిత=వికసించిన-ఉత్పల=ఉత్పలమాలికలు, చంపక=చంపకమాలికలు, అనెడి, వృత్త=ఛందోవృత్తములయొక్క, మాధురీ=తీయఁదనముచేత, పూరిత=నిండింపఁబడిన, వాక్=వాక్కులనెడ, వికసిత=వికసించిన, ఉత్పల=నల్లగలువలయు, చంపక=సంపెంగలయు, వృత్త=వర్తనముఁగలవియు, మాధురీ=చక్కఁదనముచేత, పూరిత=నిండినవియు, అగు, ప్రసూనములన్=పువ్వులచేత-ఉత్పలమాలికా చంపమాలికా వృత్తములనెడి ఉత్పలములు చంపకములు అను పుష్పములచేత ననిభావము, పూజలు, ఒనర్చెదను=చేసెదను తారకనామ-తారక=సంసారమును తరింపఁజేయునట్టి, నామ=దివ్యనామముగలవాఁడా, భద్ర...పయోనిధీ, నా పూజలను, చిత్తగింపుమీ=అంగీకరింపుమా,

తా. చంద్రుఁడు తాను పుట్టినసముద్రమును వర్ధిల్లఁజేయునట్లు రఘుమహారాజువంశమునంబుట్టి దానిని వర్ధిల్లఁజేయువాఁడవైన నీయొక్క పాదారవిందములను ఉత్పలచంపక మాలికా వృత్తములందలి వాక్కులనెడి ఉత్పలచంపకపుష్పములచేతఁ బూజించుచున్నాను. వానిని నీవు కయికొనుమా.

చ. గురుతర మైనకావ్యరస* గుంభన కబ్బురమంది
ముష్కరుల్। సరసులమాడ్కి సంతసిలఁ*జాలుదురోటు
శశాంకచంద్రికాం। కురముల కిందుకాంతమణి*కోటి స్ర

వించినభంగి వింద్యభూ। ధరమున జాఱునే శిలలు*దాశ
రథీ కరుణాపయోనిధీ. 12

టీ. గురుతరము=మిక్కిలిగొప్పది, ఐన...భనకున్-ఐన, కావ్య-కావ్యమునందలి, రస=శృంగారాది రసములయొక్క, గుంభనకున్=కూర్పునకు, ముష్కరుల్=రసజ్ఞతలేనిమూఢులు, సరసులకైవడిన్=రసికులవలె, అబ్బురము అంది=ఆశ్చర్యమును పొంది, సంతసిలన్=సంతోషించుటకు, చాలుదురోటు=శక్తులగుదురా-కానేరరు, ఇందులకు దృష్టాంతము చెప్పుచున్నాడు. శశా= కురములకున్- శశాంక= (జింకను గుఱుతుగాఁగల) చంద్రునియొక్క, చంద్రిక=వెన్నెలలయొక్క, అంకురములకున్=మొలకలకు- ఇందు...కోటి-ఇందుకాంతమణి=చంద్రకాంతమణులయొక్క, కోటి=సమూహము, స్రవించినభంగిన్=కరఁగి జాఱినరీతిని, వింధ్యభూధరమునన్=వింధ్యపర్వతమునందు, శిలలు-ఱాలు, జాఱునే=కరఁగిస్రవించునా-స్రవింపదనుట.

తా. చంద్రుని కిరణములకు చంద్రకాంతమణులు కరఁగునట్లు వింధ్యపర్వతపుశిలలుకరఁగి స్రవింపఁజాలవు. ఇట్లే గొప్పకావ్యమునందలి రసస్ఫూర్తికి రసికులవలె మూఢులైన వారు మెచ్చి సంతోషింపఁజాలరు. కావున నా కావ్యమును సరసుఁడవైన నీకు అంకితము సేయుచున్నాను.

ఉ. తరణికులేశ నానుడులఁ*దప్పులు గల్గిన నీదునా
మస। ద్విరచిత మైనకార్యము ప*విత్రముగాదె వియన్న
దీజలం। బరుగుచు వంకయైన మలి*నాకృతిఁ బాఱినఁ ద

న్మహాత్త్వముం। దరమె గణింప నెవ్వరికి* దాశరథీ కరుణా
పయోనిధీ. 13

టీ. తరణికుల + ఈశ = సూర్యకులమున జనించినవారిలో శ్రేష్ఠుఁడైనవాఁడా, నానుడులన్ = నామాటలందు, తప్పులు = దోషములు - కావ్యదోషములు, కలిగినన్ = కలిగినప్పటికిని, నీదు...రచితము - నీదు = నీయొక్క, నామ = పేరితోడ, సత్ = శ్రేష్ఠమైనదియు, విరచిత = రచింపఁబడినదియు, ఐన కావ్యము = అయినట్టికావ్యము, పవిత్రము కాదె = పావనమేయగునుగదా, ఇందులకు దృష్టాంతము చెప్పుచున్నాఁడు, వియత్ + నదీజలంబు = ఆకాశనదియైన గంగయొక్క నీరు, అరుగుచున్ = పోవుచు - ప్రవహించుచు, వంకయైన = వంకరగానైనను - వంకరగా పాఱినను, కులిన ఆకృతిన్ = ముఱికిగల ఆకారముతో, పాఱినన్ = ప్రవహించినను, తత్ మహత్త్వమున్ = దాని మహాత్మ్యమును, గణింపన్ = ఎన్నుటకు, తరమె = శక్యమా - శక్యము కాదు.

తా॥ గంగానది వంకరగా గాని ముఱికితోఁ గూడిగాని పాఱినప్పటికిని మహనీయమైన తన పేరుచేతనే అది పవిత్రమగునట్లు నా కావ్యము ఎన్నితప్పులు గలిగియుండినను, మహనీయమైన నీపేరు చేతనే పవిత్రమేయగునని తాత్పర్యము.

ఉ. దారుణపాతకాబ్ధికి స*దాబడబాగ్ని భవాకులా
ర్తి విస్తారదవానలార్చికి సు*ధారసవృష్టి దురంతదుర్మ
తాచారభయంకరాటవికిఁ*జండకఠోరకుఠారధార నీతా
రకనామమెన్నఁగొన *దాశరథీ కరుణాపయోనిధీ. 14

టీ. నీతారకనామము=సంసారమును తరింపఁజేయునట్టి నీనామము, ఎన్నుకొనఁగ=తలఁపఁగా, దారుణపాతకాబ్ధికిన్-దారుణ=భయంకరమైన, పాతక=పాపములు అనెడి, అబ్ధికిన్=సముద్రమునకు, సదా=ఎప్పుడును, బడబాగ్ని=బడబాగ్నియైనది-భవాకులార్తి...చికిన్-భవ=సంసారమునందు, ఆకుల=వ్యాప్తమైయున్న, ఆర్తి=పీడయొక్క, విస్తార=బాహుళ్యమనెడి. దవ+అనల=కార్చిచ్చుయొక్క, అర్చికిన్=సెగకు, సుధారసవృష్టి=అమృతద్రవవర్షము-దురం...రాటవికిన్- దురంత=అంతములేని- మితిమీరిన, దుర్మత=దుష్టమతములయొక్క, ఆచార=ఆచారములనెడి, భయంకర=భయమును గలిగించునట్టి, అటవికిన్=అడవికి, చండ...ధార-చండ=తీక్ష్ణమును, కఠోర=కటువైనదియు, అగు, కుఠార=గొడ్డలియొక్క, ధార=మొన

తా. సంసారతారకమైన నీరామనామము, బడబాగ్ని సముద్రమును పీల్చునట్లు అతిబహుళము లైనపాతకములను బోఁగొట్టును; అమృతవర్షము కార్చిచ్చును చల్లార్చునట్లు సంసారబాధలను ఉపశమింపఁజేయును; వాఁడి గొడ్డలిమొనచే భయంకరమైనఅడవిని నఱకునట్లు, మితిలేని దుర్మతాచారములను నిర్మూలముసేయును.

చ. హరునకు నవ్విభీషణున * కద్రిజకుం దిరుమంత్ర
రాజమై కరికి నహల్యకున్ ద్రుపద * కన్యకు నార్తి హరిం
చుచుట్టమై పరఁగినయట్టినీపతిత * పావననామము జిహ్వ
పై నిరంతరము నటింపఁజేయు మిఁక * దాశరథీ కరుణా
పయోనిధీ. 15

టీ. హరునకుఁ=శివునకును, ఆ+విభీషణునకుఁ= ప్రసిద్ధుఁడైన విభీషణునికిని, అద్రిజకుఁ=(హిమవత్పర్వతము కూఁతురైన) పార్వతికిని, తిరుమంత్రరాజము-తిరు=శ్రీకరమైన-ఇది శ్రీశబ్దమునకు ద్రవిడభాషయందలివికృతి, మంత్రరాజము=శ్రేష్ఠమైనమంత్రము, ఐ=అయి, కరికిఁ=ఏనుఁగునకును, అహల్యకుఁ=అహల్యకును, ద్రుపదకన్యకుఁ=ద్రుపదునికూఁతు రైనద్రౌపదికిని, ఆర్తిఁ=బాధను- మనోవ్యథను, హరించుచుట్టము- పోఁగొట్టునట్టి బంధువు-ఐ=అయి, పరఁగిన...నామము- పరఁగినయట్టి=ప్రసిద్ధినొందినట్టి, నీ=నీయొక్క, పతిత=పతితులైన వారిని, పావన=పవిత్రులను జేయునట్టి, నామము=పేరు, ఇఁకఁ, జిహ్వపైఁ=నాలుకమీఁద, నిరంతరము=ఎడతెగక, నటింపఁజేయుము=నృత్యము నేయునట్లు చేయుమా- నేను పలుమాఱును జపించునట్లు చేయుమా యని భావము.

తా. కరుణాసముద్రుఁడ వైనదశరథరామా! శివునికిని విభీషణునికిని పార్వతికిని శ్రేష్ఠమైన మంత్రమై; గజేంద్రునికిని అహల్యకును, ద్రౌపదికిని చుట్టమువలె వెతలను తొలఁగించునదై; పాపులను పవిత్రులను జేయునట్టి నీ నామమును నానాలుకయందు నటించునట్లు చేయుమా.

ఉ. ముప్పునఁ గాలకింకరులు * ముంగిట వచ్చినవేళ, రోగముల్ । గొప్పరమైనచోఁ. గఫము * కుత్తుకనిండినవేళ, బాంధవుల్ । గప్పిన వేళ, మీస్మరణ * గల్గునొ గల్గ

దో నాఁటి కిప్పుడే । తప్పకచేతు మీభజన * దాశరథీకరు
ణాపయోనిధీ. 16

టీ. ముప్పునన్ = వార్ధకమందు, కాలకింకరులు = యమదూత
లు, ముంగిటన్ = ఇంటిముంగిటికి, వచ్చినవేళన్ = వచ్చినట్టిసమ
యమునను, రోగముల్ = తెవుళ్ళు, కొప్పరము = అతిశయించినవి,
ఐనచోన్ = అయినప్పుడును, కఫము = శ్లేష్మము కుత్తుకన్ = కంఠ
మునందు, నిండినవేళన్ = పూర్ణమైన సమయమందును, బాంధ
వుల్ = చుట్టములు, కప్పినవేళన్ = క్రమ్ముకొన్నప్పుడును, మీస్మ
రణ = మిమ్ము స్మరించుట, నాఁటికిన్ = అప్పటికి, కల్గునొ = కలు
గునో, కల్గదొ = కలుగదో యేమొ, ఇప్పుడే, తప్పక = విడువక,
మీభజన = మిమ్ము భజించుట, చేతున్ = చేయుదును.

తా. శ్రీరామా ! ముసలితనమువచ్చి యమదూతలు నేనున్న
చోటికి వచ్చినపుడు, రోగములు మిక్కిలి ముమ్మరమైనపుడును,
మరణము సమీపింపఁగా కఫము గొంతుకయందు నిండుకొన్నపు
డును, చుట్టములు చుట్టుక్రమ్ముకొని యుండఁగాను, మిమ్ము
స్మరించుట నాకుఁ గలుగునో కలుగదో చెప్పఁజాలను. కనుక
ఇప్పుడే నిన్ను తప్పక భజనసేసెదను.

అవ—ఁ యముఁడు రామభక్తులను గుఱించి తన దూతలతో
చెప్పు మాటలను కవి తెలుపుచున్నాఁడు.

చ. పరమదయానిధే పతిత * పావననామ హరే య
టంచు సు । స్థిరమతులై సదా భజన * సేయుమహాత్ము
లపాదధూళి నా । శిరమునఁ దాల్తు మీరటకుఁ * జేరకుఁ

డంచు యముండు కింకరో త్కరముల కానఁ బెట్టు నఁ
ట ✻ దాశరథీ కరుణాపయోనిధీ. 17

టీ. పరమ...నిధే-పరమ=మిక్కిలి యగు దయా=కృపకు, నిధే=నిధానమైనవాఁడా, పతిత...నామ—పతిత=పాపాత్ములను, పావన=పవిత్రులనుగాఁ జేయునట్టి, నామ=పేరుగలవాఁడా, హరే=హరీ, అటంచున్=అని, సదా=ఎల్లప్పుడును, స్ఫురితనామములు—స్ఫురిత=మిక్కిలి—ప్రకాశించుచున్న గల, మనంబు=మనస్సు గలవారు, ఐ=అయి, భజన=భజించుట, చేయు...ధూళి-చేయుమహాత్ములు=చేయునట్టి మహనీయులనొక్క, పాదధూళి=అడుగులదుమ్ము నా శిరమునన్=నా తలయందు, తాల్తున్=ధరింతును, మీరు, అటకున్=వారికడకు, చేరకుఁడు=పోవకుఁడు, అంచున్=అనుచు, యముండు=యముఁడు, కింకర+ఉత్కరములకున్=తన సేవకుల సమూహములకు, ఆనఁ బెట్టు నఁట=ఆజ్ఞాపించునని చెప్పుదురు-రామభక్తులకు నరకభయము కొంచమైనను కలుగదని తాత్పర్యము.

చ. అజునకుఁ దండ్రివయ్యు సన✻కాదులకుం బరత
త్త్వమయ్యున। ద్విజమునికోటి కెల్లఁ గుల✻దేవతవ
య్యు దినేశవంశభూ। భుజులకు మేటివయ్యుఁ బరి✻పూ
ర్ణుఁడవై వెలుఁగొందు పక్షిరా। డ్ధ్వజ మిముఁ బ్రస్తుతిం
చెదను ✻ దాశరథీ కరుణాపయోనిధీ. 18

టీ. అజునకున్=బ్రహ్మకు, తండ్రివయ్యున్=తండ్రివి గాను, సనక+ఆదులకున్=పరతత్త్వవేత్తలైన సనకుఁడు సనందుఁడు మొ

దలైనవారికి, పరతత్త్వము అయ్యెన్ = (వారు విచారము సేయు) ఉత్కృష్టవస్తువుగాను, సత్...కోటికిన్ = సత్ = శ్రేష్ఠులైన, ద్విజ = బ్రాహ్మణులయొక్క, ముని = ఋషులయొక్క, కోటికిన్ + ఎల్లన్ = సమూహమునకు అంతకు, పరదేవతవు అయ్యె = శ్రేష్ఠమైనదైవముగాను, దినేశ...భుజులకు-దినేశ = సూర్యుని యొక్క, వంశ = కులమందలి, భూభుజులకున్ = రాజులకు, మేటివయ్యెన్ = శ్రేష్ఠుఁడవుగాను, పరిపూర్ణుఁడవు = నిండినవాఁడవు ఐ = అయి, వెలుఁగొందు...ధ్వజ-వెలుఁగొందు = ప్రకాశించుచున్న, పక్షిరాట్ + ధ్వజ = పక్షులకెల్ల రాజైనగరుత్మంతుఁడు కేతనముగాఁ గలవాఁడా, దాశరథీ, కరుణాపయోనిధీ, మిమున్ = మిమ్ము, ప్రస్తుతించెదను = మిక్కిలిస్తోత్రము చేసెదను.

తా. బ్రహ్మకు తండ్రివిగాను, సనకాదిమహర్షులు ధ్యానము సేయుపరతత్త్వముగాను, విప్రమునిసమూహములు కొలుచునట్టి పరదైవముగాను, ఇట్లు అన్నిలక్షణములను పరిపూర్తినొందినవాఁడవై గరుడుఁడు ధ్వజముగాఁ గలిగి ప్రకాశించుదయానిధీ! దశరథరామా! నిన్ను మిక్కిలి స్తోత్రము చేసెదను.

ఉ " పండితరక్షకుం, డఖిల*పాపవిమోచనుఁ, డబ్జ
సంభవా। ఖండలపూజితుండు, దశ*కంఠవిలుంఠనచండ
కాండకో। దండకలాప్రవీణుఁ " డను*తావకకీర్తివధూ
టికిత్తుఁబూ । దండలు గాఁగ నాకవిత*దాశరథీ కరుణా
పయోనిధీ. 19

టీ. పండితరక్షకుండు=పండితులను రక్షించువాఁడు, అఖిల... మోచనుఁడు- అఖిలపాప=సమస్త పాపములనుండి, విమోచనుఁడు=విడిచిపుచ్చువాఁడు-భక్తులను వారిపాతకముల నుండి విడిపించువాఁడనుట, అబ్జ...పూజితుండు-అబ్జసంభవ=బ్రహ్మచేతను, ఆఖండల= ఇంద్రునిచేతను, పూజితుండు= పూజింపఁబడువాఁడు, దశ...ప్రవీణుఁడు-దశకంఠ=రావణాసురునిఁ పడతలలను, విలుంఠన=నఱుకుటచేత చండ=తీక్ష్ణమైన, కాండ= బాణములుగల, కోదండకలా=విలువిద్యయందు, ప్రవీణుఁడు=నేర్పరియైన వాఁడు- ఇట్టివాఁడవు, అను ...వధూటికిన్-అను = అనెడి, తావక= నీయొక్క, కీర్తి=యశస్సుఅనెడి, వధూటికిన్= స్త్రీకి-కీర్తిని- నాకవిత=నాకవిత్వమును - నాకవనరూపమైన శతకము= ననుట, పూదండలు గాఁగ= పూలసరములు అగునట్లుగా- ఇత్తున్=ఇత్తును. నాకవిత్వముచే నీకీర్తిని వర్ణించి శోభాస్పదముగాఁ జేయుదునని ఆశయము.

తా. కరుణాసముద్రుఁడ వైనదశరథరామా! ‘పండితులను రక్షించువాఁడు; పాపములను తొలఁగించువాఁడు; బ్రహ్మేంద్రాదులచే పూజింపఁబడువాఁడు; రావణాసురునితలలు దునుమునట్టివాఁడి బాణములను వేయ నేర్చి విలువిద్యయం దారితేరినవాఁడు’ అని నీవుపొందినకీర్తికి నాకవిత్వమును ఇచ్చి ఒకవడఁతికి పూదండలిచ్చి యలంకరింపజేసినట్లు ఆకీర్తిని శోభిల్లఁజేయుదును.

ఉ. శ్రీరమ సీత గాఁగ, నిజ*సేవకబృందము వీరవై
ష్ణవా। చారజనంబు గాఁగ, విర*జానది గౌతమి గా, వి

కుంఠము। న్నారయ భద్రశైలశిఖ*రాగ్రము గాఁగ, వ
సించి చేతనో। ద్ధారకుఁడైనవిష్ణుఁడవు*దాశరథీ కరుణా
పయోనిధీ. 20

టీ. శ్రీరమ=లక్ష్మీదేవి, సీత కాఁగ=సీతాదేవి కాఁగా, నిజ...బృందము-నిజ= తనదైన, సేవకబృందము= పరిజనులసమూహము- వీర... జనంబు కాఁగ- వీరవైష్ణవ- కేవలవిష్ణువునే దృఢముగాఁ గొలుచువారియొక్క, ఆచార= ఆచారముగల-జనంబు కాఁగ = జనులు కాఁగా, విరజానది-విరజ అనెడి ఏఱు, గౌతమి కాఁగ=గోదావరి కాఁగా, వికుంఠముగ=వైకుంఠమును, అరయఁగ=విచారింపఁగా, భద్ర...రాగ్రము కాఁగ-భద్రశైల=భద్రాచలముయొక్క, శిఖర = శిఖరముయొక్క, అగ్రము కాఁగ=కొన కాఁగా, వసించి=(ఈభూలోకమందు) నెలకొని, చేతన+ఉద్ధారకుఁడు=జీవుల నుద్ధరించువాఁడు, ఐన విష్ణుఁడవు=అయినట్టి విష్ణుదేవుఁడవు.

తా. దయాసింధువైన దశరథరామా! నీవు పరమపదమందున్న లక్ష్మీదేవిని ఇచట సీతగాఁజేసికొని, అందలి పరివారజనులు ఇచట వీరవైష్ణవజనులుగా వచ్చి కొలుచుచుండఁగా, అచట విరజానది యిచట గోదావరిగా ప్రవహింపఁగా, ఆ వైకుంఠమె యిచట భద్రగిరికొమ్మకొనయై రాణింపఁగా, వేంచేసి చేతనులను ఉద్ధరించుచున్న శ్రీవిష్ణుదేవుఁడవే కాని వేఱు కావు.

ఉ. కంటి నదీతటంబుఁ, బొడ*గంటిని భద్రనగాధి
వాసముం। గంటి నిలాతనూజ, నురు*కార్ముకమార్గణ

శంఖచక్రములు। గంటిని, మిమ్ము లక్ష్మణునిఁ*గంటిఁ, గృ
తార్థుఁడ నైతి నోజగ। త్కంటకదైత్యనిర్దళన* దాశరథీ
కరుణాపయోనిధీ. 21

టీ ఓ జగత్...నిర్దళన-జగత్=లోకములను, కంటక=హింసించువారైన, దైత్య=రాక్షసులను, నిర్దళన= సంహారించువాఁడా, కరుణాపయోనిధీ, దాశరథీ, నదీతటంబు= (భద్రాచలమునొద్దనుండు గోదావరి) నదియొక్క-తీరమును, కంటిన్= చూచితిని, భద్రనగ+అధివాసమున్= భద్రాచలము అనెడినీవాసస్థానమును, కంటిన్=చూచితిని, ఇలాతనూజన్=భూమికి కూఁతురైనసీతాదేవిని, కంటిన్=చూచితిని; ఉరు...చక్రముల్-ఉరు=గొప్పలైన, కార్ముక=విల్లు, మార్గణ=బాణములు, శంఖచక్రముల్=శంఖమును చక్రమును-ఇవి భద్రాచలమందు ఉండున వి-కంటిని=చూచితిని. కృతార్థుఁడను=కృతకృత్యుఁడను, ఐతిన్=అయితిని.

తా. లోకహింసకులైన రాక్షసులను రూపుమాపి దయాసముద్రుఁడవైన యొప్పశ్రీరామా! నీవు వసించి యున్న భద్రగిరియొద్దనున్న గోదావరినదిగట్టును, నీవు వేంచేసియున్న భద్రాచలవాసమును, సీతాదేవిని. నీవిల్లును, బాణములను, శంఖచక్రములను, నిన్నును, లక్ష్మణుని జూచి కృతార్థుఁడనైతిని.

చ. హాలికునకున్ హలాగ్రిమున * నర్థముసేకురుభం
గి, దప్పిచే। నలమటఁ జెందువానికి సు * రాపగలో జల
మబ్బినట్లు, దుర్మలినమనోవికారి న గు*మర్త్యుని నన్నొడఁ

గూర్చి నీపయిం। దలఁపు ఘటింపఁ జేసితివి*దాశరథీ కరు
ణాపయోనిధీ. 22

టీ. కరుణాపయోనిధీ, దాశరథీ, హాలికునకున్=మడఁక దున్నువానికి, హల+అగ్రహమునన్=నాగలిమొనయందు-అర్థము=లిబ్బి, చేకురుభంగిన్=లభించినవిధమున-దప్పిచేన్=నీరువట్టుచేత, అలమటన్=బడలికను, చెందువానికిన్=పొందువానికి, సుర+ఆపగలోన్=గంగలో, జలము=నీరు, అబ్బినట్లు=దొరకినవిధమున-దుర్మలిన...వికారిని- దుర్మలిన=మిక్కిలిదోషయుక్తమైన, మనో=మనస్సుయొక్క, వికారిని=వికారములుగలవాఁడును-అగుమర్త్యునిన్= అయినమనుష్యుని, నన్నున్, ఒడఁగూర్చి=సవరించి, నీపయిన్= నీ మీఁద, తలఁపు= చింతనము, ఘటింపఁ జేసితివి=కలుగఁజేసితివి.

తా. అటుక దున్నికొనుబీదకు నానాఁగేఁటిముంగల భూమిలో ధనము దొరకినట్లును, దప్పిగొని బడలినవానికి గంగానదిలోనినీరులభించినట్లును, దుష్టమనోవ్యాపారములు గలమనుష్యుఁడ నైన నన్ను చక్కఁజేసి నీపయి చింతనము కలిఁగించి కృతార్థుని గావించితివి.

ఉ. కొంజక తర్కవాద మను*గుద్దలిచేఁ బరతత్త్వ
భూస్థలిన్। రంజిలఁ ద్రవ్వి కన్గొనని * రామనిధానము నేఁ
డు భక్తిసి। ద్ధాంజనమందు హస్తగత*మయ్యె భళీయ
నఁగా మదీయహృ। త్కంజమునన్ వసింపు మిఁక*దాశర
థీ కరుణాపయోనిధీ. 23

టీ. కొంజక=సంకోచింపక, తర్క-వాదము=తర్కముచే చేయువివాదము, అను గుద్దలిచేత-అనెడి గుద్దలిచేత, పరతత్త్వభూస్థలిన్=పరతత్త్వము అనెడిభూమిప్రదేశమును, రంజిలన్=ఒప్పుఁగా, త్రవ్వి, కన్గొనని రామనిధానము= చూడలేని రాముఁడుఅనెడినిధి, నేఁడు=ఇపుడు, భక్తిసిద్ధాంజనమునన్=భక్తియనెడిసిద్ధకృతమైన కాటుకయందు, హస్తగతము=చేతికి దొరకినది, అయ్యెన్=ఆయెను-అనఁగాన్= అనునట్లు, ఇఁకన్= ఇఁకమీఁద-మదీయహృత్ కంజమునన్= నాహృదయకమలమందు, వసింపుము=నెలకొనుము.

తా. భూమియందు గుద్దలిచే త్రవ్వియు కనఁబడనినిధి అంజనముచే లభించునట్లు, పరతత్త్వము తర్కవాదములచే ఎంత పరిశీలించినను అందు తెలియరానిరాముఁడవగునీవు భక్తిచే సులభముగా నాకు వశమైతివి. సెబాసు! ఇఁక నాహృదయకమలమునందు వసింపుమా.

ఉ. రాముఁడు ఘోరపాతకవి*రాముఁడు సద్గుణకల్పవల్లి
కా। రాముఁడు షడ్వికారజయ*రాముఁడు సాధుజనావన
వ్రతో। ద్దాముఁడు రాముఁడేపరమ *దైవముమాకనిమా
యడుంగుఁగాం। దామరలే భజించెదము*దాశరథీ కరు
ణాపయోనిధీ. 24

టీ. రాఁముడు=రమింపఁ జేయువాఁడు, ఘోర... విరాముఁడు-ఘోర=భయంకరములైన, పాతక=పాపములను, విరాముఁడు-నశింపఁజేయు వాఁడు-సద్గుణ... రాముఁడు-సత్ + గుణ=మంచిగు

ణములు అనేడి, కల్పవల్లికా=కల్పవృక్షపు తీఁగలకు, ఆరామఁడు=తోఁటయైన వాఁడు-'సజ్జన కల్ప కా రాముఁడు' అని పాఠాంతరము- సజ్జనులకు కల్పవృక్షపుతీఁగఁలతోఁటయైన వాఁడనుట- షడ్వి...రాముఁడు- షట్+వికార=పుట్టుట పెరుఁగుట మొదలైన ఆఱువికారములయొక్క, జయ=గెలుపుచేత, రాముఁడు=మనోజ్ఞుఁడైనవాఁడు-సాధు...ద్దాముఁడు- సాధుజన= సజ్జనులను, అవన=రక్షించుట అనేడి, వ్రత=నియమముచేత, ఉద్దాముఁడు=అధికుఁడైనవాఁడు- మిక్కుటముగాఁ గలవాఁడనుట, అగు, రాముఁడే= శ్రీరాముఁడే, మాకు, పరమదైవము, అని, మీ అసుంగు+కెందామరలను= మీపాదము లనేడి ఎఱ్ఱతామరలను-ఏను=నేను, భజించెదను=కొలిచెదను.

తా. సకలజనులను రమింపఁజేయువాఁడును, ఘోరములైన పాపములను తొలఁగించువాఁడును, కళ్యాణ గుణములను అవ్వారిగాఁ గలవాఁడును, వికారరహితుఁడై ప్రకాశించు వాఁడును, సాధుజనులను రక్షించునట్టివ్రతము మిక్కిలియుఁ గానిన వాఁడును, అగు రాముఁడే మాకు పరదైవమని మీ పాదారవిందములను భజించెదను,

ఉ. చక్కెరమాని వేము దినఁ * జాలినకైవడి మానవాధముల్। పెక్కురు బక్కదైవముల * వేమఱుఁగొల్చెదరట్ల కాదయా। మ్రొక్కిన నీక మ్రొక్కవలె * మోక్షమొసంగిననీవయీవలెం। దక్కినమాట లేమిటికి * దాశరథీ కరుణాపయోనిధీ. 25

టీ. చక్కెరన్ = పంచదారను, మాని = విడిచి, వేమున్ = వేఁపచెట్టును, 'చేదున్' అనుపాఠమున చేదుఁను, తినన్ = తినుటకు, చాలినకైవడిన్ = నేర్చినవిధమున- శక్తిగలిగినట్లు అనుట, మానవ+అధముల్ = మనుష్యులలో తక్కువయైనవారు-హీనులు, పెక్కురు = అనేకులు, ఒక్కదైవములన్ = అల్పదేవతలను, 'పెక్కుదైవములన్' అనుపాఠమున అనేకదేవతలను, వేమఱున్ = పలుమాఱు, కొల్చెదరు = సేవించెదరు. అట్ల = ఆవిధమే, కాదు అయా = కాదు, ఇతరదైవములను కొలుచుట కూడ దనుట. ఏలనఁగా, మ్రొక్కినన్ = మ్రొక్కినయెడల, నీకె = నీకే, మ్రొక్కవలెన్ = నమస్కరింపవలెను- మోక్షము = ముక్తిని, ఒసంగినన్ = ఇచ్చినయెడల, నీవ = నీవే, ఈవలెన్ = ఇయ్యవలెను- తక్కిన మాటలు = కడమవిషయములు, ఏమిటికిన్ = ఎందుకు-ముఖ్యమైనవిషయములు.

తా. హీనులైనమనుష్యులు అనేకులు నిన్ను వదలి అల్పదైవములను అనేకములను గొలిచెదరు; ఇది తియ్యని చక్కెరను విడిచి చేఁదైనవేమును దినుటకు నేర్చినట్లున్నది. కాన యిది సరి కాదు. మ్రొక్కఁదగినవాఁడవు నీవే మోక్ష మిచ్చువాఁడవును నీవే; ముఖ్యములైన యీరెండువిషయములనుబట్టి నీవే కొలువదఁగినదైవము గావున తక్కిన విషయములు మాటాడ నక్కఱలేదు.

అవ. రామనామముయొక్క మహిమను జెప్పుచునాఁడు.

ఉ. 'రా' కలుషంబులెల్ల బయ*లంబడఁ ద్రోచిన
'మా' కవాటమై! దీకొని ప్రోచునిక్క మని*ధీయుతు

లెన్నఁ దదీయవర్ణముల్ । గైకొని భక్తిచే నుడువఁ* గానరు గాక విపత్పరంపరల్ । దాఁకొనునే జగజ్జనుల* దాశరథీ కరుణాపయోనిధీ. 26

టీ. 'రా'= 'రామ' అనెడి పేరునందలి రేఫము, కలుషంబులు + ఎల్లన్ = దోషములను అన్నిటిని, బయలన్ = వెలుపల - అవల, పడన్ త్రోయఁగాన్ = పడునట్లు త్రోసిపుచ్చగా, 'మా'= 'మ' అనుఅక్షరము, కవాటమై = తలుపై, దీకొని = తాఁకి, ప్రోచున్ = కాపాడును - నిక్కము = ఇదినిజము, అని, ధీయుతులు - ధీ = బుద్ధితోడ, యుతులు = కూడినవారు - జ్ఞానులు, ఎన్నన్ = తలఁపఁగా, తదీయవర్ణముల్ = ఆ అక్షరములను, గైకొని = చేకొని - గ్రహించి, భక్తిచే = భక్తిపూర్వకముగా, నుడువన్ = చెప్పుటను, కానరు = తెలియరు - కాక = కానిచో - అట్లు వారు వానిని జపించి రేని, విపత్ + పరంపరల్ - విపత్ = ఆపదలయొక్క + పరంపరల్ = ఎడతెగనివరుసలు, జగత్ + జనులన్ = జగమునందలివారిని - లోకుల ననుట, దాఁకొనునే = ఆక్రమించునా - ఆక్రమింపవనుట.

తా. 'రామ' అనుదివ్య నామములోని రేఫము పాపములను అన్నిటిని బయటికిఁ దఱుమఁగాఁ 'మ' అనెడి అక్షరము తలుపు వలె అడ్డపడి వానిని ఎదిరించి లోపలికి రాకుండునట్లుచేసి ఆశ్రితులను గాపాడును. ఇది నిజమని జ్ఞానవంతులు చెప్పఁగా మూఢులాయక్షరములను గ్రహించి భక్తితో జపింపనేరకున్నారు. ఇట్లు కాక లోకులు వానిని జపించిరేని ఎడతెగక వయివయిని వచ్చు ఆపదలు వారికి కలుగనే కలుగవు.

ఉ. రామ హరే కకుత్స్థకుల ✻ రామ హరే రఘురామ రామ శ్రీ। రామహరే యటంచు మది ✻ రంజిల భేకగళంబులీల నీ। నామము సంస్మరించినజ ✻ నంబు భవం బెడఁ బాసి తత్పరం। ధామనివాసు లౌదు రఁట ✻ దాశరథీ కరుణాపయోనిధీ. 27

టీ. రామ=రామా, హరే=హరీ, కకుత్స్థకులరామ=కకుత్స్థవంశమున పుట్టిన రామా, హరే=హరీ, రఘురామ=రఘురాజు సంతతివాఁడవైన రామా, రామ=రామా, శ్రీరామ=శ్రీరామా, హరే=హరీ, అటంచున్=అని, మది=మనస్సు, రంజిలన్=రంజిల్లునట్లు భేక...లీల- భేక=కప్పయొక్క, గళంబు లీలన్=గొంతువిధమున, నీనామమున్, సంస్మరించిన జనంబు= మనస్సులో తలంచిన జనులు, భవంబు=జన్మమును, ఎడఁబాసి= విడిచి, తత్...నివాసులు-తత్=ఆ-ప్రసిద్ధమైన, పరంధామ=శ్రేష్ఠమైనపట్టు అగుపరమపదమునందు, నివాసులు=నివసించువారు, ఔదురు అఁట=అగుదు రని ప్రతీతి కలదుగదా.

తా. రామ! హరే! కాకుత్స్థరామ! రఘురామ! శ్రీరామ! హరే! అని యింపుమీఱ నీనామమును కప్పగొంతువలె మనస్సునమాటికిఁ దలంచుజనులు ఇఁక జన్మమెత్తుటను విడిచి ప్రసిద్ధమైనపరమపదమందు వసింతురు గదా.

ఉ. చక్కెరలప్పకుఱ్ఱ మిగుల ✻ జవ్వని కెంజిగురాకు మోవికిం। జొక్కపుజుంటితేనియకుఁ ✻ జొక్కులుచుంగ

నలేరు గాక నేఁ। డక్కట రామనామమధు * రామృత
మానుటకంటె సౌఖ్యమా। తక్కినమాధురీమహిమ*దా
శరథీ కరుణాపయోనిధీ. ౨౩

టీ. చక్కెరలప్పకున్ = పటిక దారయొక్క రాశికిని, జవ్వని...మోవికిన్-జవ్వని = యౌవనముగల స్త్రీయొక్క, కెంపు+చిగురాకు మోవికిన్ = ఎఱ్ఱని చిగురువంటి అధరమునకును, చొక్కపుజుంటితేనియకున్ = అచ్చమైన జుంటీఁగలుగూర్చిన తేనెకును, మిగులన్ = మిక్కిలి, చొక్కులుచున్ = చొక్కుచు. 'చొక్కిలు' అని యొకవిప్రయోగించినాఁడు- ఈరూప: [illegible] ప్రయోగములుండుఁ గాన రామా, కనలేరుగాక = (రామనామముయొక్క మాధుర్యమును) తెలిసికొనలేరుగాని, అక్కట = అకటా, రామ...మృతము- రామనామ = రామ అనెడి నామముయొక్క, మధుర = తీయనైన అమృతము, ఆనుటకంటెన్ ఆస్వాదించుటకంటెను, తక్కిన... మహిమ—తక్కిన = ఇతరమైన, మాధురీ = తీయఁదనముయొక్క మహిమ = పేరిమి- అతిశయము, సౌఖ్యమా = సుఖమైనదా.

తా. దశరథరామా! చక్కెరరాశికిని, ఎలప్రాయముగలస్త్రీలచిగురాకువంటి యెఱ్ఱనిపెదవికిని, జుంటీఁగలు గూర్చినఅచ్చపుతేనెకును, చొక్కి- రామనామము యొక్క మాధుర్యమును తెలిసికొనక జను లున్నారుగాని లేనియెడల అమృతమువలె అతిభోగ్యమైన రామనామమును ఆస్వాదించుటకంటెను తక్కినవానిమాధుర్యాతిశయము సుఖప్రదము కానేరదు. రామనామమే అన్నిటికంటెను మధురమైనది.

ఉ. అండజవాహ నిన్ను హృద*యంబున నమ్మినవా
రిపాపముల్। కొండలవంటి వైన వెసఁ*గూలి నశింపక
యున్నె సంతతా। ఖండలవైభవోన్నతులు*గల్గక మా
నునె మోక్షలక్ష్మికై। దండ యొసంగకున్నె తుద*దాశ
రథీ కరుణాపయోనిధీ. 29

టీ. అండజవాహ=పక్షివాహనా, నిన్నున్, హృదయంబునన్=మనస్సునందు, నమ్మినవారిపాపముల్=నమ్మినట్టివారల యొక్క పాపములు, కొండలవంటివి=కొండలవలె మిక్కిలి గొప్పరాసులయినవి, ఐనన్=అయినను, వెసన్=త్వరితముగా, కూలి=క్రిందుపడి, నశింపకయున్నె=చెడిపోకయుండునా, సంత...వోన్నతులు-సంతత=ఎడతెగనట్టి, అఖండల=ఇంద్రునియొక్క, వైభవ=విభవముయొక్క, ఉన్నతులు=అతిశయములు, కల్గక మానునె=దొరకకపోవునా, తుదన్=కడపట, మోక్షలక్ష్మి=ముక్తిరూపమైన లక్ష్మి, కైదండ=చేయూఁత-ఒసంగక ఉన్నె=ఇయ్యకుండునా,

తా. పక్షివాహనా! నిన్ను మనసునందు నమ్మినవారికి మొదట కొండలవలె పెనుదప్పులు గొనియున్నవారిపాపములు నశించిపోకమానవు. పిమ్మట ఇంద్రునియైశ్వర్యమువంటిమహదైశ్వర్యము కలుగపోదు. కడపట మోక్షము లభింపకుండదు.

ఉ. చిక్కనిపాలపై మిసిమిఁ*జెందినమీఁగడ పంచదా
రతో। మెక్కినభంగి నీవిమల*మేచకరూపసుధారసంబు
నా। మక్కువపళ్లెరంబున స*మాహితదాస్య మనేటిదో

యిటన్। దక్కెనటంచు జుఱ్ఱెదను॥దాశరథీ కరుణాప
యోనిధీ. 30

టీ. చిక్కనిపాలపై=చిక్కనగుపాలమీఁద, మిసిమిఁజెందిన మీఁగడన్-మిసిమిన్=కాంతిని, చెందిన=పొందిన-మీఁగడన్=మీఁగడను, పంచదారతోన్=చక్కెరతోడఁగూర్చి, మెక్కిన భంగిన్=తిన్నవిధమున, నీ...రసంబున్-నీ=నీయొక్క, విమల=నిర్మలమైన, మేచక=నల్లని, రూప=ఆకారముఅనెడి, సుధారసంబున్=అమృతరసమును, నా...నంబునన్-నా=నాయొక్క, మక్కువ=ప్రేమయనెడి, పళ్లెరంబునన్=భోజనపాత్రమున, సమా...దాస్యము-సమాహిత=హెచ్చరికగల, దాస్యము=ఊడిగము-ఆనేటిదోయిటన్-ఆనేటి=అనునట్టి-దోయిటన్=దోసిలియందు, దక్కెను=లభించెను, అటంచున్=అనుచు, జుఱ్ఱెదను=జుఱ్ఱుచున్నాను.

తా. చిక్కనిపాలమీఁద మిసమిసలాడు మీఁగడను చక్కెరతోఁ గలిపి తిన్నట్లు మిక్కిలి భోగ్యమయి అమృతరసమువలెనుండు నీనల్లని రూపమును నేను ప్రేమతోఁ గైకొని దాస్యరూపమైన కైంకర్యమును అవ్వారిగా చేసి అనుభవించెదను.

చ. సిరులిడ సీత, పీడ లెగఁ॥జిమ్ముటకున్ హనుమం
తుఁ, డార్తి సో। దరుఁడుసుమిత్రసూతి, దురి॥తంబులు
మానుపరామనామముం। గరుణ దలిర్ప మానవులఁ॥గా
వఁగఁ బన్నినవజ్రపంజరో। త్కరము గదా భవన్మహిమ
దాశరథీ కరుణాపయోనిధీ. 31

టీ. సిరులు=సంపదలు, ఇడన్=ఇచ్చుటకు, సీత=సీతాదేవి, అగును అని శేషము-పీడలు=బాధలు, ఎగఁజిమ్ముటకున్=అవలీలఁబోఁగొట్టుటకు, హనుమంతుఁడు=ఆంజనేయుఁడు, అగును, ఆర్తిన్=సంకటమునందు, సోదరుఁడు=తోఁబుట్టువు-తోఁబుట్టువువలె సహాయము చేయువాఁడనుట-సుమిత్రిసూతి=లక్ష్మణుఁడు, దురితంబులు=పాపములను, మానుపన్-తొలఁగించుటకు, రామనామమున్=రామ అనెడి నీనామమును, అగును, కరుణ=దయ, తలిర్పన్=మీఱఁగా, మానవులన్=మనుష్యులను, కావఁగన్=కాపాడుటకు, పన్నిన...త్కరము- పన్నిన=చేసిన-వజ్ర=వజ్రముచేతనైన, పంజర=గూండ్లయొక్క, ఉత్కరము=సమూహము, భవత్+మహిమ=నీమాహాత్మ్యము, అగును.

తా. దశరథరామా! సంపదలిచ్చుటకు నీభార్యయైన సీతాదేవియు, బాధలను తొలఁగించుటకు నీభృత్యుఁడైన హనుమంతుఁడును, సంకటములందు తోఁడఁబుట్టువలె పరిచరించుటకు నీతమ్ముఁడగు లక్ష్మణుఁడును, పాపముల తొలఁగించుటకు నీదివ్యనామమును, చిలుకలు మొదలయినవానిని వజ్రపుఁగూండ్లలోఁబెట్టి కాపాడునట్లు మనుష్యులను దయతోఁ కాపాడుటకు నీమహత్త్వమును, గలదు.

చ. హలకులిశాంకుశధ్వజశ * రాసనశంఖరథాంగకల్పకో।
జ్జ్వలజలజాతరేఖలను * సాంకములై కనుపట్టుచున్నమీ।
కలితపదాంబుజద్వయము * గౌతమపత్ని

కొసంగినట్లు నా। తలఁపునఁ జేర్చి కావఁగదె * దాశర
థీ కరుణాపయోనిధీ. 32

టీ. హల...రేఖలను-హల=నాఁగేలు, కులిశ=వజ్రాయుధము, అంకుశ=అంకుసము, ధ్వజ=జెండా, శరాసన=విల్లు, శంఖ=శంఖము, రథాంగ=చక్రము, కల్పక = కల్పవృక్షము, ఉజ్జ్వల=ప్రకాశించుచున్న, జలజాత=తామర, ఇవియనెడి, రేఖలను = రేకలచేత-సాంకములు = గుఱుతులతోఁ గూడినవి-ఐ=అయి, కను...ద్వయము- కనుపట్టుచున్న=అగపడుచున్న, మీ=మీయొక్క, కలిత=ఒప్పుచున్న, పద+అంబుజ-అడుగుఁదమ్ములయొక్క-ద్వయము=జంటను, గౌతమపత్నికిన్ = గౌతముని భార్యయయిన అహల్యకు, ఒసంగినట్లు=ఇచ్చినట్లు, నాతలఁపునన్=నాచింతనమందు, చేర్చి=కూర్చి, కావఁగదె=రక్షింపుమా.

తా. నాఁగేలు, వజ్రాయుధము, అంకుశము, మొదలయినవాని రూపములు గలరేఖలు దాల్చియున్న మీ పాదారవిందములను అహల్యకు ఇచ్చి ఆమెను కృతార్థురాలినిగా చేసినట్లు నాహృదయమందు చేర్చి నన్ను కృతార్థునిగా రక్షింపుమా.

అవ:—అవతారములను అన్నిటిని చెప్పుచున్నాఁడు.

చ. జలనిధిలోన దూఁటి కుల*శైలము మీటి ధరిత్రిఁ గొ
మ్మున। దలవడ మాటి రక్కసుని*యంగము గీటి బలీం
ద్రుని౯ రసా। తలమున మాటి పార్థివక*దంబముఁ గూ
ల్చినమేటి రామ నా। తలఁపున నాటి రాఁగదవె*దాశర
థీ కరుణాపయోనిధీ. 33

టీ. జలనిధిలోనన్=సముద్రములోపల, దూఁటి=చొచ్చి, కుల శైలమున్=కులపర్వతమును-మీటి=ఎగనెత్తి, ధరిత్రిన్=నీళ్ళలో మునిఁగియుండినభూమిని, కొమ్మునందున్, అలవడన్=పొందికగా, మాటి=తగిల్చి, రక్కసులయంగము=రాక్షసుఁడైన హిరణ్యకశి[illegible], [illegible]=చీల్చి, బలీంద్రునిన్=ఇంద్రుఁడుగా నుండినబలిచక్రవర్తిని, రసాతలమునన్=రసాతలమందు, మాటి=మఱుఁగుచేసి-తటిమియనుట, పార్థివకదంబమున్-పార్థివ=రాజులయొక్క, కదంబమున్=సమూహమును,కూల్చిన=నాశము చేసినట్టి, మేటి=దిట్టఁడవు అయిన, రామ=రామచంద్రా, నాతలఁపునన్= నా చింతనమందు, నాటి=నెలకొని, రాఁగదవె=రమ్మా,

తా. శ్రీరామా! మత్స్యమవై సోమకాసురునికొఱకు సముద్రముఁజొచ్చి, కూర్మమయి మందరపర్వతమును పాలసముద్రములో మునిఁగిన దానిని ఎత్తినిలిపి, వరాహమై ప్రళయజలములలో రసాతలము నంటినభూమిని కోఱకొమ్మున నెత్తికొనివచ్చి, నరసింహుఁడవై హిరణ్యాక్షుని దేహము చీల్చి, వామనుఁడవై బలిచక్రవర్తిని రసాతలమునకు అడఁగఁద్రొక్కి, పరశురాముఁడవై రాజసమూహమును సంహరించినదిట్టవైన నీవు నామనసునందు దృఢముగా నిలిచియుండుమా.

ఉ. భండనభీముఁ డార్తజన*బాంధవుఁ డుజ్జ్వలబాణ
తూణకో। దండకళాప్రచండభుజ*తాండవకీర్తికి రామ
మూర్తికిన్। రెండవసాటిదైవ మిఁక*లేదనుచున్ గడగ
ట్టి భేరికా। దాండదదాండదాండనిన*దంబు లజాండము

నిండ మత్తవే। దండము నెక్కి చాటెదను*దాశరథీ క
రుణాపయోనిధీ. 31

టీ. భండనభీముఁడు-భండన= యుద్ధమందు, భీముఁడు= భయంకరుఁడు, ఆర్తజనబాంధవుఁడు- ఆర్తజన= సంకటము నొందిన వారిసమూహమునకు, బాంధవుఁడు= చుట్టము, ఉజ్జ్వల... కీర్తికి- ఉజ్జ్వల= ప్రకాశించుచున్న, బాణ= బాణములును, తూణ= పొదులునుగల, కోదండకళా= విలువిద్యయందు, ప్రచండ= తీవ్రమయిన, భుజ=బాహువులయొక్క, తాండవ= నటనముచే తఁగలిగిన, కీర్తికిన్ = యశస్సుగలవాఁడగు —ఇట్టి, రామమూర్తికిన్=రామచంద్రునికి, రెండవసాటిదైవము=సమానమైన మఱియొక దైవము, ఇఁకన్=ఇంకను, లేదు అనుచున్=కలుగదని, గడగట్టి=స్తంభము నాటి, భేరికా...నినదంబులు-భేరికా= భేరియొక్క, దాండదదాండదాండ=దాండద దాండ దాండ అనెడి, నినదంబులు=శబ్దములు, అజాండము= బ్రహ్మాండము, నిండన్= నిండునట్లు, మత్తవేదండము= మదించినయేనుఁగును, ఎక్కి, చాటెదను=ఎల్లయెడల ప్రకటించెదను.

తా. శ్రీరాముఁడు శత్రువులకు యుద్ధమందు భయంకరుఁడు; పండితులయిన ఆశ్రితజనులకు చుట్టమువంటివాఁడు. కావున, బాణములును అమ్ములపొదులును ప్రకాశించుచున్న విలువిద్య నెఱపుతీవ్రమయిన భుజములలాఘవముచే పొగడ్తగన్న శ్రీరామమూర్తికి సాటియయిన దైవము మఱియొకటిలేదనుచు బ్రహ్మాండ మదురునట్లుఢాంఢాం అని భేరికొట్టుచు గడకట్టియు మదపుటేనుఁగునెక్కియు చాటెదను.

చ. అవనిజకన్నుదోయితొగ * లందు వెలింగెడుసో
మ జానకీ। కువలయనేత్రిగబ్బిచను * గొండల నుండుఘ
నంబు మైథిలి। నవనవయౌవనం బనువ * నంబునకున్
మదదంతి వీవె కాఁ। దవిలి భజింతు నెల్లపుడు * దాశ
రథీ కరుణాపయోనిధీ. 35

టీ. అవ...లందు-అవనిజ=సీతయొక్క, కన్నుదోయి=రెండుకన్నులనెడు, తొగలందు = కలువపూవులయందు, వెలింగెడుసోమ=ప్రకాశించుచున్న చంద్రుఁడైనవాఁడా-జానకీ... కొండలన్-జానకీ=జనకునికూఁతురైన సీతఅనెడి, కువలయనేత్రి=కలువపూవులవంటికన్నులు గల, చెలువయొక్క, గబ్బి=ఉబ్బలయిన, చనుఁగొండలన్, చన్నులనెడికొండలయందు, ఉండుఘనంబు=ఉండునట్టిమేఘము, మైథిలీ...వనంబునకున్-మైథిలీ=మిథిలరాజుకూఁతురయిన సీతాదేవియొక్క, నవనవ = మిక్కిలిక్రొత్తయయిన, యౌవనంబు=ప్రాయము, అనువనంబునకున్=అనుతోఁటకు, మదదంతివి=మదించినయేనుఁగవు - నీవె కాన్=నీవే అని, తవిలి=ఆసక్తిగొని, ఎల్లపుడున్=ఎప్పుడును, భజింతున్=సేవింతును.

తా. రామా నిన్ను సీతాదేవికన్నుదోయి యనెడికలువలను వికసింపఁజేసెడు చంద్రుఁడుగాను, జానకీదేవి యుబ్బచన్నులనెడికొండలయందుండు మేఘముగాను, మిథిలాధిపతికుమారియొలప్రాయ మనుతోఁటకు మదపుటేనుఁగుగాను తలఁచి, ఎప్పుడును నిన్నే కొలిచెదను.

చ. ఖరకరవంశజా విను మ*ఖండితభూతపిశాచఢాకి
నీ । జ్వరపరితాపసర్పభయ*వారక మైనభవత్పదాబ్జవి ।
స్ఫురదురువజ్రపంజరముఁ*జొచ్చితి నీయెడ దీనమానవో।
ద్ధరబిరుదాంక మేమఱకు*దాశరథీ కరుణాపయోనిధీ.

టీ. ఖరకరవంశజా-ఖరకర=సూర్యుని యొక్క, వంశ=వంశమునందు, జా=పుట్టినవాఁడా, అఖండిత...వారకము-అఖండిత=కొట్టుపడని, భూత=భూతములు, పిశాచ=పిశాచములు, ఢాకినీ=ఢాకినులు, జ్వర=జ్వరములు, పరితాప=తాపములు, సర్ప=పాములు, వీనివలన కలిగెడు, భయ=భయములను, వారకము=పోఁగొట్టునది, అయిన...పంజరముఁ-అయిన=అయినట్టి, భవత్=నీయొక్క, పదాబ్జ=పాదపద్మములనెడి, విస్ఫురత్=మిక్కిలిప్రకాశించుచున్న, ఉరు=గొప్పయయిన, వజ్రపంజరముఁ=వజ్రముతో చేయఁబడినగూఁటిని, చొచ్చితిని=ప్రవేశించితిని, నీయడఁ=నీయందు, దీన...దాంకము-దీన=దీనులయిన, మానవ=జనులను, ఉద్ధర=ఉద్ధరించువాఁడనెడి, బిరుద+అంకము=బిరుదరూపయిన చిహ్నము, ఏమఱకు=మఱవకుము.

తా. సూర్యవంశమునఁ బుట్టినశ్రీరామా! భూతములు పిశాచములు ఢాకినులు జ్వరములు తాపములు సర్పములు మొదలగు వానివలనిభయమును పోఁగొట్టునదై, వజ్రపంజరమువలె రక్షించు నీపాదారవిందములను శరణుఁజొచ్చితిని, నీవు దీనమానవోద్ధారకుఁ డనుబిరుదుగలవాఁడవుగదా. కాఁబట్టి నను ఉద్ధరింపనివాఁడవై యాబిరుదును బోఁగొట్టుకొనకుమా.

ఉ. జుఱ్ఱెద మీకథామృతము * జుఱ్ఱెద మీపదకంజతో
యముం। జుఱ్ఱెద రామనామమున * జొబ్బిలుచున్న సు
ధారసంబు నే। జుఱ్ఱెద జుఱ్ఱ జుఱ్ఱఁగ రు * చుల్ గనువారి
పదంబుఁ గూర్పవే। తుఱ్ఱులతోడిపొత్తిడక * దాశరథీ క
రుణాపయోనిధీ. 37

టీ. మీకథామృతము=మీయొక్క కథలనెడియమృతమును, జు
ఱ్ఱెద=జుఱ్ఱుచున్నాను, మీపదకంజతోయముం-మీపదకంజ=మీ
పాదారవిందములయొక్క, తోయముం=జలమును, మీశ్రీపాద
తీర్థమనుట, జుఱ్ఱెద=జుఱ్ఱుచున్నాను, రామనామమునం=రామ
అనెడినామమునందు, జొబ్బిలు చున్న సుధారసంబు=స్రవించు
చున్న అమృతరసమును, జుఱ్ఱెద=జుఱ్ఱుచున్నాను, జుఱ్ఱజుఱ్ఱ
గఁ=జుఱ్ఱఁగా జుఱ్ఱఁగా, రుచుల్=రుచులు, కనువారి=ఎఱిఁ
గినట్టివారియొక్క, పదంబుం=స్థానమును, తుఱ్ఱులతోడిపొత్తు=
నీచులతోడిసహవాసమును, ఇడక=పెట్టక, కూర్పవే=చేర్పుమా.

తా. శ్రీరామా! నీచరిత్రము లనెడియమృతమును నీపాదతీర్థ
మును నీనామమునందు స్రవించుచున్నయమృతమును జుఱ్ఱెదను.
నీచరిత్రాదులయమృతమును జుఱ్ఱిజుఱ్ఱి రుచి నెఱిఁగిన మహనీయు
లదివ్యగతిని నాకుఁ గలిగింపుము. నీచులతోడిపొత్తు మాన్పుము.

ఉ. ఘోరకృతాంతవీరభట * కోటికి గుండెదిగుల్,
దరిద్రతా। కార పిశాచసంహరణ * కార్యవినోది, వి
కుంఠమందిర। ద్వారకవాటభేది, నిజ * దాసజనావళి

కెల్లప్రొద్దు నీ। తారకనామ మెన్నుకొన * దాశరథీ క
రుణాపయోనిధీ. 38

టీ. నీతారకనామము = సంసారమును దాటఁజేయు నీనామమును, ఎన్నుకొనన్ = తలఁచుకొనఁగా, ఘోర...కోటికిన్-ఘోర = భయంకరులైన, కృతాంత = యమునియొక్క, వీర = శూరులైన, భటకోటికిన్ = కింకరులసమూహమునకు,- యమదూతలకు గుండెదిగుల్ = గుండెలలోని భయము- దరిద్రతా...వినోది- దరిద్రతా = దారిద్ర్యముయొక్క, ఆకార = రూపముగల, పిశాచ = పిశాచమును, సంహరణ = చంపుటయనెడి, కార్య = కార్యమునందు, వినోది = క్రీడించునది, నిజదాస...వళికిన్-నిజ = నీవారైన, దాసజన = కైంకర్యము సేయుజనులయొక్క, ఆవళికిన్ = సమూహమునకు, ఎల్లప్రొద్దున్ = ఎప్పుడును, వికుంఠ...భేది-వికుంఠ = విష్ణుదేవుని వాసస్థానమైన పరమపదమనెడి, మందిర = గృహము యొక్క, ద్వార = ద్వారమునందలి, కవాట = తలుపును, భేది = భేదించునది.

తా. రామా! నీతారకనామము భయంకరులయిన యమదూతలకును గుండెలదురఁజేయును. దరిద్రత అనెడి పిశాచమును వేడుకగాఁ బోఁగొట్టును. ఎల్లప్పుడును నీదాసజనులు పరమపదమునకు పోవుటకుఁ గలయడ్డములను తొలఁగించి త్రోవయిచ్చును.

ఉ. విన్నప మాలకించు రఘు*వీర నహి ప్రతిలోక
మందు నా। కన్న దురాత్ముఁడుం బరమ*కారుణికోత్తమ

వేల్పులయందు నీ। కన్న మహాత్ముఁడుం బతిత*కల్మషదూరుఁ
డు లేఁడు నాకు వి। ద్వన్నుత నీవె నాకు గతి* దాశరథీ
కరుణాపయోనిధీ. 39

టీ. రఘువీర=రఘురాజుకులమునఁ బుట్టిన శూరుఁడైనవాఁడా, విన్నపము=ఒకమనవిని, ఆలకింపు=వినుము, ఆమనవియేమనఁగా, ప్రతిలోకమందున్= ఒక్కొక్క-జగత్తునందును, నాకన్నన్= నాకంటెను, దురాత్ముఁడు= దుష్టుఁడు, నహి=లేఁడు, కారుణిక+ఉత్తమ=కరుణగలవారిలో నెల్ల శ్రేష్ఠుఁడైనవాఁడా, వేల్పులందున్= దేవతలందు, నీకన్నన్=నీకంటెను, మహాత్ముఁడున్= గొప్పవాఁడును, పతిత..దూరుఁడు-పతిత= పాపాత్ములయొక్క, కల్మష=పాపములను, దూరుఁడు-దవ్వుగాఁ జేయువాఁడును, నాకున్, లేఁడు-కలుగఁడు, విద్వత్+నుత= పండితులచేత కొనియాడఁబడువాఁడా, నీవు, నాకున్, గతి=దిక్కు.

తా. రఘువీరా! నేనొక మనవి చెప్పుకొనెద; దానిని ఆలకింపుము. ఏలోకమందును నాకంటె దుష్టుఁడులేఁడు. దేవతలందు నీకంటె మహాత్ముఁడును పాపరహితుఁడును లేఁడు. కాఁబట్టి దుష్టులలో శ్రేష్ఠుఁడైన నాకు దేవతలలో శ్రేష్ఠుఁడవైన నీవే దిక్కై యుద్ధరింప శక్తుఁడగుదువుగాని మఱియొకరు గానేరరు.

ఉ. పెంపును దల్లివై కలుష*బృందసమాగమ మొంద
కుండ ర। క్షింపను దండ్రివై మెయి వ*సించు ద
శేంద్రియరోగముల్ నివా। రింపను వెజ్జువై కృప గు*ఱింౘ

చి పరంబు దిరంబు గాఁగ స। త్సంపద లియ్య నీవె గతి॥
దాశరథీ కరుణాపయోనిధీ. 40

టీ. పెంపను= పోషింపను, తల్లివి, ఐ=అయి, కలుష... మముఁ-కలుష=పాపములయొక్క, బృంద=సమూహముయొక్క, సమాగమము=కూడికను, ఒందకుండఁ= చెందకుండునట్లు, రక్షింపను=కావను, తండ్రివి, ఐ=అయి, మెయిఁ= దేహమునందు, వసించు=ఉన్నట్టి, దశ+ఇంద్రియ=పదియింద్రియములనెడి, రోగముల్= తెవుళ్ళను, నివారింపను=పోఁగొట్టను, వెజ్జవు+ఐ=వైద్యుఁడవై, కృప=దయను, గుతించి=కలిగి, పరంబుఁ= మోక్షమును, థిరంబుగాఁగఁ= స్థిరము గునట్లుగా, సత్+సంపదలు=మేలయిన సంపత్తులను, ఇయ్యఁ=ఇచ్చుటకు, నీవె, గతి=దిక్కు.

తా. తల్లివలె పోషింపను, తండ్రివలె దోషములనుపొందకుం డునట్లు రక్షింపను, వైద్యునివలెదేహమునందలి పదియింద్రియములనెడు రోగములను తొలఁగింపను, మేలయిన సంపద లియ్యను, నీవే నాకు దిక్కు.

ఉ. కుక్షి నజాండపంక్తు లొనఁ॥గూర్చి చరాచరజంతుకోటి సం। రక్షణ సేయుతండ్రివి ప॥రంపర నీతనయుండ నైననా। పక్షము నీవు గా వల దె॥పాపము లెన్ని యొనర్చినన్ జగ। ద్రక్షక కర్త నీవెకద॥దాశరథీ కరుణాపయోనిధీ. 41

టీ. కుక్షిఁ= ఉదరమునందు, అజాండపంక్తులు- అజాండ=బ్రహ్మాండములయొక్క, పంక్తులు=సమూహములు, ఒనఁగూర్చి=

పొందికపఱిచి, చరా...కోటిఁ- చర=చరించునట్టి చేతనములును, అచర=చరింపని అచేతనములును, అగు-చేతనాచేతనములైన, జంతు=ప్రాణులయొక్క, కోటిఁ = సమూహమును, రక్షణ=కాపాడుటను, సేయుతండ్రివి= సేయునట్టి తండ్రివి, పరంపరఁ=వరుసగా-తరతరముగా, నీతనయుండను=నీకొడుకను, ఐన=అయినట్టి, నాపక్షము=నాయొక్క పాలిటివాఁడవు, ఎన్నిపాపములు, ఒనర్చినఁ=నేను చేసినను, నీవు, కావలదె= కావలదా, జగ...కర్త- జగత్= లోకములను, రక్షణ= రక్షించుటయందు, కర్త=కర్తయైనవాఁడు, నీవెకద=నీవేకదా.

తా. కడుపులోపల బ్రహ్మాండసమూహములను పొందికగా పెట్టుకొని చేతనములను అచేతనములైన సకలప్రాణిసమూహములను రక్షించునట్టి తండ్రివి నీవు కాఁబట్టి తరతరముగ నీకొడుకైయున్న నాపాలిట నీవు పక్షపాతివై యుండవలయును. నేను పాపములు చేసితినని నీవు విడువరాదు. ఎన్నిపాపములుచేసినను లోకమెల్ల రక్షించువాఁడవు నీ వొక్కఁడే గనుక నీవే నన్ను రక్షింపవలయును.

ఉ. గద్దరియోగిహృత్కమల * గంధరసానుభవంబుఁ
జెందుపె| న్నిద్దపుగండుఁదేఁటి ధర * ణీసుతకౌఁగిలిపంజ
రంబునఁ| ముద్దులు గుల్కు రాచిలుక * ముక్తినిధానము
రామ రాఁ గదే| తద్దయు నేఁడు నాకడకు దాశరథీ క
రుణాపయోనిధీ. 42

టీ. గద్దరి...భవంబుల్-గద్దరి=దిట్టలయిన, యోగి=యోగశ్రేష్ఠులయొక్క, హృత్=హృదయమనెడు, కమల=పద్మములయందలి, గంధ=వాసనతోఁగూడిన, రస=మకరందముయొక్క, అనుభవంబుల్= త్రాగుటను- చెందు...తేఁటి, చెందు= పొందునట్టియు, పెను= మిక్కిలి, నిద్దపు= నిగనిగయనెడి మిసిమిగల, గండు=మదించిన, తేఁటి=తుమ్మెదయైన వాఁడు-ధరణీ... పంజరంబునన్-ధరణీసుత=సీతాదేవియొక్క, కౌఁగిలి= ఆలింగనమనెడి, పంజరంబునన్=గూఁటియందు, ముద్దులు... చిలుక-ముద్దులంగులుక=మనోజ్ఞముగానుండు, రాచిలుక= రాచచిలుక-ముక్తినిధానము=మోక్షముండెడిచోటు, రామ= శ్రీరామా, నాకడకున్=నావద్దకు, నేఁడు, తద్దయున్=మిక్కిలి, రాఁగదే=రమ్మా.

తా. తామరలయందలి తేనెను గ్రోలు తుమ్మెదవలె యోగిజనుల హృదయమందు భక్తిరసమును అనుభవించువాఁడును, గూఁటియందలి రాచిలుకవలె సీతాదేవి కౌఁగిలియందు సొంపు గులుకువాఁడును, ముక్తియిచ్చువాఁడును, అగు శ్రీరామా! నేఁడు నాయొద్దకు వేగ రమ్మా.

ఉ. కలియుగమర్త్యకోటి నినుఁ * గన్గొన రానివిధం
బో, భక్తవ । త్సలత వహింపవో, చటుల * సాంద్రవిపద్ద
శవార్ధిఁ గ్రుంకుచోఁ । బిలిచినఁ బల్క వింతమఱ * పే నరు
లిట్లన రాదు గాక నీ । తలఁపున లేదె సీతచెఱ * దాశరథీ
కరుణాపయోనిధీ. 43

టీ. కలి... కోటి-కలియుగ=కలియుగమందలి, మర్త్యకోటి=మనుష్యసమూహము, నినుఁ=నిన్ను, కన్గొనరానివిధంబో=తెలిసికొనరానివిధమో, భక్తవత్సలతఁ=భక్తులయెడ వాత్సల్యముకలిగియుండుటను, వహింపవో=ధరింపవో, చటుల...వార్ధిఁ=చటుల=మిక్కిలి, సాంద్ర=దట్టమైన, విపత్=ఆపదయొక్క, దశ=అవస్థ యనెడి, వార్ధిఁ=సముద్రమునందు, క్రుంకుచోఁ=నేనుమునుఁగునపుడు, పిలిచినఁ=నిన్నుపిలువఁగా, పల్కవు=పలుకవు, ఇంత మఱపే=ఇంత నన్నుమఱచిపోవుటయా, నరులు=ననుబోఁటిమనుష్యులు. ఇట్లు=ఈప్రకారము- ఇంతమఱపా అని అనుట, అనరాదుగాక=చెప్పరాదుగాని, నీతలఁపునఁ=నీచింతయందు, సీతచెఱ=రావణులచేత సీతపొందినచెఱ, లేదె=లేదా.

తా. రామా! నేను మిక్కిలియైన ఆపత్సముద్రమున మునుఁగుచు నిన్ను ఎంతపిలిచినను మాఱు పలుకవు. ఇదేల? కలియుగమందు మనుష్యులకు కనఁబడరాదనియా? లేక భక్తజనులయెడల నీకు వాత్సల్యము కలుగదా? ఇంత నన్ను మఱచిపోవచ్చునా? నీకు మఱపనియు మాబోఁటులు చెప్పరాదు. సీతాదేవికి కలిగిన చెఱను మఱవవుగదా. అట్లె మా చెఱకును నీకు మఱపు ఎక్కడిది.

చ. జనవర మీకథాళి విన*నైఁపక కర్ణములందు ఘం
టికా। నినదవినోదముల్ సలుపు*నీచునకుఁ వర మిచ్చి
నావు ని। న్ననయము నమ్మి కొల్చినమ*హాత్ములకేమి

యొసంగెదో సనం। దననుత మాకుఁ గొసంగుమయ్య*దాశర
థీ కరుణాపయోనిధీ. 44

టీ. జనవర-ఓ రాజా, మీకథాళి = మీకథలయొక్క సమూహము, వినఁ=వినుటకు, సైఁపక= ఓర్వక, కర్ణములందుఁ= చెవులయందు, ఘంటికా...వినోదముల్-ఘంటికా= గంటలయొక్క, నినద=శబ్దములయొక్క, వినోదముల్= వేడుకలను, సలుపు నీచునకుఁ= చేయుచున్న అల్పునికి, వరము=కోరినకోరిక, ఇచ్చినావు, నిన్నుఁ, అనయమునుఁ=ఎప్పుడును, నమ్మి, కొల్చిన మహాత్ములకుఁ=సేవించినట్టి సుహనీయులకు, ఏమి, ఒసంగెదో= ఇచ్చెదవో, దానినే, సనందనేనుత=సనందనుఁడు అనుఋషి చేత కొనియాడఁబడినవాఁడా, మాకుఁ, ఒసంగుమయా=ఇయ్యవయ్య.

తా. నీపేరు వినఁ గూడ దన్న ఘంటాకర్ణునివంటి పాపికి కోరినవరము ఇచ్చినపుడు నిన్ను నమ్మి కొలిచెడుమహాత్ములకు మరి యెంతోవరములు అవ్వారిగా నిత్తువుగదా. వారి కిచ్చినట్లే నాకును ఇమ్ము

ఉ. పాపము లొందువేళ రణ*పన్నగభూతభయజ్వ
రాదులం। దాపద నొందువేళ భర*తాగ్రజ మిమ్ము భ
జించువారికిం। బ్రాపుగ నీవు దమ్ముఁ డిరు*పక్కియలం
జని తద్విపత్తిసం। తాపము మాన్పి కాతువఁట*దాశర
థీ కరుణాపయోనిధీ. 45

టీ. పాపములు, ఒందువేళఁ=పొందెడి సమయమందు, రణ...రాదులఁ-రణ=యుద్ధము, పన్నగ=సర్పము, భూతభయ=భూ

తములవలన కలుగుభయమును, జ్వర=జ్వరములు, ఆదులందున్=మొదలయినవానియందు, ఆపదన్ = విపత్తును, ఒందువేళన్ = పొందుసమయమునను, భరతాగ్రజ=భరతునికి అన్నవైనశ్రీరామా, మిమ్మున్ =మిమ్ము, భజించువారికిన్=కొలుచువారికి, నీవున్=నీవును, తమ్ముఁడు=తమ్ముఁడైనలక్ష్మణుఁడును, ఇరుపక్కియలన్=రెండుప్రక్కలను, ప్రాపుగన్= సహాయముగ, చని=పోయి, తత్...తాపము-తత్=వారియొక్క, విపత్తి=ఆపదచేతనైన, సంతాపమున్ = ఉడుకును, మాన్పి =పోఁగొట్టి, కాతువఁట=కాపాడుదు వందురు.

తా. దశరథరామా! పాపములు పొందునపుడును, యుద్ధము సర్పములు భూతములు జ్వరములు మొదలైనవానిచేత ఆపదగలిగినపుడును, నిన్నుఁగొలుచునట్టివారికి సహాయము సేయఁబోయి నీవును నీతమ్ముఁడును రెండుప్రక్కల నిలిచి వారియాపదలను పోఁగొట్టి రక్షింతువని లోకులు చెప్పుదురు. కాఁబట్టి నన్నును రక్షింపవలయును.

చ. అగణితజన్మకర్మ దురితాంబుధిలో బహుదుఃఖవీచికల్ । దెగిపడ నీఁదలేక జగతీధవ నీపదభక్తినావచేఁ । దగిలి తరింపఁగోరితిఁ బదంపడి నాదుభయంబు మాన్పవే । తగ దని చిత్తమం దిడక దాశరథీ కరుణాపయోనిధీ. 46

టీ. జగతీధవ=రాజా, అగ...బుధిలో-అగణిత=లెక్కింపరాని, జన్మ=జన్మములందలి, కర్మ=కర్మపరంపరచేఁగలిగిన, దు

రితఁ=పాపములనెడి, అంబుధిలోన్=సముద్రమందు, బహుదుఃఖవీచికల్-బహు=అనేకములైన, దుఃఖ=దుఃఖములనెడి, వీచికల్=కెరటములను, తెగిపడన్=కడచునట్లు, ఈఁదలేక=ఈఁదఁజాలక, పదంపడి=పిమ్మట, నీపదభక్తినావచేన్=నీయొక్క-పాదములందలిభక్తి అనెడిఓడచేత,తగిలి=ఆసక్తితోడ,తరింపఁగోరితిన్=దాఁటను ఇచ్ఛగించితిని, తగదు అని=తగినదికాదు అని, చిత్తమందు=నీమనస్సునందు, ఇడక=ఉంచుకొనక, నాభయంబున్=నాయొక్క-భయమును, మాన్పవే=పోఁగొట్టుము.

తా. అనేకజన్మకృతములైన కర్మములవలని పాపములు సముద్రమువలె అపారమై నాయత్నతట పోఁగొట్టుటకు శక్యము కాకుండఁగా, పిమ్మట నీయందలిభక్తిగలిగి ఈఁదరానిసముద్రమును ఓడచే సులువుగా దాఁటునట్లు, తొలఁగింపరాని నాపాపములను నీభక్తిచే సులువుగాఁ బోఁగొట్టుకొనఁగోరితిని. కాఁబట్టి శరణుఁజొచ్చిన నాభయమును మాన్పరాదని తలఁపక మాన్పుమని తాత్పర్యము

ఉ. నే నొనరించుపాపము ల*నేకము లైనను నాదు జిహ్వకుం। బానక మయ్యె మీపరమ*పావననామము దొంటిచిల్క రా। మానను గావు మన్న తుది*మాటకు సద్గతిఁ జెందెఁగావునన్। దాని ధరింపఁ గోరెదను*దాశరథీ కరుణాపయోనిధీ. 47

టీ నేను, ఒనరించుపాపములు = చేయునట్టిపాపములు, అనేకములు=పెక్కులు, ఐనను, నాదుజిహ్వకున్ =నాయొక్క- నాలుకకు, మీపరమపావననామము=మీయొక్క- మిక్కిలి పవిత్రమై

ను పేరు, పానకము అయ్యెన్ = పానకమువలె భోగ్యమైనదయ్యెను. రామనామము తనజిహ్వకు పానకముగుటకు కారణము చెప్పుచున్నాఁడు:—తొంటిచిలుక = పూర్వకాలపుచిలుక, రామా, ననుఁ గావుము = నన్ను రక్షింపుము, అన్నతుదిమాటకున్ = అని పలికినట్టి కడపటి పలుకునకు—సత్ + గతిన్ = మంచిగతిని. మోక్షమును, చెందెన్ = పొందెను, కావునన్ = కనుక, దానిన్ = ఆరామనామమును, ధరింపన్ గోరెదను = తాల్చుటకు ఇచ్ఛగించెదను.

తా. దశరథరామా! నేను పాపము లనేకములు చేయుచున్నవాఁడను. ఇట్టి పాపాత్ముఁడనైనను నానాలుకకు నీదివ్యనామము ఉచ్చరించుటకు పానకమువలె మిక్కిలిభోగ్యమైనది. ఎట్లనఁగా పూర్వ మొకచిలుక 'రామా నన్నుఁగావుము' అని కడపటనొక మాట చెప్పఁగానే మోక్షము నొందెను గదా. అట్టిసిద్ధిని ఇచ్చినది గావున నాకు అతిభోగ్యమైననీనామమును ఎప్పుడును అనుసంధించెదను.

చ. పరధనముల్ హరించి పర*భామల నంటి పరా
న్నమబ్బినన్। మురిపముగాని మీఁదనగు*మోసమెఱుం
గదుమానసంబుదు। స్తర మిది కాలకింకరగ*దాహతి
పాల్పడ నీక మమ్ము నే। తటి దరిఁ జేర్చి కాచెదవో*
దాశరథీ కరుణాపయోనిధీ. 43

టీ. పరధనముల్ = ఇతరులధనములను, హరించి = దొంగిలించి, పరభామలన్ = ఇతరులయిల్లాండ్రను, అంటి = తాఁకి-పరస్త్రీ

లతోఁగూడి యనుట, పర + అన్నము=ఇతరులకూడు, అబ్బి నన్=దొరకఁగా- మరికము కాని = విలాగమేకాని- ఇప్పటికి సుఖమే గాని, పిదప్=పిమ్మట, అగు హీనము=కలుగునట్టి హీనమును, మానసంబు=మనస్సు, ఎఱుంగదు=తెలియదు, ఇది= ఇట్లు తెలియకుండుట- దుస్తరము=పోఁగొట్టరానిది. కాల...కాలపాలు- కాలకింకర=యమదూతలయొక్క, గదా= గదలయొక్క, హతి=దెబ్బలయొక్క, పాలు=స్వాధీనత, పడనీక= పొందనీయక, మమ్మున్, ఏతటిన్=ఎప్పుడు, దరిచేర్చి = గట్టును పొందించి, కాచెదవో=రక్షింతువో.

తా. దశరథ రామా! పరుల ధనములను దొంగిలించుట, పరస్త్రీలను గూడుట, పరాన్నమును దినుటయు, మొదట సుఖముగా నుండినను వెనుక నరకము గలిగించును. ఇది మనస్సు ఎఱుఁగదు. మనస్సును జయించుటయో కష్టము. కనుక మనస్సు పోయిన దారిని పోయి నరకము నొంది యముకింకరుల గదలచే గొట్టఁబడక ఉండునట్లు మమ్మెప్పుడు కడతేర్చి కాపాడెదవో.

ఉ. చేసితి ఘోరకృత్యములు* చేసితి భాగవతాపచారముల్ । చేసితి నన్యదైవములఁ* జేరి భజించినవారిపొందు నేఁ । జేసిననేరముల్ దలఁచి* చిక్కులఁ బెట్టకు మయ్య యయ్య నీ । దాసుఁడనయ్య భద్రగిరి* దాశరథీ కరుణాపయోనిధీ. 49

టీ. ఘోరకృత్యములు=భయంకరము లైన కార్యములను, చేసితిని, భాగవత+అపచారముల్=భక్తజనులయెడ అపరాధము

లను, చేసితిని, అన్యదైవములన్=నీవు తప్ప తక్కిన దేవతలను, చేరి=ఆశ్రయించి, భజించిన వారిపొందున్=కొలిచినట్టి వారితోడి సాంగత్యమును, చేసితిని, నేన్=నేను, చేసిన నేరముల్=కావించినట్టితప్పులను, తలఁచి=ఎంచి, చిక్కులన్ పెట్టకుము అయ్య=సంకటములందు తగుల్పకు మయ్య, అయ్య=అయ్యా, నీ దాసుఁడను అయ్య=నీయొక్క దాసుఁడను.

తా. దశరథరామా ! నేను భయంకరమైన కార్యములను జేసితిని ; భాగవతులకు అపచారములు చేసితిని ; అన్యదైవములను గొలుచువారితో సాంగత్యము సేసితిని. ఇట్లు నేను చేసినట్టితప్పులను తలఁచి సంకటములు పెట్టవద్దు, నేను నీకు దాసుఁడను గదా.

చ. పరులధనంబుఁ జూచి పర*భామలఁ జూచి హ
రింపఁ గోరుమ | ద్గురుతరమానసం బనెడు*దొంగను బ
ట్టి నిరూఢదాస్యవి | స్ఫురితవివేకపాశములఁ*జుట్టి భ
వచ్చరణం బనేమరు | త్తిరువునఁ గట్టివేయఁ గదె*దాశర
థీ కరుణాపయోనిధీ. 50

టీ. పరులధనంబున్=ఇతరులధనమును, చూచి, పరభామలన్=పరస్త్రీలను, చూచి, హరింపన్=అపహరించుటకు, కోరు...నంబు కోరు=కోరునట్టి, మత్=నాయొక్క, గురుతర=మిక్కిలి గొప్పదైన, మానసంబు=మనస్సు, అనెడుదొంగను=అనునట్టిదొంగను, పట్టి=పట్టుకొని, నిరూఢ...పాశములన్-నిరూఢ=మిక్కిలి పెరిఁగిన, దాస్య= (నీయొక్క) కైంకర్యమునం

దు-విస్ఫురిత=మిక్కిలి ప్రకాశించిన, వివేక=తెలివియనెడి, పాశములన్=త్రాళ్లచేత, చుట్టి=బంధించి, భవత్ + చరణంబు= నీపాదము, అనే మరుత్ తరుపునన్=అనెడి దేవతావృక్షమున-కల్పవృక్షమునందు, కట్టివేయన్ కదె=బంధించివేయుదుమా.

తా. దొంగను బట్టి త్రాళ్ళతోఁ జుట్టి చెట్టునకుఁ గట్టునట్లునా మనస్సు అనెడిదొంగను పట్టి నీవలనిక్రైంకర్యముచేఁ బ్రకాశించునట్టి తెలివి యనెడి త్రాటిచేఁజుట్టి నీపాదము లనెడికల్పవృక్షమునకుఁ గట్టి వైతుమని తాత్పర్యము.

చ. సలలితరామనామజప*సార మెఱుంగను, గాశి
కాపురీ । నిలయుఁడఁ గాను, మీచరణ*నీరజరేణుమ
హాప్రభావముం। దెలియ నహల్య గాను, జగ*తీవర నీ ద
గుసత్యవాక్యముం । దలఁపగ రావణాసురుని*తమ్ముఁడఁ
గాను, భవద్విలాసముల్ । తలఁచి నుతింప నాతరమె*
దాశరథీ కరుణాపయోనిధీ. 51

టీ. సలలిత...సారము-సలలిత=మిక్కిలిఒప్పుచున్న, రామనామ = రామనామముయొక్క, జప = జపముయొక్క, సారము=సత్తువును-ఎఱుంగను = తెలియుటకు కాశికాపురీనిలయుఁడను=కాశీపట్టణము వాసస్థానముగాఁ గల శివుఁడను, కాను. మీ...ప్రభావముం- మీచరణనీరజ= మీపాదకమలములయొక్క, రేణు=దుమ్ముయొక్క, మహాప్రభావము= గొప్పమహత్త్వమును, తెలియన్= తెలియుటకు, అహల్యను కాను= అహల్యను కానేరను. జగతీవర=భూనాథా, నీ దగుసత్యవాక్యమున్=నీ వైనట్టిని

జమైన మాటను, తలఁపఁగన్ = ఎన్నుటకు, రావణాసురుని తమ్ముఁడను = విభీషణుఁడను, కాను- భవత్-విలాసముల్ = నీయొక్క- మహాత్వపువైచిత్ర్యములు, తలఁచి = ఎన్ని, నుతింపన్ = పొగడుటకు, నాతరమె = నాకు శక్యమా.

తా. దశరథరామా నీరామనామమును జపముసేయుటవలని ఫస శివునికే తెలియునుగాని నాకు తెలియదు. నీపాదపద్మరజము యొక్క ప్రభావము అహల్యకే తెలియును. నీసత్యసంధత్వము విభీషణునికే తెలియును. కాని నీలీలలు ననుఁబోఁటికి తెలిసి వర్ణించుటకు అలవి కాదు.

ఉ. పాతకులైన మీకృపకుఁ * బాత్రుల కారె తలం
చి చూడఁ జ। ట్రాతికిఁ గల్గెఁ బావన ము * రాతికి రాజ్య
సుఖంబు గల్గె దు। ర్జాతికిఁ బుణ్యమబ్బెఁ గపి * జాతిమహా
త్త్వమునొందెఁ గావునన్। దాతవ యెట్టివారలకు * దాశ
రథీ కరుణాపయోనిధీ. 52

టీ. పాతకులైనన్ = పాపాత్ములైనను, మీకృపకున్ = మీదయకు, పాత్రుల కారె = అర్హులే కారా- తలంచిచూడన్ = ఎన్నిచూడఁగా, చట్రాతికిన్ = చట్టుఱాయిగానున్న అహల్య కనుట, పావనము = పవిత్రత్వము- కల్గెన్ = కలిగెను, అరాతికిన్ = శత్రువైన విభీషణునికి, రాజ్యసుఖంబు = రాజ్యప్రాప్తి యనెడు సుఖము, కల్గెన్ = కలిగెను, దురాతికి = తక్కువజాతి గలవానికి- లేక గుహుఁడు శబరి మొదలైన నీచజాతులవారికిని, పుణ్యము = సుకృతము- అబ్బెన్ = లభించెను, కపిజాతి = వానరజాతి- సుగ్రీవహను

మదాదులు, మహత్త్వము=మహిమను, పొందెన్=ఒందెను, కావునన్=కనుక, ఎట్టివారలకున్=ఎంతటివారలకైనను-జాతియెక్కువతక్కువలు పాటింపక యనుట, దాతవు=కోరిన కోరికలు ఇచ్చువాఁడవే.

తా. దశరథరామా! పాపాత్ములైనను నీదయకు పాత్రులుగానే యున్నారు. ఎట్లనఁగా రాయిగానుండిన అహల్య నీపాదరజముచే ఎప్పటిరూపము నొంది పవిత్రురాలైనది. పగవారివర్గములోఁ జేరినవిభీషణుఁడు నీవలన లంకారాజ్యము నొందినాఁడు. జటాయువు శబరి మొదలైననీచజాతులకును నీయనుగ్రహము గలిగినది. సుగ్రీవాదులైన వానరులకుఁ గూడ మహత్త్వము గలిగినది. ఇవన్నియుఁ జూడఁగా నీవు ఎక్కువతక్కువలు పాటింపక ఎట్టి వారికిని కోరినకోరికలు ఇచ్చుదాతవని తెలియుచున్నది. కాఁబట్టి నాకోరికయు నొసఁగుమా.

ఉ. మామకపాతకవ్రజము * మాన్ప నగణ్యము చి
త్రగుప్తులే। మేమని వ్రాతురో శమనుఁ * డేమి విధిం
చునో కాలకింకర। స్తోమ మొనర్చు టేమొ వినఁ * జొ
ప్పడ దింతకుమున్నె దీనచిం। తామణి యెట్లు గాచెద
వో * దాశరథీ కరుణాపయోనిధీ. 53

టీ. మామక...వ్రజము- మామక = నాయొక్క, పాతకవ్రజము = పాపసమూహము, మాన్పన్ = పోఁగొట్టుటకు, అగణ్యము=లెక్కింపరానిది- చిత్రగుప్తులు=చిత్రగుప్తులు, ఏమి ఏమి అని=ఏయేవిధముగా, వ్రాతురో = (నాపుణ్యపాపములను) వ్రా

యెదురో, శమనుఁడు=యముఁడు, ఏమి=(చిత్రగుప్తుల వ్రాఁతను జూచి) ఏఫలము, విధించునో=ఆజ్ఞాపించునో, కాలకింకరస్తోమము=యమదూతలసమూహము, ఒనర్చుట=చేయుట, ఏమో=ఏదియో- వినన్=వినుటకు, చొప్పడదు= సరిపడదు- ఇంతకమున్నె=దీనికి పూర్వమే - దీనచింతామణీ=దీనులైనవారికి చింతామణివలె కోరినకోర్కులు ఇచ్చువాఁడా, ఎట్లు = ఏవిధమున, కాచెదవో=కాపాడెదవో.

తా. నాపాతకములు పోగొట్టనలవిగానివి చిత్రగుప్తుడెట్లు వ్రాయునో యముడే శిక్ష విధించునో యమదూతలే యేబాధలబెట్టుదురో ఇట్టివెల్లను కలుఁగకముందే ఓదీనదయాళూ నన్నెట్లు రక్షింతువో కదా యని తాత్పర్యము.

ఉ. దాసినచుట్ట మాశబరి * దాని దయామతి నేలి
నావు నీ। దాసునిదాసుఁ డాగుహుఁడు * తావకదాస్య
మొసంగినావు నేఁ। జేసినపాపమో వినుతి * సేసినఁ గా
వవు గావు మయ్య నీ। దాసులలోన నేనొకఁడ * దాశ
రథీ కరుణాపయోనిధీ. 54

టీ. శబరి, దాసినచుట్టమూ- దాసిన = డాసిన - సమీపించిన, చుట్టమూ=వియ్యమూ- దగ్గఱిబంధువా?, దానిన్, దయామతిన్=దయతోఁ గూడినబుద్ధితో, ఏలినావు = ఏలుకొంటివి- గుహుఁడు; నీదాసునిదాసుఁడా = నీసేవకునిసేవకుఁడా - తావకదాస్యము= నీదైనదాస్యమును - ఒసంగినావు=ఇచ్చితివి, వినుతిన్=స్తోత్రమును, చేసినన్=నేను చేసినప్పటికిని, కావవు= రక్షింప

వు, నేన్ = నేను, చేసినపాపమో = చేసికొన్నట్టి దోషమా. నీదాసులలోనన్ = నీసేవకులలోపల, నేను, ఒకండన్ = ఒకరుండను. కాంబట్టి, కావవయ్యా = రక్షింపుమా.

తా. దశరథ రామా! శబరి నీకు దగ్గఱిచుట్టము కాదు. అయినను దానిని దయతోఁ గాపాడితివి. గుహుఁడు నీదాసునికిఁ గూడ దాసుఁడు గాఁడు. అట్టివానిని దాసునిగాఁ జేసికొంటివి. నేనో నీదాసవర్గములో ఒకఁడుగా నున్నాఁడను. మఱియు నిన్ను స్తోత్రము చేసెదను. అయినను నేను చేసికొన్నపాప మేమో నన్నుఁ గాపాడవు. ఇఁకనైన కాపాడుమా.

ఉ. దీక్ష వహించి నాకొలఁది॥దీనుల నెందఱిఁ గాచి
తో జగ। ద్రక్షక తొల్లి యా ద్రుపద॥రాజతనూజ తలం
చినంత నే। యక్షయ మైనవల్వ లిడి॥తక్కట నామొఱ చి
త్తగించి ప్ర। త్యక్షము గావ వేమిటికి॥దాశరథీ కరుణా
పయోనిధీ. 55

టీ. జగత్ + రక్షక = జగమును రక్షించువాఁడా, దీక్షన్ = (ఆశ్రితులను రక్షింతు ననెడి) నియమమును, వహించి = తాల్చి, నాకొలఁదిదీనులన్ = నన్నుఁ బోలినదిక్కు లేనివారిని, ఎందఱిని, కాచితో = కాపాడితివో, తొల్లి = మునుపు, ఆద్రుపదరాజతనూజ = ద్రుపదరాజుకూఁతు రైనయాద్రౌపది, తలంచినంత నే = స్మరించినంతమాత్రముననే, అక్షయము = తఱుఁగనివి, అయినవల్వలు = అయినట్టిచీరలు, ఇడితి = ఇచ్చితివి, అక్కట = అయ్యో, నామొఱన్ = నామనవిని, చిత్తగించి = విని, ప్రత్యక్షము = సాక్షాత్తుగా, కావవు ఏమిటికి = ఏల కాపాడవు.

తా. జగద్రక్షకా! నీవు ఆశ్రితులను రక్షించుదీక్ష పూనియెందఱిని కాపాడితివో నాకు తెలియదు. నేను విన్నంతమట్టుకు, పూర్వము ద్రౌపది దుర్యోధనునిసభలో చీరలు వలుచునపుడు గోవిందా! యని కూయిడఁగా లెక్కలేనిచీర లిచ్చితివఁట. ఇదివిన్నసంగతియే కదా. నీవిషయమున పరోక్షముగా ఎఱుఁగఁబడుచున్నయివి యన్ని నిజముల య్యెనేని ప్రత్యక్షముగా నామొఱ యాలించి నన్నేల కాపాడవు.

ఉ. నీలఘనాభమూర్తి వగు*నిన్నుఁ గనుంగొనఁగో
రి వేఁడినన్। జాలము సేసి డాఁగెదవు*సంస్తుతి కెక్కిన
రామనామ మే। మూలను దాఁచుకోఁ గలవు*ముక్తికిఁ
బ్రాపది పాపమూలకు। ద్దాలము గాదె మాయెడల*
దాశరథీ కరుణాపయోనిధీ. 56

టీ. నీల...మూర్తిని-నీల=నల్లని, ఘన=మేఘముతో, ఆభ=వంటిదైన, మూర్తివి=ఒడలుగలవాఁడవు, అగునిన్నున్=అయినట్టినిన్ను, కనుంగొనన్=చూచుటకు, కోరి=అపేక్షించి, వేఁడినన్=ప్రార్థింపఁగా, జాలముసేసి = మాయచేసి, డాఁగెదవు=దాఁచుకొనెదవు. సంస్తుతికిన్=పొగడ్తకు, ఎక్కినరామనామము=వచ్చినట్టిరామనామము, ఏమూలను=ఏమూలయందు- దాఁచుకోన్ కలవు=దాఁచుకొననేర్తువు-అది=ఆరామనామము, మాయెడలన్=మావిషయమందు, ముక్తికిన్=మోక్షమునకు, ప్రాపు=ఊఁతఁబట్టు-పాప...లము-పాప=పాపములయొక్క, మూల=వేళ్ళకు, కుద్దాలము=గుద్దలి-కాదె=కదా-అగుననుట.

తా. రామా! మేఘమువలె నల్లనైన నీ విగ్రహమును కన్నార చూడవలయునని యెంత ప్రార్థించినను మాయముచేసి దాఁచుకొనెదవు గాని యొకప్పుడును కనఁబడవు. మంచిది! నీవు దాఁగినను అంతటను ప్రకటమై వ్యాపించియున్న నీరామనామమునో నీవు ఎక్కడఁగాని దాఁచి పెట్టుకొనలేవు. అది యొకటియే మాపాపకులను, గుద్దలి వేళ్లను పెల్లగించునట్లు, సమూలముగాఁ బోఁగొట్టి మోక్ష మిచ్చుటకు సాధనముగా నున్నది. కానఅదియే చాలును; నీవు అగపడకున్నను చింతలేదు.

చ. వలదు పరాకు భక్తజన*వత్సల నీచరితంబు వ
మ్ముగా । వలదు పరాకు నీబిరుదు*వజ్రమువంటిది కా
వ కూరకే । వలదు పరాకు నాదురిత*వార్ధికిఁ దెప్పవు
గా మనంబులోఁ । దలఁతుమెకా నిరంతరము*దాశర
థీ కరుణాపయోనిధీ. 57

టీ. భక్తజనవత్సల-భక్తజన=భక్తసమూహములయందు, వత్సల=వాత్సల్యముగలవాఁడా- నీచరితంబు=నీచరిత్ర- వమ్ము=వ్యర్థము, కావలదు=కాకుండనిమ్ము- పరాకు=ఎచ్చరిక- జాగ్రత్త సుమాయనుట, నీబిరుదు = ఆశ్రితరక్షకుఁడు అనెడినీబిరుదము, వజ్రమువంటిది=వజ్రమువలెగట్టిది- కనుక, కావక=(మమ్ము) రక్షింపక, ఊరకే=వ్యర్థముగా, వలదు=వద్దు పరాకు=ఎచ్చరిక, నాదురితవార్ధికిఁ=నాపాపసముద్రమునకు, తెప్పవుగాఁ=తెప్పగా- మనంబులోఁ= మనస్సునందు, నిరంతరము= ఎప్పుడును, తలఁతుమెకా=తలంతుమే సుమా.

తా. భక్తవత్సలా! మమ్ము రక్షింపనియెడల ఆశ్రితరక్షణము మొదలగు గుణములు దెలుపు నీచరిత్రములును ఆశ్రితరక్షకుఁడ నుపవజ్రపంజరము నభేద్యమైన నీబిరుదును వ్యర్థములే యగును. అట్లు కావలదు వలదు. జాగ్రత్తసుమీ! నిన్ను, సముద్రమును దాఁటించు తెప్పవలె, నాపాపములను గడచిపుచ్చువానినిగా మనసులో ఎప్పుడును తలంతుము. కావున ఆతలంపును వ్యర్థము సేయకుమా.

ఉ. తప్పు లెఱుంగలేక దురి * తంబులు సేసితి నంటి
నీవు మా । యప్పవు గావు మంటి నిఁక * నన్యులకుఁ
నుదురంట నంటి నీ । కొప్పిదమైన దాసజను * లొప్పిన
బంటుకు బంట నంటి నా । తప్పుల కెల్ల నీవె గతి * దా
శరథీ కరుణాపయోనిధీ. 58

టీ. తప్పులు=దోషములను, ఎఱుంగలేక = తెలిసికొనలేక-దురితంబులు=పాపములను, చేసితిఁ అంటి=చేసినాను అని చెప్పితిని. నీవు, మాయప్పవు=మాతండ్రివి, కావుము అంటి = రక్షింపు మని చెప్పితిని, ఇఁకఁ, అన్యులకుఁ=ఇతరులకు, నుదురు=నెత్తిని, అంటను అంటి=తాఁకను అని చెప్పితిని- నీకు, ఒప్పిదమైన=తగినట్టివారైన-నీవు అంగీకరింపనట్టివారైన, దాసజనులు=సేవకసమూహములు- ఒప్పినబంటుకుఁ=సమ్మతించి స్వీకరించిన సేవకునికి, బంటను అంటి = సేవకుఁడను అంటిని, నాతప్పులకుఁ ఎల్లఁ= నానకు స్తదోషములకును, నీవే, గతి= దిక్కు.

తా. దశరథరామా! 'తప్పులు అని తెలియమిచేత పాపములు చేసితిని; నీవు మాతండ్రివి; కాపాడుము. ఇఁకమీఁద ఇతరులకు నదురుతాఁకి యంజలిసేయను. నీకు సమ్మతులైన దాసులదాసులకు దాసుఁడను' అని నీతో చెప్పికొంటిని. ఇఁక నీదాసులతప్పుల నెట్లో అట్లే నీదాసులదాసుఁడనైన నాతప్పులను దీర్చుదిక్కు నాకు నీవే సుమీ.

చ. ఇతఁడు దురాత్ముఁడంచుజను*లెన్నఁగ నాఱడిఁ
గొంటినేనెపో। పతితుఁడ నంటి నోపతిత*పావనమూర్తివి
నీవు గల్గ నే। నితరుల వేఁడ నంటి నిహ*మిచ్చిన నిమ్ము
పరంబొసంగుమీ। యతులితరామనామమధు*రాక్షరపా
ళి నిరతరంబు హృ। ద్గత మని నమ్మి కొల్చెదను*దాశ
రథీ కరుణాపయోనిధీ. 59

టీ. ఇతఁడు=వీఁడు, దురాత్ముఁడు అంచున్=చెడుమనస్సుగలవాఁడు అనుచు, జనులు=లోకులు, ఎన్నఁగన్=తలఁపఁగా, ఆఱడిన్ కొంటిన్=నిందపడితిని, నేనె పో=నేనే సుమీ, పతితుఁడను, అంటి=పాపాత్ముఁడను అని చెప్పితిని, ఓ=ఓ రామా! పతిత...మూర్తివి-పతిత=పాపులను, పావన=పవిత్రులనుజేయునట్టి, మూర్తివి=రూపముగలవాఁడవు, అగు, నీవు, కల్గన్=కలిగియుండఁగా, నేను, ఇతరులన్=అన్యులను-వేఁడను అంటిన్=ప్రార్థింపను అని చెప్పితిని. ఇహము=ఇహలోకసుఖము, ఇచ్చినన్=ఇచ్చితివేని, ఇమ్ము, పరంబు=పరలోకసౌఖ్యమును, ఒసంగుమీ=ఇచ్చునట్లైన ఇమ్ము—అతులిత...పాళి-అతులిత=సాటిలేని, రా

మనామ='రామ' అనెడి పేరుయొక్క, మధుర=తియ్యనైన, అక్ష
ర=అక్షరములయొక్క, పాళి=సమూహము, నిరంతరంబు= ఎ
ప్పుడును, హృత్+గతము=మనస్సున, బొందినది- నమ్మి, కొ
ల్చెదన=సేవించెదను.

తా. నేను దుష్టుఁడని జనులచేత నిందపడితిని. నాయంతట నేనే
పతితుఁడ నని నీతో చెప్పికొంటిని. పాపులను పావనులనుగాఁజే
య నవతరించి నీ వుండఁగా పతితుఁడ నైన నేను నిన్నే వేఁడుదు
నుగాని మఱియొకరిని వేఁడననియు చెప్పితిని. ఇఁక నీవొకఁడవే
నాకు స్వామిని గనుక ఇష్టమిచ్చినను నీచిత్తము. నేను మాత్రము
'రామ' యనెడి నీనామముయొక్క తీయనియక్షరములను మన
స్సునందు నిలుపుకొని కొలువు చేసెదను. అవ్వల నీవేమిచేసినను
చేయుము.

ఉ. అంచిత మైననీదుకరు*ణామృతసారము నాదుపై
ని బ్రో । క్షించినఁజాలు దాన నిర*సించెద నాదురితం
బు లెల్లఁ దూ । లించెద వైరివర్గ మెడ * లించెదఁ గో
ర్కులు నీమబంట నై । దంచెదఁ గాలకింకరుల*దాశర
థీ కరుణాపయోనిధీ. 60

టీ. అంచితము=ఒప్పునది, ఐన...సారము-ఐననీదుకరుణా=
అయినట్టినీదయ అనెడి, అమృతసారము=అమృతముయొక్క తే
ట, నాదుపైని=నామీఁద, ప్రోక్షించినన్=చల్లినయెడల, చా
లున్=అదియేచాలును, దానన్=దానిచేత- నాదురితంబులు ఎ
ల్లన్=నాపాపములను అన్నిటిని, నిరసించెదన్=తిరస్కరించె

ద-వైరివర్గము=శత్రుసమూహమును. తూలించెదన్=చెడునట్లు చేసెద, కోర్కులన్=రాగములను-ఎడలించెద=విడిచిపోవునట్లు చేసెద-పిదప, నీదుబంటను ఐ=నీదాసుండనై, కాలకింకరులన్=యమదూతలను, దంచెద=దంచినట్లు కొట్టి తఱిమెద.

తా. దశరథరామా ! ఒప్పిద మైనసీదయామృత సారమును నామీఁద జల్లుము. అదియే చాలును. దానిచేతనే నేను నాపాపములను దూలించి, అంతశ్శత్రువులయిన యింద్రియములను చిక్కఁబట్టి, రాగద్వేషములను వదలి, నీదాసుఁడనై యమకింకరులువచ్చిరేని నలియఁగొట్టి తఱిమెదను.

చ. జలనిధులేడు నొక్కమొగిఁ * జక్కికిఁ దెచ్చె శరం
బు, ఱాతినిం । పలరఁగఁ జేసె నాతిగఁ బ * దాబ్జపరాగ
ము, నీచరిత్రముం । జలజభవాదినిర్జరులు * సన్నుతిసేయఁ
గ లేరు గావునం । దలఁప నగణ్య మయ్యె యిది * దాశ
రథీ కరుణాపయోనిధీ. 61

టీ. శరంబు=నీబాణము, జలనిధులు ఏడున్=ఏడు సముద్రములను, ఒక్కమొగిన్=ఒక్కసారిగా, చక్కికిన్=ఒక్కచోటికి, తెచ్చెన్=తెచ్చెను, పదా...రాగము-పద+అబ్జ=తామరలవంటి నీయడుగులయొక్క, పరాగము=దుమ్ము, ఱాతిన్=ఱాతిని, ఇంపు=మనోజ్ఞత, అలరఁగన్=ఒప్పునట్లుగా, నాతిగన్=స్త్రీగా, చేసెను-కనుక, నీచరిత్రమున్=నీచరితను, జలజ...రులున్-జలజభవ=(తామరయందు పుట్టిన)బ్రహ్మ, ఆది=మొదలుగాఁగల, నిర్జరులున్=దేవతలును సన్నుతిసేయఁగన్=

స్తోత్రము చేయఁగా, లేదు, కావున = కనుక, తలఁపన్ = విచారించఁగా, అగణ్యము = గణుతింపరానిది.

తా. రామా ! నీబాణము సప్తసముద్రములను కలఁచి తీసికొని వచ్చినది. నీపాదపద్మములరజస్సు రాతిని సొగసైన యాఁడు దానిఁగాఁ జేసినది. ఇట్టినీచరిత్రను బ్రహ్మాదులకయినను పొగడ శక్యముగాదు గావున దానిని గణుతింప మముబోఁటికి సాధ్యమా ? కాదు.

ఉ. కోఁటికి శక్యమా యసుర*కోటుల గెల్వను గెల్చెఁబో నిజం ।। బాతనిమేన శీతకరుఁ*డౌట దవానలుఁ డట్టివింత ! మా సీతపతివ్రతామహిమ *సేవకుభాగ్యము మీకటాక్షముల్ ।ధాతకు శక్యమా పొగడ*దాశరథీ కరుణాపయోనిధీ. 62

టీ. అసురకోట్లను = కోట్లకొలఁది రాక్షసులను, గెల్వను = గెలుచుటకు, కోటికిన్ = ఒకకోఁటికి-శక్యమా = తగునా-గెల్చెన్ పో = గెలిచినను గెలువనీ, ఆతని మేనన్ = ఆవానరుని దేహమునందు, దవ + అనలుఁడు = కాఱుచిచ్చు, శీతకరుఁడు = చంద్రుడు-లేక, చల్లన చేయువాఁడు-ఔట = అగుట, ఎట్టివింత = ఎంతటియాశ్చర్యము-అది, మా...మహిమ-మా సీత = మాతల్లియైన సీతాదేవియొక్క, పతివ్రతా = పాతివ్రత్యముయొక్క, మహిమ = గొప్పతనమును, సేవకుభాగ్యము = మిమ్ము సేవించువానియొక్క భాగ్యవిశేషమును, మీకటాక్షముల్ = మీయొక్క కడగంటిచూపును

పొగడన్ = స్తుతించుటకు, ధాతకున్ = బ్రహ్మదేవునికిని, శక్యమా = తరమా-తరము కాదనుట.

తా. రామా! ఒక్కోఁతి మహాభయంకరులైన రాక్షసులను, కోట్లకొలఁదిని గెలుచుట శక్యము కాదు. అది యెట్లో శక్యమైనను కానిమ్ము. కాని, అతని దేహమున అంటించిన నిప్పు వేఁడిమి చూపక చల్లనగుట మఱియు నాశ్చర్యము! ఇంతకు సీతాపాతివ్రత్యముయొక్క ప్రభావమును మీయిరువురిని సేవించిన వానిభాగ్యమును మీకరుణాకటాక్షములును కారణము గనుక ఈమూఁటిని బ్రహ్మదేవునకును పొగడఁ దరము కాదు. మఱి ననుబోఁటులు ఏమని వర్ణింపఁగలరు.

ఉ. భూపలలామరామ రఘు*పుంగవరామ త్రిలోక
రాజ్యసం। స్థాపనరామ మోక్ష ఫల*దాయకరామ మదీ
యపాపముల్। పాపఁగదయ్య రామ నినుఁ*బ్రస్తుతి సే
సెద నయ్య రామ సీ। తాపతిరామ భద్రగిరి దాశరథీ క
రుణాపయోనిధీ. 63

టీ. భూపలలామ = రాజులకు శ్రేష్ఠుఁడవైన, రామ = రామా, రఘుపుంగవరామ-రఘుపుంగవ = రఘువంశమునఁ బుట్టినవారిలో శ్రేష్ఠుఁడవయిన, రామ = రామా, త్రిలోక...స్థాపన-త్రిలోక = ముల్లోకములయొక్క, రాజ్య = రాజ్యమును, సంస్థాపన = స్థాపించినట్టి-లోకములను ఏపీడలు లేక నిలుకడనొంది యుండునట్లు పాలించుచుండునట్టి, రామ = రామా, మోక్ష...దాయక-మోక్ష = అపవర్గమనెడి, ఫల = ఫలమును, దాయక = ఇచ్చునట్టి, రా

ము = రామా, సీతాపతి రామ = సీతకు పెనిమిటియైన రామా, నిన్ను౯, ప్రస్తుతిసేసెద = స్తుతించెదను, మదీయపాపముల్ = నా పాపములను, రామ = రామా, పావఁగదయ్య = పోఁగొట్టుము.

తా. రామా! నీవు రాజులలో నెల్ల శ్రేష్ఠుఁడవు. మఱి ప్రసిద్ధ రఘువంశమునఁ బుట్టినవాఁడవు. కేవలము రాజశ్రేష్ఠుఁడవే కాదు. ముల్లోకములను కుదురుగా నుండునట్లు ఏలునట్టిదిట్టవు. ముల్లోకములను ఏలుటే కాదు. వానికంటెను మిక్కిలి అతిశయించిన మోక్షఫలమును నీవే యిచ్చువాఁడవు. ఇంతే కాదు. అన్నిటికిని అతిశయించిన లక్ష్మీస్వరూపయగు సీతాదేవికి భర్తవు. ఇట్టి మితిలేని అతిశయము గలవాఁడవు గావున కోఁనకోరుక్రొలియ్య వచ్చును. ' నేను అతిశయుఁడనైతి నేని నీకు వరము ఇయ్యవలయునా ' అని యడుగకు. ఏమో తెలిసినంతవఱకు నిన్ను పొగడెదను. ఆపొగడ్తనుబట్టియైనను, నాపాపములను పోఁగొట్టి నన్నుఁ గాపాడుము.

ఉ. నీసహజంబు సాత్త్వికము, నీవిడిపట్టు సుధాపయోధి, ప | ద్మాసనుఁ డాత్మజుండు, గమలాలయనీ ప్రియురాలు, నీకు సిం | హాసన మిద్ధరిత్రి, గొడుగాకస, మక్షులు చంద్రభాస్కరుల్, | నీసుమతల్ప మాదిఫణి, నీవె సమస్తముఁ, గొల్చినట్టినీ | దాసులభాగ్య మెట్టిదయ దాశరథీ కరుణాపయోనిధీ. 64

టీ. సాత్త్వికము = సత్త్వగుణము, నీసహజంబు = నీకు సహజమైనది. సుధాపయోధి = పాలసముద్రము, నీవిడిపట్టు = నీయొ

కన్న-విడిదిచోటు, ఆత్మజుండు = నీకొడుకు, పద్మాసనుఁడు = బ్రహ్మ, నీప్రియురాలు, కమల+ఆలయ = (తామర ఇల్లుగాఁ గల) లక్ష్మీదేవి, ఈ+ధరిత్రి = ఈభూమి, నీకు, సింహాసనము, ఆకసము = ఆకాశము, గొడుగు, చంద్రభాస్కరులు = చంద్రుఁడును సూర్యుఁడును, అక్షులు = కన్నులు, ఆదిఫణి = ఆదిశేషుఁడు, నీసుమతల్పము=నీపూవుపాన్పు, సమస్తముక్=ప్రపంచమందలి సర్వపదార్థములును, నీవె=నీవే, ఇట్టినిన్ను, కొల్చి...భాగ్యము-కొల్చినట్టి=సేవించునట్టి, నీదాసుల=నీయొక్క దాసజనుల యొక్క, భాగ్యము=పెంపుసొంపు, ఎట్టిదయ=ఎట్టిదయా-మిక్కిలి అతిశయించిన దనుట.

తా. రామా! సత్త్వగుణము నీస్వభావము. పాలసముద్రము నీ విడిది. బ్రహ్మదేవుఁడు నీకొడుకు. లక్ష్మి నీభార్య. ఈభూమి నీ సింహాసనము. ఆకాశము నీగొడుగు. చంద్రసూర్యులు నీకన్నులు. ఆదిశేషుఁడు నీపూఁబాన్పు. కాఁబట్టి అన్నియు నీసొమ్మె యగును. ఇట్లు సర్వమునకును స్వామి వయిననిన్నుఁ గొల్చిన భక్తులభాగ్యము ఎట్టిదో చెప్పఁదరమా? కాదు.

చ. చరణము సోఁకినట్టిశిల * జవ్వనిరూప గు టొక్క
వింత, ను। స్థిరముగ నీటిపై గిరులు * దేలిన దొక్కటి
వింత, గాని మీ। స్మరణఁ దనర్చుమానవులు * సద్గతిఁ
జెందినదెంతవింత? యీ। ధరను ధరాత్మజారమణ *
దాశరథీ కరుణాపయోనిధీ. 65

టీ. ధరాత్మజారమణ-ధరాత్మజా =సీతాదేవికి, రమణ=భర్తయైనవాఁడా, చరణమున్ = నీపాదమును, సోఁకినట్టిశిల=తాఁకినట్టిఱాయి, జవ్వనిరూపు=యౌవనముగల స్త్రీయొక్క రూపము-అగుట, ఒక్కవింత=ఒక యాశ్చర్యము, నీటిపైన్=నీటిమీఁద, గిరులు=కొండలు, సుస్థిరముగన్=మిక్కిలినిలుకడఁగా తేలినది=మునుఁగక పైని తేలుచుండినది, ఒక్కటివింత=మఱియొక ఆశ్చర్యము, కానన్=కనుక-మీస్మరణన్=మిమ్ముస్మరించుటయందు, తనర్చుమానవులు=ఒప్పునట్టి మనుష్యులు, సద్గతిన్=మోక్షమును, చెందినది=పొందినది, ఈధరన్ = ఈభూమియందు, ఎంత వింత=ఎంతమాత్రము ఆశ్చర్యము.

తా. రామా! పాదములకు తాఁకిన రాతిని స్త్రీగాఁ జేయుటయు, నీళ్లమీఁద కొండలను మునుఁగకయుండునట్లు నిల్పుటయు, అనెడి యిట్టియాశ్చర్యములు చేసిన నిన్నుస్మరించిన వారికి నీవు మోక్షము నొసఁగుట ఒకయాశ్చర్యము కానేరదు.

ఉ. దైవము తల్లి తండ్రి తగు * ధాత గురుండు స
ఖుండు నిన్నె కా। భావన సేయుచున్నతఱిఁ * బాపము
లెల్ల నసోవిహారదు। ర్భావితుఁ జేయుచున్నవి కృ*పా
నుబ్ధినై ననుఁ గావుమీజగ। త్పావనమూర్తిభద్రగి
రీ దాశరథీ కరుణాపయోనిధీ. 66

టీ. జగత్+పావనమూర్తి=లోకములను పవిత్రము చేయురూపముగలవాఁడా-దైవము తల్లి, తండ్రి, తగు ధాత=తగునట్టిదా

త, గురుండు=గురువు, సఖుండు=చెలికాడు, నీవె=నీవే, కాన్=అగునట్లు, భావనచేయుచున్నతఱిన్= భావించుచున్న సమయమునందు, పాపములు ఎల్లన్=(నేను చేసికొన్న)పాపములన్నియును, మనో...భావితున్-మనః=మనస్సుయొక్క, వికార=వికారముచేత-దుర్భావితున్-దుష్టభావములతోఁగూడినవానిగా, చేయుచున్నవి, కృపామతివి+ఐ=దయగలమనస్సు గలవాఁడవై, నన్నున్, కావుమీ=రక్షింపుము.

తా. రామా! నేను నిన్నే దైవముగాను, తల్లిదండ్రులుగాను, గురువుగాను, స్నేహితుఁడుగాను, మనస్సున భావించుచుండఁగా నాపూర్వపాపములన్నియుఁజేరి నామనస్సును కలఁచి దుష్టభావములు కల్పించి చెఱుపుచున్నవి. నీవు లోకులపాపములను బోఁగొట్ట నవతరించినవాఁడవు. కనుక నాపాపములను బోఁగొట్టి నాబుద్ధి నీయందు నిలిపి కాపాడుము.

ఉ. వాసవరాజ్యభోగసుఖ * వార్ధిని దేలుప్రభుత్వ
మబ్బినా । యాసకు మేర లేదు కన*కాద్రిసమానధనం
బుఁ గూర్చినం । గాసును వెంటరాదు కని*కానక చేసి
న పుణ్యపాపముల్ । వీసరపోవనీవు పది*వేలకుఁ జాలు
భవంబునొల్ల నీ । దాసుని గాఁగ నేలికొను*దాశరథీ
కరుణాపయోనిధీ. 67

టీ. వాసవ...వార్ధినిన్ - వాసవ = ఇంద్రునియొక్క, రాజ్య = దొరతనమును, భోగ = అనుభవించుటవలని, సుఖ = సౌఖ్యము అనెడి, వార్ధిని = సముద్రమందు-తేలు, ప్రభుత్వ

ము=తేలునట్టి దొరతనము- అబ్బినా= లభించినప్పటికిని, ఆ నకుఁ, మేర లేదు=మితి కలుగదు. కన...ధనంబు-కనక+అ ద్రి=బంగారుకొండతోడ, సమాన=సమానమైన- ధనంబుఁ= ద్రవ్యమును, కూర్చినఁ = సేకరించినను, కాసును = కాసు కూడ, వెంటరాదు=చచ్చినపుడు వెంబడిరాదు. కని=తెలిసియు, కానక=తెలియకయు, చేసిన= చేసినట్టి పుణ్యపాపములో, వీసర పోకనీవు=వెలితిపడ నియ్యవు-పదివేలతుఁ= పదివేల అనర్థముల కును, చాలుఁ=అవి చాలియుండును-కనుక, భవంబుఁ=పుట్టు కను-పుణ్యపాపములు సేసి జన్మము లెత్తుటను, ఒల్లఁ = ఇష్టపడ ను, నీదాసుని గాఁగఁ=నీసేవకునిగా, ఏలుకొను= స్వామివై చేపట్టి రక్షింపుమనుట.

తా. రామా! ఇంద్రభోగమును ఇంద్రునివైశ్వర్యమును గలి గినను, ఆశకు మితి లేదు. బంగారుకొండంతధనముకూర్చి పెట్టి నను పరలోకమునకు పోవునపుడు ఒక కాసుకూడ వెంట రాదు. తెలిసియో తెలియకయో చేసిన పుణ్య పాపములో, మట్టును ఆచరిం చుకొని కొంచెమైనను తప్పించుకొనుటకు అవకాశమీయవు. మరి యెన్నియనర్థములయినను కలిగింపఁజాలును. కనుక పుణ్యపాప ములుసేసి జన్మము లెత్తుటకు నాకు ఇష్టములేదు. నీదాసునిగా చేపట్టి జన్మము లేకుండఁ గాపాడుమా.

ఉ. సూరిజనుల్ దయాపరులు ✻ సూనృతవాదు ల లుబ్ధమానవుల్ । వీరపతివ్రతాంగనలు ✻ విప్రులు గోవు లు వేదముల్ మహీ । భారముఁ దాల్పఁగా జనులు ✻

పావన మైనపరోపకారస । త్కారమెఱుంగలేరకట ❊
దాశరథీ కరుణాపయోనిధీ. 68

టీ. సూరిజనుల్=పండితసమూహములును, దయాపరులు=దయగలవారును, సూనృతవాదులు=సత్యముపలుకువారును, అలుబ్ధమానవుల్ = లోభములేని మనుష్యులును, వీరపతివ్రతాంగనలు=వీరత్వముతో - అనఁగా దృఢముగా - పతివ్రతలై యుండు స్త్రీలును, విప్రులు=బ్రాహ్మణులును, గోవులు, వేదములు, మహీభారము=భూమియొక్కబరువును, తాల్పఁగాన్ = ధరింపఁగా, జనులు = సామాన్యులైన తక్కిన జనులు, పావనము=పవిత్రము, ఐన...రము- ఐన పరోపకార = ఐనట్టి పరోపకారమునకు, సత్కారము=సత్కరించుట ఎఱుంగలేరు=తెలియలేరు. అకట=అకటా.

తా. రామా! పండితులు, దయాళువులు, సత్యసంధులు, లోభములేనివారు, మిక్కిలి పతివ్రతలయినస్త్రీలు, బ్రాహ్మణులు, గోవులు, వేదములును ఈభూజనులను ఉద్ధరించుచున్నవి. ఇట్టి ఉపకారపరులను తక్కినజనులు ప్రత్యుపకారము చేసి పూజింపవలయుట ధర్మము. అయినను అది జనులు తెలియకున్నారు.

ఉ. వారిచరావతారమున ❊ వారిధిలోఁ జొరఁబాఱి క్రోధవి। స్ఫారగుఁడైనయానిగమ ❊ తస్కరవీరనిశాచరేంద్రునిం। జేరి వధించి వేదముల ❊ చిక్కెడలించి విరించికిన్ మహో। దారత నిచ్చితీవె కద ❊ దాశరథీ కరుణాపయోనిధీ. 69

టీ. వారిచర+అవతారమునన్=మత్స్యమైన అవతారమందు, వారిధిలోన్= సముద్రములోనికి, చొరఁబాఱి= వేగముగా చొచ్చి, క్రోధవిస్తారగుఁడు-మిక్కిలియైనకోపమును, పొందినవాఁడవు, ఐన...రేంద్రునిన్-ఐన, ఆ=ప్రసిద్ధుఁడైన, నిగమ=వేదములను, తస్కర=దొంగలించినవాఁడైన, వీర= వీరుఁడగు, నిశాచర+ఇంద్రునిన్= రాక్షసశ్రేష్ఠుఁడైన సోమకాసురుని, చేరి=పొంది-వధించి= చంపి, వేదములచిక్కు= వేదములగజిబిజిని, ఎడలించి= తీసి, విరించికిన్= బ్రహ్మకు, మహా+ఉదారతన్ మిక్కిలిదాతృత్వముతో, ఈవె=నీవే, ఇచ్చితికద=ఇచ్చితివి గదా.

తా. రామా! మత్స్యావతారమునందు సముద్రములోపల వేగముగా చొచ్చి మిక్కిలికోపాతిశయము గలిగినవాఁడై వేదములను దొంగిలికొనిపోయిన వీరుఁడైన మేటిరాక్షసుఁడగు సోమకాసురుని పట్టి వధించి వేదములచిక్కు విడఁదీసి బ్రహ్మకు మరల వానిని మిక్కిలియౌదార్యముతో నిచ్చినవాఁడవు నీవే కాని మఱెవ్వరును గారు, అట్టినీవు నన్ను గాపాడఁదగును.

చ. కరమనురక్తి మంథరము * గవ్వముగా నహిరాజు ద్రాడుగా। దొరఁకొని దేవదానవులు * దుగ్ధపయోధి మథించుచున్నచో। ధరణి చలింప లోకములు * తల్లడ మందఁగఁ గూర్మమై ధరా। ధరము ధరించి తీవె కద * దాశరథీ కరుణాపయోనిధీ. 70

టీ. కరము=మిక్కిలి, అనురక్తిన్=అనురాగముతో-దేవదానవులు-దేవ=దేవతలును, దానవులు= రాక్షసులును, మంథర

ము=మంధరపర్వతమును, కవ్వము గాన్, అహిరాజు=సర్పములకు రాజయినవాసుకి, త్రాఁడు గాన్=కవ్వపుత్రాఁడుగాను, కైకొని=పూని, దుగ్ధపయోధిన్=పాలసముద్రమును, మథించుచున్నచోన్=చిలుకుచుండఁగా, ధరణి=భూమి, చలింపన్=వడఁకఁగా, లోకములు=జగములు, తల్లడమందఁగన్=తల్లడిల్లఁగా, కూర్మము ఐ=తాఁబేలు అయి, ధరాధరమున్=కొండను. ఈవె=నీవే, ధరించితికద=దాల్చితివిగదా.

తా. రామా! దేవతలును రాక్షసులును మిక్కిలియక్కఱఁగొని మంధరపర్వతము కవ్వముగాను సర్పరాజగు వాసుకిని కవ్వపుఁద్రాఁడుగాను జేసి పాలసముద్రమును చిలుకుచుండఁగా ఆపుడాకొండ తటాలున మునుఁగుటచేత భూమి యదిరి లోకములు తల్లడిల్లుటఁ జూచి కూర్మావతారము నెత్తి కొండను వీఁపుమీఁదఁ దాల్చినవాఁడవు నీవే కదా.

ఉ. ధారుణిఁ జాపఁ జుట్టినవి*ధంబునఁ గైకొని హే
మనేత్రుఁ డా। వారిధిలోన డాఁగినను*వానివధించి వ
రాహమూర్తివై। ధారుణిఁ దొంటికైవడిని*దక్షిణశృం
గమునన్। ధరించి వి। స్తార మొనర్చితీవె కద*దాశర
థీ కరుణాపయోనిధీ. 71

టీ. ధారుణిన్=భూమిని, చాఁపన్=చాఁపను, చుట్టినవిధంబునన్=మడిచినతీరుగా, హేమనేత్రుఁడు=హిరణ్యాక్షుఁడు, చైకొని=చుట్టి ఎత్తుకొని, ఆవారిధిలోనన్=ఆప్రసిద్ధమైన సముద్రమునందు, డాఁగినన్=దాఁచుకొనఁగా, వానిన్=ఆహిర

హిరణ్యాక్షుని, వధించి=చంపి, వరాహమూర్తివై = పంది యాకారముగలవాఁడవై. ధారుణిన్ = (హిరణ్యాక్షుఁడు చుట్టి కొంపోయిన) భూమిని, దక్షిణశృంగమునన్ = కుడికొమ్మునందు. ధరించి=తాల్చి, తొంటికైవడిన్=మునుపటివిధమున, విస్తారము=విరివి-చాపుగా నుండునదిగా, ఈవె=నీవే, ఒనర్చితి కద=చేసితివిగదా.

తా. దశరథరామా! హిరణ్యాక్షుఁడు భూమిని చాపఁ జుట్టగా చుట్టి యెత్తికొని సముద్రములోనికిఁ బోయి దాఁచుకొనఁగా, నీవు వానిని జంపి, వరాహమూర్తి దాల్చి కుడివంటికోఱతో భూమిని యెత్తికొనివచ్చి మునుపటివలె చాపుగా పఱపు నొంది యుండునట్లు చేసినవాఁడవు నీవే కాని మఱెవరును గారు. కనుక ఇట్టిజగదుద్ధారకుఁడవైన నీవు నన్నును ఉద్ధరింపుమా.

చ. పెట పెట నుక్కుఁగంబమున* భీకరదంతనఖాంకుర
ప్రభా। పటలము గప్ప నుప్పతిలి* భండనవీథి నృసింహ
భీకర। స్ఫుటపటుశక్తి హేమకశి*పున్ విదళించి సురారి
పట్టినం। తటుఁ గృపఁ జూచి తీవె కద* దాశరథీ కరుణా
పయోనిధీ. 72

టీ. ఉక్కుకంబమునన్ = ఇనుపస్తంభమునందు, పెటపెట= పెటపెటమని శబ్దించునట్లు, భీకర... పటలము — భీకర=భయంకరమైన, దంత=పండ్లయొక్కయు, నఖ+అంకుర=గోటిమొనలయొక్కయు, ప్రభా=కాంతియొక్క, పటలము=సమూహము, కప్పన్ = కప్పుకొనఁగా. ఉప్పతిలి= పుట్టి, భండనవీథిన్ =

యుద్ధరంగమున, నృసింహ...శక్తిన్- నృసింహ = నరసింహావతారముయొక్క, భీకర = భయంకరమైనదియు, స్ఫుట = స్పష్టమైనదియు, పటు = కటువైనదియు, అగుశక్తిన్ = సామర్థ్యముచేత, హేమకశిపున్ = హిరణ్యకశిపుని, విదళించి = చీల్చి, అంతటన్ = పిమ్మట, సురారిపట్టిన్ = (రాక్షసుని కొడుకైన) ప్రహ్లాదుని, కృపన్ = దయతో, ఈవె = నీవే, చూచితికద = చూచితివికదా.

తా. రామా! నీవు ఇనుపస్తంభమున పెటపెటమని నరసింహుఁడవై పుట్టి నీపండ్లయొక్కయు మొగ్గలవంటి గోళ్లయొక్కయు తెల్లని కాంతులు నిన్నుఁ గ్రమ్మఁగా భయంకరమైన శక్తిచే హిరణ్యకశిపునిఱొమ్ము చీల్చి చంపి పిదప వానికొడుకైన ప్రహ్లాదుని గాపాడినవాఁడవేకదా. అట్లే నన్నును గాపాడుమా.

చ. పదయుగళంబు భూగగన*భాగములన్ వెస నూని విక్రమా। స్పద మగునబ్బలీంద్రు నొక*పాదమునం దలక్రింద నొత్తి మే। లొదవ జగత్త్రయంబుఁ బురు*హూతునకియ్య వటుండవైనచి। త్పదమలమూర్తి వీవె కద*దాశరథీ కరుణాపయోనిధీ. 73

టీ. పదయుగళంబు= పాదములజంటను- రెండుపాదములను, భూ...గములన్-భూ= భూమియొక్కయు, గగన= ఆకాశముయొక్కయు, భాగములన్= ప్రదేశములందు-వెసన్= శీఘ్రముగా, ఊని=నిలిపి, విక్రమ+ఆస్పదము-విక్రమ= పరాక్రమమునకు, ఆస్పదము=స్థానము-అగునబ్బలీంద్రున్=అయినట్టి ఆబలి

చక్రవర్తిని, ఒకపాదమునన్=ఒక కాలిచే, క్రిందన్=క్రిందుగా, తలన్=తలను, ఒత్తి=అదిమి-మేలు=శ్రేయస్సు, ఒదవన్=కలుగఁగా, పురుహూతునకున్= ఇంద్రునికి, జగత్త్రయంబున్=లోకములుమూఁటిని, ఇయ్యన్=ఇచ్చుటకు-వటుండవు=వడుగవు, ఐన...మూర్తివి-ఐన, చిత్=జ్ఞానమును, సత్=ఉనికియు-లేక సత్యమును, అయిన, అమల=నిర్మలమగు, మూర్తివి=విగ్రహము గలవాఁడవు, నీవెకద=నీవే కాదా-ఇది వామనావతారవర్ణనము.

తా. ఒక చరణము భూమియందును మఱొకటి ఆకాశమునందును పెట్టి యిట్లు రెండు చరణములచే లోకమాక్రమించి మహాపరాక్రమవంతుఁడైన బలిచక్రవర్తితలమీఁద నొకచరణముపెట్టి క్రిందికి పాతాళమునకు అడఁగఁద్రొక్కి మేలగునట్లు ముల్లోకములను ఇంద్రునకు ఇచ్చుటకై వడుగువాఁడవై పుట్టినసచ్చిదానందమూర్తివి నీవే కాని మఱియెవ్వరును గారు. కనుక నన్నుఁ గాపాడుమా.

చ. ఇరువదియొక్కమాఱు ధర*ణీశుల నెల్ల వధించి తత్క ళే । బరరుధిరప్రవాహమునఁ*బైతృకతర్పణ మొప్పఁ జేసి భూ । సురవరకోటికిన్ ముదము*సొప్పడ భార్గవరామమూర్తి వై । ధరణి నొసంగి తీవె కద*దాశరథీ కరుణాపయోనిధీ. 74

టీ. ఇరువదియొక్కమాఱు=ఇరువదియొక్కతూరులు, ధరణీశులన్=రాజులను, ఎల్లన్=అందఱిని, వధించి=చంపి, తత్...హామునన్-తత్=వారియొక్క, కళేబర=దేహములయొక్క, రు

ధర=నెత్తుటియొక్క, ప్రవాహమునన్=వెల్లువచేత, పైతృకత ర్పణము=పితరులకు జలతర్పణము, ఒప్పన్=తగునట్లు, చేసి, భూసురవరకోటికిన్=బ్రాహ్మణశ్రేష్ఠులసమూహమునకు, మోదము=సంతోషము, చొప్పడన్=కలుగునట్లు, భార్గవరామమూర్తివి ఐ=భార్గవరాముఁడుగా అవతరించినవాఁడవై, ధరణిన్=భూమిని, ఈవె=నీవే, ఒసంగితికద=దానముచేసితివి గదా.

తా. రామా! రాజులనందఱిని ఇరువదియొక్క పర్యాయములు చంపి వారి దేహములనెత్తుటివెల్లువలచేత పితరులకు జలతర్పణమిచ్చి వారివద్దనుండి జయించిన భూమిని బ్రాహ్మణసమూహమునకు సంతోషము కలుగునట్లు దానముసేసిన పరశురాముఁడవు నీవే యగుదువు.

చః దురమునఁ దాటకం దునిమి*ధూర్జటివిల్ దును
మాడి సీతనుం । బరిణయ మంది తండ్రి పనుపన్ ఘ
నకాననభూమి కేఁగి దు । స్తరపటుచండకాండకులిశా
హతి రావణకుంభకర్ణభూ । ధరములఁ గూల్చి తీవె కద*
దాశరథీ కరుణాపయోనిధీ. 75

టీ. దురమునన్=యుద్ధమున, తాటకన్=తాటకను, తునిమి=చంపి, ధూర్జటివిల్=శివునివిల్లు, తునుమాడి=విఱిచి, సీతనున్=సీతాదేవిని, పరిణయము+అంది=పెండ్లాడి, తండ్రి, పనుపన్=అడవికి పంపఁగా, ఘన...భూమికిన్-ఘన=గొప్పదైన, కానన భూమికిన్=అరణ్యప్రదేశమునకు, ఏఁగి=పోయి, దుస్తర...హతిన్-దుస్తర=కడవరానిదియు-పటు=పటుత్వముగలదియు, చం

డు=తీక్ష్ణమైనదియు, అగు, కాండ= బాణమనెడి, కులిశ= వజ్రముయొక్క, ఆహతిన్=దెబ్బచేత, రావణ...ధరములన్-రావణకుంభకర్ణ=రావణుఁడు కుంభకర్ణుఁడు అను, భూధరములన్=కొండలను-ఈవె=నీవే, కూల్చితికదా=కూలవైచితివికదా.

తా. రామా! యుద్ధమున తాటకను చంపి, శివునివిల్లు విఱిచి, సీతను పెండ్లాడి, తండ్రి పంపఁగా పేరడవికి పోయి, వజ్రాయుధముచేత కొండలను గూల్చునట్లు వారింపరాని వాఁడిబాణమున రావణకుంభకర్ణులను గూల్చినవాఁడవు నీవే యగుదువు.

చ. అనుపమయాదవాన్వయ సు*ధాబ్ధిసుధానిధి కృ
ష్ణమూర్తి నీ। కనుజుఁడు గా జనించి కుజ*నావళి నెల్ల
నణంచి రోహిణీ। తనయుఁ డనంగ బాహుబల*దర్పము
నన్ బలరామమూర్తివై। తనరినవేల్పు వీవె కద*దాశర
థీ కరుణాపయోనిధీ. 76

టీ. అనుపమ...నిధి- అనుపమ= సాటిలేని, యాదవ+అన్వయ= యాదవవంశము అనెడి, సుధా+అబ్ధి= పాలసముద్రమునకు, సుధానిధి= చంద్రుఁడగు-కృష్ణమూర్తి=కృష్ణుఁడు, నీకున్, అనుజుఁడుగాన్=తమ్ముఁడు అగునట్లుగా-రోహిణీతనయుఁడు అనఁగన్=రోహిణీదేవికుమారుఁడు అని జనులాడఁగా, జనించి=పుట్టి, బాహుబలదర్పమునన్= బాహుబల= భుజములబలిమిచేతనైన, దర్పమునన్= గర్వముచేత, కుజన+ఆవళిన్ ఎల్లన్= దుష్టులసమూహమును అంతయు, అడంచి=అడఁగఁద్రొక్కి, బల

రామమూర్తివై= బలరామావతారమెత్తినవాఁడవై, తనరిన వేల్పువు=ఒప్పునట్టి దేవుఁడవు, ఈవె కద=నీవే కదా.

తా. రామా! యాదవవంశతిలకుఁడైన కృష్ణుఁడు తమ్ముఁడుగా, రోహిణీదేవికడుపునఁ బుట్టి, భుజబలాతిశయముచేత దుష్టసమూహములనెల్ల రూపుమాపి బలరాముఁడుగా నవతరించిన దేవుఁడవు నీవే యగుదువు.

చ. సురలు నుతింపఁగాఁ ద్రిపుర * సుందరులన్ వరి
యింప బుద్ధరూ। పరయఁగఁదాల్చి తీవు త్రిపు*రాసుర
కోటిదహించునప్పుడా। హరునకుఁ దోడుగా వరశ*రా
సనబాణముఖోగ్రసాధనో। త్కరమొనరించి తీవె కద *
దాశరథీ కరుణాపయోనిధీ. 77

టీ. అరయఁగన్=విచారింపఁగా, సురలు=దేవతలు, నుతింపఁగాన్=పొగడఁగా, త్రిపురసుందరులన్= త్రిపురములందలి స్త్రీలను, వరియింపన్=వరించుటకై, బుద్ధరూపు=బౌద్ధమూర్తిని, ఈవు=నీవు, తాల్చితి=ధరించితివి, త్రిపుర+అసురకోటిన్- త్రిపుర=త్రిపురములలో వసించు, అసురకోటిన్=రాక్షససమూహమును, దహించునప్పుడు=కాల్చి నీఱు సేయునపుడు, ఆహరునకున్= ప్రసిద్ధుఁడైన శివునకు, తోడుగాన్=సాహాయ్యముగా, వర...త్కరము-వర=శ్రేష్ఠమైన, శరాసన=విల్లు, బాణ=బాణము, ముఖ=మొదలైన, ఉగ్ర=భయంకరమగు, సాధన=పరికరముయొక్క, ఉత్కరము=సమూహము, ఈవే=నీవే, ఒనర్చితికదా= చేసితివి కాదా.

తా. దేవతలు పొగడి ప్రార్థింపఁగా త్రిపురములందలి స్త్రీలను వరించుకొఱకు బౌద్ధవిగ్రహము దాల్చినవాఁడవు నీవే. అత్రిపుర రాక్షససమూహములను కాల్చునపుడు శివునికి విల్లు అమ్ము మొదలైన సాధనములను సవరించి సాహాయ్యము చేసినవాఁడును నీవే. ఇట్లు దుష్టులను నిగ్రహించి శిష్టులను రక్షించునీవు నన్నును రక్షింపుమా.

ఉ. సంకరదుర్గమై దురిత * సంకులమైనజగంబుఁ
జూచి స । ర్వాంకషలీల నుత్తమతు * రంగము నెక్కి క
రాసిఁ బూని వీ । రాంకవిలాస మొప్పఁ గలి * కాకృతి
సజ్జనకోటికిన్ నిరా । తంక మొనర్చె దీవె కద * దాశర
థీ కరుణాపయోనిధీ. 78

టీ. సంకరదుర్గమై-సంకర=వర్ణసంకరముచేత, దుర్గమై=ప్రవేశింపరానిదై- దురితసంకులము = దురిత = పాపముచేత, సంకులము=వ్యాపించినది, ఐనజగంబు=అయినట్టిలోకమును, చూచి, సర్వాంకషలీలన్-సర్వాంకష=అన్నిటిని ఒరయుచున్న-నిరతిశయమైన, లీలన్=విలాసముతో, ఉత్తమతురంగము=మేలయిన గుఱ్ఱమును, ఎక్కి, కర+అసిన్=చేతికత్తిని, పూని=తాల్చి, వీర+అంక విలాసము-వీర+అంక=వీరుఁడనుటకు సూచకమైన, విలాసము=లీల-ఒప్పన్=ఒప్పుచుండఁగా, కలిక+ఆకృతిన్=కల్కి ఆకారముతో-అనుట అసాధువు- సజ్జనకోటికిన్ = సత్పురుష సమూహమునకు, నిరాతంకము = ఆటంకములేమి- ట, ఈవె = నీవె, ఒనర్చెదు కద = చేయుచున్నావు గదా.

తా. రామా! వర్ణసంకరము మిక్కిలి బలిష్ఠమైన పాపము నిండియున్న జగమును జూచి మిక్కిలిలీలతో గొప్పగుఱ్ఱము నెక్కి, చేత కత్తి దాల్చి, పరాక్రమవిలాసము మెఱయఁగా కల్కిమూర్తివై తోఁచి, సజ్జనులకు దురాచారవర్ణ సంకరాదిప్రతిబంధకములు లేకుండునట్లు ఇట్టి చేయఁగలవాఁడవు నీవే యగుదువు.

చ. మనమున నూహాపోహణలు॥మర్వ్యకమున్నె కఫా
దిరోగముల్। దనువుననంటి మేనిబిగి॥దప్పకమున్నె నరుం
డు మోక్షసా। ధన మొనరింపఁగావలయుఁ॥దత్త్వవిచా
రము మానియుండుట। ల్తనువునకుర్ విరోధ మిది॥దా
శరథీ కరుణాపయోనిధీ. 79

టీ. మనమునన్=మనస్సునందు, ఊహాపోహణలు=ఊహాపోహములు-- మర్వకమున్నె = మఱచిపోకమునుపే, కఫాదిరోగముల్ = కఫము మొదలయిన తెవుళ్ళు, తనువునన్ = దేహమునందు, అంటి = కలిగి మేనిబిగి = దేహముయొక్క పటుత్వము, తప్పకమున్నె = తప్పిపోవుటకు పూర్వము, నరుండు = మనుష్యుఁడు, మోక్షసాధనము- మోక్ష = మోక్షమునకు; సాధనము = సాధించుఉపాయమును, ఒనరింపవలయున్ = చేసికొనవలయును, తత్త్వవిచారము-తత్త్వ = వస్తువులకలరూపును-విచారము = పరిశీలనము - మానియుండుటల్ = వదలియుండుకార్యములు, తనువునకున్ = దేహమునకు, అది, విరోధము = విరుద్ధమయునది.

తా. రామా! మనస్సునకు ఊహించు శక్తియు తలంచుకొనుశక్తియు నశింపకమునుపును, కఫము మొదలైనరోగములు దేహము

న వ్యాపించి పటుత్వము తప్పకమునుపును, మనుష్యుఁడు తత్త్వవిచారము చేసి మోక్షమునకుఁ దగిన సాధనములను చేసికొనవలయును. పిదప చేసికొనుటకు శక్యము కాదు. తత్త్వవిచారము సేయకుండుట మిక్కిలి స్వరూపమునకు విరుద్ధమగును.

చ. ముదమున కాటపట్టు, భవ * మోహమదద్విర
దాంకుశంబు, సం। పదలకొటారు, కోరుకుల * పంట, ప
రంబున కాది, వైరుల। న్నదన జయించుతోవ, విప * ద
బ్ధికినావ, గదా సదా భవ। త్సదమలనామసంస్మరణ * దాశ
రథీకరుణాపయోనిధీ 80

టీ. భవత్...స్మరణ-భవత్=నీయొక్క, సత్=శ్రేష్ఠమును, అమల=నిర్మలమునైన, నామ=నామముయొక్క, సంస్మరణ=మిగుల స్మరించుట, ముదమునకున్=సంతోషమునకు, ఆటపట్టు=స్థానము-భవ...దాంకుశంబు-భవ=పుట్టుకయును, మోహ=అజ్ఞానమును అనెడి, ద్విరద=ఏనుఁగులకు, అంకుశంబు=అంకుసము-సంపదల కొటారు=సంపత్తులు చేర్చియుండెడు కొట్టు-పరంబునకున్=పరలోకమునకు, ఆది=మొదలు-మూలమయినది, వైరులన్=శత్రువులను, అదనన్=సమయము చూచి, జయించుతోవ=గెలుచుమార్గము, లేక-పరంబునకున్, ఆదివైరులన్=మొదటివిరోధులను-ఇంద్రియములననుట, అదనన్=సమయమున, జయించు తోవ=గెలుచునట్టిమార్గము-విపత్+అబ్ధికిన్=ఆపద అనెడిసముద్రమునకు, నావ=ఓడ-కదా=అగుభనుట.

తా. రామా! నిర్మలమైన నీనామమును స్మరించుట సంతోషము కలిగించును; అంకుశముచే ఏనుఁగును అణఁచునట్లు ఎడతెగకయుండు జన్మపరంపరను అణచును; సకలసంపదలను ఇచ్చును; కోరికల నెల్ల సఫలము గావించును; పరలోకమునకు మూలము; పగవారిని గెలుచుటకు సాధనమైనది; సముద్రమును దాఁటించు నోడవలె ఆపదలను కడపివుచ్చును.

చ. దురితలతానుసారిభవ * దుఃఖకదంబము రామనామభీ। కరతరహేతిచేఁ దెగి వ*కావకలై చనకుండ నేర్చునే। దరికొని మండుచుండుశిఖి * దార్కొనినన్ శలభాది కీటకో। త్కరము విలీనమై చనదె * దాశరథీ కరుణాపయోనిధీ. 81

టీ. దురిత ... కదంబము—దురిత=పాపమనెడి, లతా=తీఁగను, అనుసారి=అనుసరించుచున్న, భవ=పుట్టుక లనెడి, దుఃఖకదంబము=దుఃఖ సమూహము, రామ... హేతిచేన్ - రామనామ=రామనామము అనెడి, భీకరతర= మిక్కిలి భయంకరమైన, హేతిచేన్=కత్తిచేత, తెగి=ఖండితమై-వకావకలై=ఛిన్నభిన్నమై, చనకుండ నేర్చునే= పోవకుండఁజాలునా-ఇందులకు దృష్టాంతము నెప్పుచున్నాఁడు, దరికొని= రగులుకొని, మండుచుండుశిఖిన్=జ్వలించుచున్న అగ్నిని, దార్కొనినన్= తారసింపఁగా, శలభ...త్కరము-శలభ=మిడుతలు, ఆది=మొదలైన, కీటక=పురుగుల- అల్పజంతువుల, ఉత్కరము= సమూహము, విలీనమై= మిక్కిలి అడఁగిపోయినదై, చనవె=పోదా.

తా. రామా! పాపము పయిపయి పొంగఁగా దానితోఁగూడ పొంగుదుఃఖాత్మకమైన జన్మపరంపర, కత్తిచేత తీఁగ త్రెంపఁబడునట్లు, రామనామముచే నశించి పటాపంచలై, రగిలియుండుచున్న అగ్నియందుఁ బడినమిడుతలు మొదలైన పురుగులవలె, రూపుమాసి పోవును.

చ. హరిపదభక్తినింద్రియజ * యాన్వితుఁడుత్తముఁ
డింద్రియంబులన్। మరుగక నిల్పనూఁదినను * మధ్యముఁ
డింద్రియపారవశ్యుఁడై। పరఁగినచో నికృష్టుఁ డని * ప
ల్కఁగ దుర్మతి నైననన్ను నా। దరమున నెట్లు కాచెద
వో * దాశరథీ కరుణాపయోనిధీ. 82

టీ. హరిపదభక్తిన్=విష్ణుపాదములందలిభక్తిచేత, ఇంద్రి...తుఁడు-ఇంద్రియ= ఇంద్రియములను, జయ= గెలుచుటతోడ, అన్వితుఁడు=కూడినవాఁడు, ఉత్తముఁడు= శ్రేష్ఠుడు, ఇంద్రియంబులన్=ఇంద్రియములందు, మరుగక=లీనుఁడుగాక- నిల్పన్=దానిని నిగ్రహించుటకు, ఊఁదినను= ప్రయత్నించినయెడల, మధ్యముఁడు= నడితరపువాఁడు, ఇంద్రియపారవశ్యుఁడై- ఇంద్రియ= ఇంద్రియములకు, పారవశ్యుఁడై=అధీనుఁడై, పరఁగినచోన్=ప్రవర్తించినయెడల, నికృష్టుఁడు=అధముఁడు, అని, పల్కఁగన్= చెప్పఁగా-దుర్మతిని-దుష్టబుద్ధిని-ఇంద్రియములకు లోనైనవాఁడను-ఆదరమునన్=ఆదరువుతో, ఎట్లు, కాచెదవో=కాపాడెదవో.

తా. దశరథరామా! విష్ణుపదభక్తితో ఇంద్రియములను గెలిచినవాఁడు ఉత్తముఁడు ; ఇంద్రియములకు లోనుగాక నిగ్రహించ

ప్రయత్నపడినవాఁడు మధ్యముఁడు; ఇంద్రియములకు అధీనుఁడైనవాఁడు అధముఁడు. ఈమువ్వురిలో దుష్టబుద్ధినైన నేను అధముఁడను గనుక రక్షింపఁదగినవాఁడను గాను అయినను నన్నెట్లు రక్షించెదవో తెలియను.

చ. వనకరి చిక్కె మైనసకు * వాచవికిం జెడిపోయె మీను తా। వినికికిఁ జిక్కెఁ జిల్వ కను * వేదుఱుఁ జెందెను లేళ్లు తావిలో। మనికి నశించెఁ దేఁటి తర * మా యిరుమూఁటిని గెల్వనైదుసా। ధనముల నీవె కావఁ దగు * దాశరథీ కరుణాపయోనిధీ. 83

టీ. వనకరి=అడవియేనుఁగు, మైనసకున్ = దేహమునందలి చాపల్యమునకు- చిక్కెన్= చిక్కువడెను, మీను=చేఁప, వాచవికిన్=నోటిరుచికి- చెడిపోయెన్=తగులుపడి చెడెను-చిల్వ=పాము, తాన్=తాను, వినికికిన్=వినుటకు-చిక్కె=చిక్కుపడెను-లేళ్లు, కనువేఁదుఱు= కంటిపిచ్చి, చెందెను=పొందెను-తేఁటి=తుమ్మెద, తావిలో=వాసనలో, మనికికిన్=ఉండుటచేత, నశించెను, ఇరుమూఁటిని=ఆఱింటిని-ఆఱు ఇంద్రియములను, గెల్వన్=జయించుటకు, తరమా=శక్యమా, ఐదుసాధనములన్= పంచవిధములైన ఉపాయముల చేత-ఈయుపాయముల మీఁదిపద్యమున చెప్పుచున్నాఁడు నీవె, కావనగు=కావవలయును.

తా. దాశరథీ! అడవిలో ఏనుఁగు ఆఁడుఏనుఁగును జూచియు, చేఁప గాలమునందలిఎరచవికిని, పాము పాములవానిఊఁదుస్వరమును వినుటకును, లేఁడి కనుపిచ్చి చేతను, తుమ్మెద తా

మరలోని పూఁదేనెవాసనకును లోనయ్యు చిక్కుకొను చున్నది. ఆటుఇంద్రియములను గెలువ నెవరితరము. కనుక ఇంద్రియలోలుఁడైన నాకును మోక్షము గలుగుట కష్టము గావున పంచేంద్రియములనిన్నుఁగొల్చు పంచవిధకైంకర్యములచేత ఇంద్రియముల నడఁచి నన్ను కాపాడుమూ.

చ. కరములుమీకుమ్రొక్కులిడఁ * గన్నులు మిమ్మునె
చూడజిహ్వ । మీ, స్మరణఁదనర్పవీనులుభ * వత్కథలన్
వినుచుండ నాసమీ। యటులను బెట్టుపూసరుల * కాసగొ
నం బరమార్థసాధనో। త్కర మది చేయవే కృపను * దా
శరథీ కరుణాపయోనిధీ. 84

టీ. కరములు = చేతులు, మీకున్, మ్రొక్కులు ఇడన్ = దండములు పెట్టఁగాను, కన్నులు, మిమ్మునె, చూడన్ = చూడఁగాను, జిహ్వ = నాలుక, మీస్మరణన్ = మిమ్ము స్మరించుటచేత, తనర్పన్ = ఒప్పఁగాను, వీనులు = చెవులు, భవత్ + కథల్ = మీవైన చరిత్రములను, వినుచుండన్ = వినుచుండఁగాను, నాస = ముక్కు, మీయటులను = మీమూపునందు, పెట్టు పూసరులకున్ = పెట్టునట్టిపూదండలకు, ఆసగొనన్ = ఆసపడఁగాను, అది = ఇట్లు ఆయాఅవయవములు మీకు ఆయా కార్యములుసేయుట, పర...త్కరము... పరమార్థ = సరియైన, సాధన = పురుషార్థములను సాధించెడియుపాయములయొక్క, ఉత్కరము = సమూహము.

తా. చేతులు మీకు మ్రొక్కుటయు కన్నులు మిమ్ముచూచుటయు, నాలుక మీనామమును జపించుటయు, చెవులు మీకథలను వి

నుటయు, ముక్తిమీమూఁడునందలి పూదండలను మారొక్కనఁగో రుటయు ననెడి యీమూఁడు వ్యాపారములే మోక్షమునకు సిద్ధికరమైన సాధనములు గాని తక్కినవి ఏవియు సాధనములు గావు.

చ. చిరతరభక్తి నొక్కతుల * సీ దళమర్పణ సేయు
వాఁడు ఖే । చరగరుడోరగప్రముఖ*సంఘములో వెలుఁ
గఁ సదా భవ। త్స్ఫురదరవిందపాదములఁ * బూజలొ
నర్చినవారికెల్లఁ ద। త్పర మఱచేతిధాత్రిగద * దాశరథీ
కరుణాపయోనిధీ. 85

టీ. చిరతరభక్తిన్=మిక్కిలి చిరకాలమునుండియున్న భక్తితో, ఒక్కతులసీదళము=ఒక్కతులసియాకు, అర్చనసేయువాఁడు=సమర్పించువాఁడు, ఖేచర...లోన్=ఖేచరులు గరుడులు ఉరగులు మొదలగు వీరియొక్క సమూహములోపల, వెలుఁగున్=ఒక్కఁడై ప్రకాశించును, సదా=ఎల్లప్పుడును, భవత్...పాదములన్-భవత్=నీయొక్క, స్ఫురత్=ప్రకాశించుచున్న, అరవింద=తామరలవంటి, పాదములన్=అడుగులను, పూజలు ఒనర్చినవారికిన్ ఎల్ల=పూజించినవారి కందఱికిని, తత్+పరము=ఆమోక్షము, అఱచేతి ధాత్రి=అఱచేతియుసిరిక, కద=అగునుకదా.

తా. రామా! బహుకాలము భక్తితోడ ఒక్కతులసియాకు నీకు సమర్పించినవాఁడు ఖేచరులు గరుడులు ఉరగులు మొదలగు వీరిలో నొక్కఁడై ప్రకాశించును. ఇఁక ఎవ్వడును నీపాదార

నీపదములను పూజ చేయువారికందఱికి మోక్షము కరతలామలక మేకదా.

ఉ. భానుఁడు తూర్పునందుఁ గను*పట్టినఁ బావకచం
ద్రతేజముల్ । హీనతఁ జెందినట్లు జగ*దేకవిరాజిత మై
ననీపద । ధ్యానము సేయుచున్నఁ బర*దైవమరీచు ల
డంగకుండనే । దానవగర్వనిర్దళన*దాశరథీ కరుణాప
యోనిధీ. 86

టీ. దాన...ర్దళన — దానవ = రాక్షసులయొక్క, గర్వ = గర్వమును, నిర్దళన = హరించువాఁడా, భానుఁడు = సూర్యుఁడు, తూర్పునందుఁ = తూర్పుదిక్కునందు, కనుపట్టినఁ = కనఁబడఁగా, పావ...జముల్ — పావక = అగ్నియొక్కయు, చంద్ర = చంద్రునియొక్కయు, తేజముల్ = కాంతులు, హీనతఁ జెందినట్లు = కొఱతపడినవిధమున, జగత్...తము — జగత్ = లోకమునకు, ఏక = ముఖ్యముగా — విరాజితము = ప్రకాశించునది, ఐన నీపదధ్యానము = అయినట్టి నీపాదములను ధ్యానించుట, చేయుచున్నఁ = చేయుచుండఁగా, పరదైవమరీచులు = ఇతరదైవములకాంతులు, అడంగకుండునే = అణఁగిపోవకుండునా.

తా. సూర్యుని కాంతికి అగ్నిమొదలగు వానికాంతు లడఁగునట్లు జగత్త్రయము ప్రకాశించుచున్న నీపదధ్యానముయొక్క ప్రకాశమునకు ఇతరదేవతల ప్రకాశములు అడఁగి పోవుననితాత్పర్యము - నీపదములందు భక్తి కుదిరినయెడల ఇతరదేవతలందలి భక్తి తప్పిపోవునని యాశయము.

ఉ. నీ మహనీయతత్త్వరస * నిర్ణయబోధకథామృ
తాబ్ధిలోఁ। దామునుగ్రుంకులాడక వృ*థా తనుకష్ట
ముఁజెంది మానవుం। డీమహిలోకతీర్థముల*నెల్ల ము
నింగిన దుర్వికారహృ। త్తామసపంకముల్ విడునె*దా
శరథీ కరుణాపయోనిధీ. 87

టీ. నీమహా...బ్ధిలోఁ- నీ, మహనీయ = గొప్పదైన, తత్త్వరస= తత్త్వసారము యొక్క, నిర్ణయ = సిద్ధాంతముగల, బోధ = జ్ఞానము కలిగిన, కథా=కథలనెడి, అమృత+అబ్ధిలోన్-అమృతమయమైన సముద్రమునందు, తాన్ = తాను, మును = ముందు, గ్రుంకులాడక = మునుఁగక, వృథా = వ్యర్థముగా, అతనుకష్టమున్-మిక్కిలి శ్రమను, చెంది = పొంది, మానవుండు = మనుష్యుఁడు, ఈ మహిలోక తీర్థములన్ ఎల్లన్ = ఈ భూలోకమందలి తీర్థములయందంతటను, మునింగినన్ = గ్రుంకఁగా, దుర్వి...పంకముల్-దుర్వికార= చెడువికారములుగల, హృత్ = హృదయముయొక్క. తామస = తమోగుణసంబంధమగు కార్యములనెడి, పంకముల్=రొంపులు, విడునె=విడిచిపోవునా.

తా. రామా! నీ మహనీయతత్త్వముయొక్క సారస్యమిట్టిదని నిర్ణయించి తెలుపు నీదివ్యచరిత్రమనెడి యమృత సముద్రమందు ముందు గ్రుంకులిడిననే దిర్వికారమైన హృదయమందలి తామసములనెడి రొంపులు తీసిపోవునుగాని కేవలము ఈ భూలోకమందలి తీర్థములందు మునిఁగినయెడల అవి తీసి పోవవు.

ఉ. కాంచనవస్తుసంకలిత*కల్మష మగ్నిపుటంబు పె
ట్టి వా। రించినరీతి నాత్మ నిగి*డించిన దుష్కరదుర్మల
త్రయం। బంచితభక్తియోగదహ*నార్చిఁ దగుల్పక పా
యునే కన। త్కాంచనకుండలాభరణ*దాశరథీ కరుణాప
యోనిధీ. 88

టీ. కనత్...భరణ-కనత్=ప్రకాశించుచున్న, కాంచన=బంగారుమయమైన, కుండల=కుండలములు, ఆభరణ=సొమ్ముగాఁగలవాఁడా, కాంచన...కల్మషము-కాంచనవస్తు=బంగారుపదార్థమునందు, సంకలిత=లెస్సగగూడియున్న, కల్మషము=మాలిన్యము, అగ్నిపుటంబుపెట్టి=అగ్నిపుటము వేసి, వారించినరీతిన్=తొలఁగించినవిధమున, దుష్కర...త్రయంబు-దుష్కర=చేయరాని-పోఁగొట్టరాని, దుర్మలత్రయంబు=చెడ్డవియైన మూఁడుమలములను- అంచిత...నార్చిన్-అంచిత=ఒప్పుచున్న, భక్తియోగ=భక్తియోగమనెడి, దహన=అగ్నియొక్క, అర్చిన్=జ్వాలయందు, తగుల్పక=తగులఁబెట్టక, పాయునే=విడిచిపోవునా.

తా. రామా! బంగారులోనిమాలిన్యము అగ్నిపుటము పెట్టఁగా పోవునట్లు ఆత్మయందుఁగల మూఁడుమలములును నీయందలి భక్తి యోగముచేతనే నశించునుగాని మఱొకవిధమున నశింపదు.

ఉ. నీసతి పెక్కుగల్మ లిడ*నేర్పరి, లోక మకల్మషం
బుగా। నీసుత సేయుఁ బావనము, *నిర్మితకార్యధురీణవ
త్సుఁడై। నీసుతుఁ డిచ్చునాయువులు, *నిన్ను భజించినఁ

గల్గకుండునే। దాసుల కీప్సి తార్థములు*దాశరథీ కరుణా
పయోనిధీ. 89

టీ. నీసతి = నీభార్య, పెక్కు-కల్ములు = అనేకసంపదలు, ఇ
డన్ = ఇచ్చుటకు, నేర్పరి = నిపుణురాలు, నీసుత = (నీపాదము
లందుఁ బుట్టుటచే) నీకూఁతురైన గంగ, లోకము = జగము, అక
ల్మషంబు కాన్ = నిర్దోషమగునట్లుగా, పావనముసేయున్ = ప
విత్రముగాఁ జేయును, నీసుతుఁడు = నీకొడుకైన బ్రహ్మ, నిర్మి...
దక్షుఁడై-నిర్మిత కార్య = సృష్టికార్యముయొక్క-, ధురీణ = భార
మునందు, దక్షుఁడై = నేర్పరియై, ఆయువులు = ఆయుష్యములు, ఇ
చ్చును. నిన్నున్ = (ఇట్టిభార్యయు కూఁతురును కొడుకునుగల) ని
న్ను, భజించినన్ = కొలువఁగా, దాసులకున్ = నీభృత్యులకు-
ఈప్సిత + అర్థములు = కోరిన ప్రయోజనములు, కల్గకుండునే = ల
భింపకపోవునా-లభించునే యనుట.

తా. రామా ! నీభార్యయైన లక్ష్మిసమస్తసంపదల నిచ్చుటకుని
పుణురాలు. నీకూఁతురైనగంగ ముల్లోకములందును ప్రవహించి లో
కములందలిదోషములను పోఁగొట్టి పవిత్రముగాఁజేయును. నీకొడు
కైన బ్రహ్మ సృష్టికార్యమంతయు నిర్వహింప సమర్థుఁడై ఆయు
వులనిచ్చును. ఇట్టి పుత్రకళత్రాదులుగల నిన్ను భజించిన నీభక్తు
లకు కోరినకోర్కు-లు ఈడేరకపోవు.

ఉ. వారిజపత్త్ర మం దిడిన*వారివిధంబున వర్తనీయ
మం। దారయ రొంపిలోనఁ దను*వంటనికుమ్మరపుర్వురీ

తి సం। సారమునన్ మెలంగుచు వి*చారగుఁడై వరమొం
దుఁగాదెస। త్కార మెఱింగి మానవుఁడు*దాశరథీ క
రుణాపయోనిధీ. 90

టీ. వారిజపత్రమందు = తామరాకునందు, ఇడిన వారివిధంబునన్=ఉంచిన జలమురీతిని, ఆరయన్=విచారింపఁగా, రొంపిలోనన్= బురదయందు, తనువు= దేహము, అంటనికుమ్మరపురుగురీతిన్= తగులుకొనని కుమ్మరపురుగు విధమునను, సంసారముననున్=సంసారమందు, మానవుఁడు=మనుష్యుఁడు, మెలంగుచున్=ప్రవర్తించుచు, విచారగుఁడై= తత్త్వవిచారమును పొందినవాఁడై, సత్కారము=పూజను, ఎఱింగి=తెలిసి, వరమున్= మోక్షమును, ఒందన్ కాదె=పొందును గదా.

తా. రామా! తామరాకునందలినీటిబొట్టు ఆతామర యందే వర్తించుచుండియు దానియందెట్లు అంటుకొనదో, రొంపిలో కుమ్మరపురుగు మెలఁగినను అందు దేహము అంటుకొనక యెట్లుండునో, యట్లే పురుషుఁడైనవాఁడు సంసారమందు ప్రవర్తించుచుండినను తత్త్వవిచారమును పొంది సంసారమున తగులువడక మోక్షమును ప్రాపించును గదా.

ఉ. ఎక్కడితల్లిదండ్రి సుతు*లెక్కడివారు కళత్రబాం
ధవం। బెక్కడ జీవుఁ డెట్టితను*వెత్తినఁ బుట్టుచుఁ బ్రో
వుచున్నవాఁ। డొక్కఁడె పాపపుణ్యఫల*మొందిన నొ
క్కఁడె కానరాఁడు వే। ఱొక్కఁడు వెంటనంటి భవ*మొ

ల్లనయా కృపఁజూడవయ్యనీ। తక్కరిమాయలం దిడక*
దాశరథీ కరుణాపయోనిధీ. 91

టీ. ఎక్కడితల్లిదండ్రి=తల్లియు తండ్రియు ఎక్కడివారు-సుతులు= కొడుకులు, ఎక్కడివారు= వారితోడిసంబంధమెక్కడిది, కళత్రబాంధవంబు= పెండ్లామనెడిచుట్టరికము, ఎక్కడ=ఏమిసంబంధము-ఏలనఁగా, జీవుఁడు= దేహధారి, ఎట్టితనువు=ఎట్టిదేహమును, ఎత్తినన్=ధరించినను-ఎంతటిగొప్పజన్మము ఎత్తినవాఁడైనను, ఒక్కఁడే=తాను ఒకఁడే, పుట్టుచున్=జన్మించుచును, పోవుచున్= మరణించుచును, ఉన్నవాఁడు- ఇంతేకాక, పాపపుణ్యఫలము=తాను చేసినపాపములకును పుణ్యములకును కలుగుఫలము, ఒందినన్=పొందఁగా-ఒక్కఁడే=తాను ఒక్కఁడే కాని-వెంటనంటన్=వెంటనేపోవుటకు, వేఱు ఒక్కఁడున్=మఱియొక్కఁడుగాని, కానరాఁడు=కనఁబడడు కాఁబట్టి,భవము= పుట్టుక, ఒల్లనయా=ఇచ్ఛగింపనయ్యా, నీతక్కరిమాయలందు=నీకపటపు మాయలందు-ఇడక=నన్ను పెట్టక-కృపన్= దయతో, చూడవయ్య=చూడుమీ.

తా. రామా! తల్లిదండ్రులు కొడుకులు పెండ్లము అనువారు కర్మానుగుణముగా నడుమ వచ్చినవారే కాని శాశ్వతముగా సంబంధించియుండువారు గారు, ఏలనఁగా ఒకఁడు ఎట్టిజన్మమెత్తినపుడుగాని పుట్టునపుడును చచ్చునపుడును పుణ్యపాపఫలముల ననుభవించునపుడును తా నొక్కఁడే యగును గాని మీఁదచెప్పినతల్లిదండ్రులు మొదలైనవారు వానితో కూడ వచ్చుటగాని,పోవుటగా

ని అనుభవించుటగాని లేదు. కాబట్టి యిట్టివారి సంబంధము గల సంసారము నాకక్కఱ లేదు. నీవు నాతో వేడుకలు సేయక నిజముగా సంసారమునుండి తప్పించి నన్నుఁగాపాడుమూ.

చ. దొరసినకాయముల్ముదిమి*తోఁ జినఁజూచి ప్ర
భుత్వముల్సిరుల్ । మెఱుపులుగాఁగఁజూచి మఱి*మేదిని
లోఁదమతోడివారు ముం । దఱుగుటఁజూచిచూచి తెగు*
నాయువెఱుంగక మోహపాశము । ద్దఱుఁగనివారి కేమి
గతి*దాశరథీ కరుణాపయోనిధీ. 92

టీ. దొరసిన కాయముల్=కలిగిన దేహములు, ముదిమి=ముసలితనము, తోఁచినన్=తోఁపఁగా, చూచి, ప్రభుత్వముల్=దొరతనములు, సిరుల్=సంపదలు, మెఱుపులుగాఁగన్=మెఱుపులఁగలవలె-చూచి=తెలిసికొని, మఱి=మఱియు, మేదినిలోన్=భూమియందు, తమతోడివారు=తమతోఁగూడ పుట్టి పెరిఁగినవారు, ముందు=తమకు మునుపు అఱుగుట=పోవుటను-చచ్చుటను, చూచి చూచి=చక్కఁగా తెలిసి, తెగు ఆయువున్=నశించునట్టి ఆయుష్యమును- ఎఱుంగక=తెలిసికొనక, మోహపాశముల్=అజ్ఞానపుత్రాళ్లు-తఱుఁగనివారికిన్=తగ్గనివారికి, ఏమిగతి = ఏమిదిక్కు.

తా. శరీరములు ముదిసిపోవుటచేతను దేహము అస్థిరమనియు, ప్రభుత్వాదులు నశించుటచే సంపదలు అస్థిరములనియు, తమతోడివారు ముందుగానేచచ్చి యుండుటచే తాము ను చావవలసినవారనియు, చక్కఁగా తెలియుచుండినను ఆయువు నశించునని తెలి

యక అస్థిరములైన యీదేహాదులయందే అజ్ఞానముయొక్క పాశములచే కట్టుపడుచున్నారే ! ఇట్టివారికి కలుగఁగల స్థితియేమి ?

చ. సిరిగలనాఁడు మైమఱచి*చిక్కిననాఁడుఁ దలంచి పుణ్యముల్। పొరిఁ బొరిఁ జేయనైతినని * పొక్కినఁగల్గునె గాలిచిచ్చుపైఁ। గెరలినవేళఁ దప్పిగొని*కీడ్పడువేళ జలంబు గోరి త। త్తరమునఁ ద్రవ్వినం గలదె*దాశరథీ కరుణాపయోనిధీ. 93

టీ. సిరి=సంపద, కలనాఁడు=కలిగియుండిన దినములందును, మైమఱచి=దేహము తెలియుట తప్పి- చిక్కిననాఁడు=ఉన్న దినములందును, తలంచి=ఆలోచించి, పుణ్యముల్= పుణ్యకార్యములను, పొరిఁబొరిఁ=మాటిమాటికి, చేయనైతిని అని= చేయకపోయితిని అని, పొక్కినన్=తపింపగా, కల్గునె=ఫలము గలుగునా- ఇందులకు దృష్టాంతము—గాలి, చిచ్చుపై = అగ్గిమీఁద, కెరలినవేళన్=విజృంభించినప్పుడు, దప్పిగొని, కీడ్పడువేళన్ = సుళ్ళికొను సమయమందును, జలంబున్=నీటిని, గోరి = ఆసించి, తత్తరమునన్=తడఁబాటుతో - ద్రవ్వినన్=భూమిలో త్రవ్వఁగా, కలదే=నీళ్ళుకలుగునా.

తా. సంపదయుండిన కాలమందును, సంపదచే మత్తిల్లి ఒడలు మఱచి యుండిన కాలమందును, ఆలోచించి పుణ్య కార్యములు మాటికి చేయకపోతినే యని దారిద్ర్యము వచ్చినవెనుక చింతించుట, గాలిచే మిక్కిలి రేఁగిననిప్పను ఆర్పుటకును, దప్పిగొని

మిక్కిలి సురుగునపుడును, జలమునకై భూమిని వేగపడి త్రవ్వట యెట్లో ఆట్లే వ్యర్థ మగును.

ఉ. జీవన మింకc బంకమునc * జిక్కినమీను చలింప
కెంతయుం । దావున నిల్చి జీవనమె * తద్దయుc గోరువి
ధంబు చొప్పడం । దావలమైనc గాని గుటి * దప్పని
వాcడు తరించువాcడయా । తావకభక్తియోగమున *
దాశరథీ కరుణాపయోనిధీ. 94

టీ. జీవనము=నీళ్ళు, ఇంకన్=ఇంకిపోcగా, పంకమునన్ = బురదయందు, చిక్కినమీను = చిక్కుపడిన చేcప, ఎంతయున్= ఎంతమాత్రమును, చలింపక=కదలక, తావునన్=తానున్నచోటనే- ఉండి, జీవనమె=నీటినే- లేక బ్రతుకునే, తద్దయున్=మిక్కిలి, కోరువిధంబు=కోరునట్టిరీతి, చొప్పడన్ =కలుగునట్లుగా, తావలమైన దానిన్= స్థానమైన దానిని - గుటిదప్పనివాcడు = సూటిచెడనివాcడు-తావకభక్తియోగమునన్= నీదైనభక్తితోడి కూడికచే- నీయందలిభక్తిచేత ననుట, తరించువాcడయా=సంసారమును దాcటువాcడు అయ్యా.

తా. చేcప, నీళ్ళు ఎండిపోయి బురదలో చిక్కుకొన్నను ఆ చోటునువిడిచి కదలక అందే నిలిచి నీళ్ళనే బ్రతుకునకై కోరునట్లు, నీయందలిచింతనమునందే గుటి యుంచి యెన్ని కష్టములు వచ్చినను దానిని వదలక యుండువాcడు అట్లుండుటచే నీయెడల భక్తి యుదయించి ఆభక్తియోగమున సంసారమును దాcటు నని తాత్పర్యము.

చ. సరసునిమానసంబు సుర * సజ్ఞుఁడెఱుంగును ము
ష్కరాధముం। డెఱిఁగి గ్రహించువాఁడె కొల * నేకని
వాసము గాఁగ దర్దురం। బరయఁగ నేర్చునెట్లు విక *
చాబ్జమరందరసైకసౌరభో। త్కరము మిళింద మొందు
క్రియ * దాశరథీ కరుణాపయోనిధీ. 95

టీ. సరసునిమానసంబు=రసజ్ఞునిమనస్సును- సురసజ్ఞుఁడు= మిక్కిలిరసము దెలిసినవాఁడు- ఎఱుంగును=తెలియును, ముష్కర+అధముండు=మొఱకైన నీచుఁడు, గ్రహించువాఁడె=గ్రహింపఁగలఁడా- ఇందులకు దృష్టాంతము:— దర్దురము= కప్ప, కొలను=సరస్సు, ఏకనివాసము గాఁగన్=ఒక్కటే ఉనికిపట్టు కాఁగా-వికచా...త్కరమున్-వికచ= ఆకొలఁకునందు వికసించిన, అబ్జ=తామరయొక్క, మరందరస=పూఁదేనె ద్రవముయొక్క, ఏక=ముఖ్యమైన-సౌరభ= వాసనలయొక్క-, ఉత్కరము= సమూహమును, మిళిందము= (దూరమునసుండు) తుమ్మెద, ఒందు క్రియన్=పొందురీతిని-ఎట్లు=ఏరీతిని, అరయఁగ నేర్చు=విచారించి తెలిసికొన నేర్చును.

తా. రామా! కప్ప సరస్సులోనే యెప్పుడు వాసముచేయుచుండునదైనను అందు విరిసిన తామరలయందలిపూఁదేనెవాసనలను తెలియఁజాలదు. తుమ్మెదయో, దానిని తెలిసి యనుభవించును. ఇట్లే రసికుని మనస్సులోనిభావమును రసికుఁడే తెలిసికొని యానందింపఁగలఁడుగాని మూఢుఁడైనయల్పుఁడు తెలిసికొనఁజాలఁడు.

ఉ. నోఁచినతల్లి దండ్రికిఁ ద*నూభవుఁ డొక్కఁడె చా
లు మేటి, చే। చాఁచనివాఁడు, వేఱొకఁడు*చాఁచిన లే
దన కిచ్చువాఁడు, నో। రాఁచి నిజంబ కానిపలు*కాడని
వాఁడు, రణంబులోన మేన్। దాఁచనివాఁడు భద్రగిరి*
దాశరథీ కరుణాపయోనిధీ. 96

టీ. నోఁచినతల్లిదండ్రికిన్ = పూర్వజన్మమందు పుణ్యవ్రతములు నోఁచినట్టి తలిదండ్రులకు, చే = చేయి, చాఁచనివాఁడు = యాచింపనట్టివాడు, వేఱు ఒకఁడు = మఱియొకఁడు, చాఁచినన్ = (తన్నుఁగూర్చి) చేయిచాఁపఁగా - లేదు, అనక, ఇచ్చువాఁడు = వాఁడు యాచించినది యిచ్చునట్టివాఁడును, నోరు, ఆఁచి = అడ్డగించి - నిజంబ = నిజమే - సత్యమే - కానిపలుకు = కానట్టిమాటను, ఆడనివాఁడు = చెప్పనివాఁడును - రణంబులోనన్ = యుద్ధమునందు, మేన్ = ఒడలిని, దాఁచనివాఁడు = మాటుచేయనివాఁడు - ఇట్టివాఁడైన, మేటి = శ్రేష్ఠుఁడగు, తనూభవుఁడు = కొడుకు, ఒక్కఁడె, చాలున్ = చాలును.

తా. ఒకరిని యాచింపనివాఁడును, ఒకరు తన్ను యాచింపఁగా లేదన కిచ్చువాఁడును, నోరాడి యబద్ధము చెప్పనివాఁడును, యుద్ధమందు వెనుదీయనివాఁడును, అగుకొడుకు భాగ్యముచేసిన తల్లిదండ్రులకు ఒక్కఁడే కలిగినఁజాలును. పెక్కండ్రు వలదు.

ఉ. శ్రీయుత జానకీరమణ*చిన్మయరూప రమేశ రా
మ నా। రాయణ పాహి పాహి యని*ప్రస్తుతిఁజేసితి నా

మనంబునం। బాయక కిల్బిషవ్రజవి*పాటన మందఁగఁ జేసి
సత్కళా। దాయిఫలంబు నా కియవె*దాశరథీ కరుణాప
యోనిధీ. 97

టీ. శ్రీయుత=కాంతితోఁ గూడినవాఁడా, జానకీరమణ=సీతా
దేవికి పెనిమిటియైనవాఁడా, చిత్ + మయ= జ్ఞానమయమైన, రూ
ప=స్వరూపముగలవాఁడా, రమా+ఈశ= లక్ష్మికి పతియైనవాఁ
డా, రామ=అందఱిని రమింపఁజేయువాఁడా, నారాయణ=నార
ములను సకలచేతనాచేతనములును వాసస్థానముగాఁ గలవాఁడా,
పాహి పాహి యని=కావుము కావుము అని, ప్రస్తుతిఙ్ చేసితి=
స్తోత్రముచేసితిని. నామనంబునన్=నా మనస్సునందు, పాయక=
విడువక, కిల్బి...పాటనము-కిల్బిష=పాపములయొక్క, వ్రజ=
సమూహములయొక్క, విపాటనము = ఖండించుటను, అందఁ
గన్ చేసి=లభించునట్లుచేసి, సత్ కళాదాయి- సత్కళా= మంచి
కళను, దాయి=ఇచ్చునట్టి, ఫలంబున్=ఫలమును, నాకు, ఇయ
వే=ఇమ్ము.

ఉ. ఎంతటిపుణ్యమో శబరి * యెంగిలి గొంటివి విం
త గాదె నీ। మంతన మెట్టిదో యుదుత*మైని గరాగ్రి
నఖాంకురంబులన్। సంతసమందఁ జేసితివి*సత్కులజన్మ
ములేమి లెక్క వే। దాంతముగాదె నీమహిమ*దాశ
రథీ కరుణాపయోనిధీ. 98

టీ. శబరియెంగిలిన్=శబరి కొఱికి చవిచూచుటచే ఎంగిలియైన పండ్లను, కొంటివి=భక్షించితివి, ఎంతటిపుణ్యమో=అది చేసికొన్నపుణ్యము ఎంత అతిశయించినదో, వింత కాదె=ఇదిఆశ్చర్యముకదా, నీమంతనము = నీరహస్యము-ఎట్టిదో = ఎటువంటిదో, ఉ. ఉడుతమైని = ఉడుతదేహమున, కర...తంబులన్ - కరాగ్ర = వ్రేళ్లయొక్క- నఖ+అంకురములన్ = గోటిమొనలచేత-సంతసము అందన్=సంతోషపడునట్లు, చేసితివి-ఇట్లు దయఁజూచుటచేత, సత్+కుల+జన్మములు = మంచి వంశమును పుట్టుకలును, ఏమిలెక్క=నీకేమి లక్ష్యము-నీమహిమ=నీమహాత్త్వము, వేదాంతముగాదె=వేదాంతమేకదా.

తా. శబరియెంగిలిని తింటివి. అది యెంతపుణ్యము చేసికొన్నదో ఆశ్చర్యముగా నున్నది. ఉడుతమైని మునిగోళ్ళతో గీఱి సంతోషపెట్టితివి. దానిపై నింతవాత్సల్యము కలుగుటకు రహస్యమేమో తెలియకున్నది. విచారించిచూడఁగా నీవు జాతిని కులమును పాటించువాఁడవు కావు. ఔను. నీమహాత్త్వము వేదాంతప్రతిపాద్యమగునంతవిస్తారమైనది. కాన నీరక్షణమునకును శిక్షణమునకును కారణములు మముబోఁటులకు తెలియవు.

ఉ. బొంకనివాఁడె యోగ్యుఁ డరి*బృందము లెత్తి
నచోటఁ జివ్వకున్ । జంకనివాఁడె జోదు రభ*సంబున
నర్థి కరంబు సాఁచినం। గొంకనివాఁడె దాత మిముఁ*
గొల్చి భజించినవాఁడెపో నిరా । తంకమనస్కుఁ డెన్నఁ
గను * దాశరథీ కరుణాపయోనిధీ. 99

టీ. బొంకని వాఁడె = అబద్ధము చెప్పని వాఁడే, రాఘవుఁడు, అరిబృందములు = శత్రుసమూహములు, ఎత్తిన చోటన్ = దండెత్తి వచ్చిన యెడల, చివ్వకున్ = యుద్ధమునకు, జంకని వాఁడె = వెనుదీయని వాఁడే, జోదు = యోధుఁడు - రభసంబునన్ = వేగముగా, అర్థి = యాచకుఁడు, కరంబు = చేతిని, చాఁచినన్ = చాఁపఁగా, కొంకని వాఁడె = ఇచ్చుటకు మిణకరింపని వాఁడే, దాత, మిమున్ = మిమ్ము, కొల్చి = సేవించి, భజించిన వాఁడె = భక్తి చేసిన వాఁడే, నిరాతంకమనస్కుఁడు - నిరాతంక = ఆటంకము లేని - కాలుష్యము లేని, మనస్కుఁడు = మనస్సుగల వాఁడు - నిన్నుఁ గొలిచిన వాని మనసే నిర్మలముగా నుండునని భావము.

తా. సుగమము.

చ. భ్రమరము కీటకంబుఁ గొని*పాల్పడి ఝుంకరణోపకారియై । భ్రమరముగా నొనర్చునని*పల్కుటఁ జేసి భవాదిదుఃఖసం । తమస మెడల్చి భక్తసహి*తంబుగ జీవుని విశ్వరూపత । త్త్వమున ధరించు టే మరుదు* దాశరథీ కరుణాపయోనిధీ. 100

టీ భ్రమరము = తుమ్మెద, కీటకంబు = పురుగును, కొని, పాల్పడి = దానికై పూని, ఝుంకరణ + ఉపకారియై = ఝుంకారము చేత ఉపకరించి ఝుంకారము చేసియనుట, భ్రమరముగాన్ = తుమ్మెదగా, ఒనర్చునని = చేయునని, పలుకుటఁ జేసి = చెప్పుటచేత - జీవునిన్, భవా...తమసము - భవ = పుట్టుక, ఆది = మొదలు

గాఁగల, దుఃఖసంతసము=దుఃఖములనెడి చీఁకటిని, ఎడలించి= పోఁగొట్టి, భక్తిసహితంబుగన్= భక్తితోఁగూడ- లేక 'భక్తిజనితంబుగన్' అను పాఠమున, భక్తి ఉదయింపఁగా, విశ్వరూపతత్త్వమునన్ = నీయొక్క విరాడ్రూపస్వరూపమునందు, ధరించుట=తాల్చుట, ఏమి అరుదు=ఏమి యాశ్చర్యము.

తా. ఒక కేవలజంతు వైనతుమ్మెద, పురుగునుతనవలె తుమ్మెనగాఁ జేయుట లోకమున తెలియుచుండఁగా నీవు, జీవుని దుఃఖములుపోఁగొట్టి, భక్తికలిగించి, వానికి నీతోడిసారూప్యమును ఒసఁగుట ఆశ్చర్యము కాదని తాత్పర్యము.

చ. తరువులు పూచి కాయ లగుఁ * దత్కుసుమంబులు పూజగాభవ। చ్చరణము సోఁకి దాసులకు * సారము లౌధనధాన్యరాసు లై। కరిభట ఘోటకాంబరని* కాయము లై విరజానదీసము। ద్ధరణ మొనర్చుఁ జిత్రమిది * దాశరథీ కరుణాపయోనిధీ. 101

టీ. తరువులు=చెట్లు, పూచి=పుష్పించి, కాయలగున్=కాయలు కాచును, తత్+కుసుమంబులు=ఆపూవులు, పూజగా= (కోసి) పూజార్థముగా, భవత్+చరణము=నీపాదమును, సోఁకి=తాఁకి, దాసులకు=నీభక్తులకు, సారములు = శ్రేష్ఠములు, ఔ ధనధాన్యరాసులై=అగునట్టిధనధాన్యములకుప్పలై, కరి... కాయములై-కరి=ఏనుఁగులు, భట=బంటు, ఘోటక=గుఱ్ఱము

లు, అంబర=వస్త్రములు, వీనియొక్క-, నికాయములై=సమూహములై, విరజా...త్తరణము-విరజానదీ=పరమపదపు ఎల్లగానుండు విరజ అను ఏటిని, సముత్తరణము=దాఁటుటను, ఒనర్చుఁగా=చేయును, ఇది=నీపాదములు సోఁకినపూలు, చిత్రము=ఆశ్చర్యము.

తా. రామా! చెట్లయందలిపూవులు అట్లే యుండినయెడల కాయలగును. వానినే కోసి నీపాదములందు పూజార్థము సమర్పించఁగా అవి నీయడుగులు సోఁకగానే మేలైన ధనధాన్యములును ఏనుఁగులు బంట్లు గుఱ్ఱములు వస్త్రములు మొదలైనవిగా ఇహలోకమున పరిణమించి పరమపదమును కలిగించును. చెట్టుననేయున్నప్పుడు అవి పట్టికాయ లగుటయు నీపాదములు సోఁకినప్పుడు ధనధాన్యాదియిహపరసుఖము లగుటయు ఆశ్చర్యముగానున్నది.

ఉ. పట్టితి భట్టరార్యగురు*పాదము లిమ్మెయి నూర్ధ్వ
పుండ్రముం । బెట్టితి మంత్రరాజ మొడిఁ * బెట్టితి నయ్య
మకింకరాళికిం । గట్టితి బొమ్మ మీచరణ*కంజములందుఁ
దలంపు వెట్టి పోఁ। దట్టితిఁ బాపపుంజముల*దాశరథీ కరు
ణాపయోనిధీ. 102

టీ. భట్టరార్యగురుపాదములను= భట్టరాచార్యులు అనుగురువుయొక్క- చరణములను, పట్టితిఁ=చేపట్టితిని- ఈమెయిఁ=ఈదేహమున, ఊర్ధ్వపుండ్రముఁ=తిరుమణి శ్రీచూర్ణములను, పెట్టితిని, మంత్రరాజము=మంత్రశ్రేష్ఠమైన తిరుమంత్రమును, ఒడిఁ బెట్టితిఁ=గ్రహించితిని, దానిచేత, అయమకింకర+ఆళికిఁ=అయ

మదూతలసమూహమునకు, బొమ్మక్కట్టితిని=జయించితి-ఏమరలించితి ననుట, మీచరణకంజములందు = మీపాదారవిందములందు, తలఁపువెట్టి=మనస్సునుంచి, పాపపుంజములన్ = పాపసమూహములను, పోఁతట్టితిని=పోవునట్లుఎగఁజిమ్మితిని.

తా. భట్టరాచార్యులశిష్యుఁడనై, తిరుమణి శ్రీచూర్ణములు ధరించి, తిరుమంత్ర ముపదేశమొంది, నరకము తొలఁగించుకొనిమీ పాదారవిందములను చింతించుచు, పాపములను పోఁగొట్టుకొన్నవాఁడనైతిని.

ఉ. అల్లన లింగమంత్రిసుతుఁ*డత్రిజగోత్రజుఁ డాదిశాఖ కం। చెర్లకులోద్భవుం డనఁ బ్ర*సిద్ధుఁడనై భవదంకితంబుగా। నెల్లకవుల్ నుతింప రచి*యించితి గోపకవీంద్రుఁడన్ జగ। ద్వల్లభ నీకు దాసుఁడను*దాశరథీ కరుణాపయోనిధీ. 103

టీ. జగత్ + వల్లభ=జగన్నాథా, లింగమంత్రిసుతుఁడు=లింగమంత్రికొడుకు, అత్రిజగోత్రుఁడు=ఆత్రేయగోత్రము గలవాఁడు, ఆదిశాఖ=ఋగ్వేదశాఖవాఁడు, కంచెర్లకుల+ఉద్భవుఁడు=కంచెర్లకులమునఁ బుట్టినవాఁడు; అనన్=అనఁగా, ప్రసిద్ధుఁడనై, భవత్+అంకితముగాన్=నీకు అంకితముగా, ఎల్లకవుల్ నుతింపన్=పొగడఁగా, రచియించితిని=ఈశతకము చేసితిని, గోపకవీంద్రుఁడన్ = గోపకవిశ్రేష్ఠుఁడను, నీకున్, దాసుఁడను=భృత్యుఁడను.

తా. రామా! నేను లింగమంత్రికుమారుఁడను. నాది ఆత్రేయ గోత్రము. ఋగ్వేదముశాఖ. కులము కంచెర్లకులము. పేరుగోప కవి. నీకు దాసుఁడను. కవులందఱును పొగడునట్లుగా ఈశతకమును రచించి నీకు అంకితము సేసితిని.

దాశరథిశతకము సమాప్తము.



హాస్యరసప్రధానమగు,

తెనాలి రామలింగని వింతకథలు.

ఆర్యులారా! కవులలో వాల్మీకియు, పర్వతములలో హిమవంతమును, నదులలో గంగయు, పుణ్యక్షేత్రములలో కాశియు, శ్రేష్ఠములైనట్లు, కథలలో రామలింగని కథ లాహ్లాదకరముగను, చమత్కారముగను ఉండునని విద్వదాబాలగోపాలమునకు దెలియుననుట నిర్వివాదాంశము. రామలింగని కథల శ్రేష్ఠత్వమును మేము క్రొత్తగఁ జెప్పనక్కరలేదు. వానియందలి మాధుర్యాదిగుణములు అందరకుఁ దెలిసియున్నవే. వాని నిప్పుడు క్రొత్తగ ముద్రించిన 'తెనాలిరామలింగని హాస్యకథల'ను గూర్చి కొంత చెప్పదగును.

తెనాలిరామలింగని కథలను చేర నిదివఱ కనేకులనేక గ్రంథములను వ్రాసియున్నారు. వాని నొకరు చెప్పుచుండగా వినినప్పుడు ఆనందము కలుగునట్లు పుస్తకములఁ జదువునప్పుడు చమత్కారముగ నుండుటలేదు. అట్లుగాక స్త్రీలకు, బాలురకు, పండితులకు, పామరులకు, ఉద్యోగులకు, నిరుద్యోగులకు, గ్రామస్థులకు, ప్రయాణస్థులకు, వర్తకులకు, ప్లీడర్లకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, ఆంధ్రులకు, తెనుగు చదువఁగల యన్యదేశస్థులకు, వీరు వారననేల? తెలుఁగు తెలిసినవారికెల్లను ఆనందకరముగ వ్రాసినాము.

ఒంటరిగా నీగ్రంథమందలి కథలను చదువునప్పుడు పకపకన నవ్వువచ్చి చెంతనున్నవారా నవ్వునకు కారణమేమన బదులు చెప్పజాలక, యామాట తలంపునకు వచ్చినప్పుడెల్ల నొక్కరో చక్కలిగింత పెట్టుచున్నట్లు నవ్వుటతోనే సరిపోవుచుండును. ఒక కథా? ఒక శ్లోకమా? యీపుస్తకమును చదివినఁగాని దీని మాధుర్యము, ఆనందము చమత్కారము, కౌతుక, హాస్యము, నవ్వు, వృద్ధియగుచునే యుండును

పోస్టేజి గాక 4 అణాలు మాత్రమే.

రామా అండు కో.

ఈక్రింద వివరించ్ని గ్రంధములు ఈక్రిందిచిరునామాలకు
వ్రాసిన వెలకుదొరకును.

పద్మిని ఒక చిన్ననవల (కథామంజరిప్రథమపుష్పము)	0-2-0
విజయరాఘవనాటకము.	1-0-0
ప్రణయమహిమ లేక సుబ్బారావునవల ...	0-8-0
శ్రీస్వయంవరం (శ్రీయుత ఆచంట లక్ష్మీపతి బి ఏ. యం. బి. సి. యం. గారి పెండ్లికథ)	0-8-0
శుభద్రాహరణము (సంస్కృతమునకు సరియైన యాంధ్రీకరణము)	0-4-0

మేనేజరు,

సర్కార్సు లిటరరీ యెంపోరియం, ఏలూరు.

గబ్బిట యజ్ఞన్నశాస్త్రిగారి కృతులు, జావళీలు, భజనకీర్తనలుగల భక్తిజనమనోల్లాసమను పుస్తకము.	0-4-0

వలయువారు—

మేనేజరు రామమోహనప్రెస్సు, ఏలూరు.